www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 30 No | విజయవాడ, గురువారం 31 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs



బంగారం @ రూ.34 వేలు

6

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం



3

# సొంత కృషితో ముందుకు

## ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్

- ఇంకా పరిష్కారం కాని విభజన సమస్యలు
- జాతీయ సగటు కన్నా ఎక్కువ అభివృద్ధి
- కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు



గవర్నర్ చేత అబద్ధాలు చెప్పించారు : వైసిపి

అవాస్తవాల పుట్ట : సిపిఎం

అవినీతిలో రాష్ట్రం ఎల్లలు దాటింది : సిపిఐ

తప్పుల తడక : బిజెపి

రాష్ట్ర సమస్యలను ప్రస్ఫుటం చేసింది: ఎమ్మెల్యే గోరంట్ల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

నాలుగున్నరేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధికి కేంద్రంగా మార్చామని, కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా హామీలు, వాగ్దానాలను నెరవేర్చకపోయినా సమర్ధవంతమైన నాయకత్వంతో సొంత కృషితో ముందుకెళుతోందని గవర్నర్ చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగించారు. గత నాలుగేళ్లలో రుతుపవనాలు సహకరించనప్పటికీ రాష్ట్రంలో ఒక్క రైతూ ఆత్మహత్యకు పాల్పడలేదని చెప్పుకొచ్చారు. నాలుగేళ్లలో వ్యవసాయానికి రూ.81,554 కోట్లు కేటాయించామని, సూక్ష్మ సేద్యంపై అత్యంత శ్రద్ధ పెట్టామని వివరించారు. ఉదయం 9.00 గంటలకు గవ్నర్ నరసింహన్ అసెంబ్లీకి చేరుకున్నారు. ఆయనకు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ హాల్లో 9.30 గంటలకు ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ 10.30 గంటలకు ముగించారు. ప్రసంగం ముగిసిన వెంటనే మహాత్మాగాంధీకి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. కేంద్ర ప్రభుత్వం తన వాగ్ధానాన్ని నేరవేర్చనందువల్ల రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా కడపలో ఏకీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని నిర్ణయించి భూమి పూజ చేసిందన్నారు. వ్యవసాయ రంగంలో కేంద్రాన్ని మించిన వృద్ధి సాధించామన్నారు. ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు ఇబ్బంది కలగకుండా ఇబిసి కోటా కింద మిగతా 2లో



# అన్నా హజారే దీక్ష ప్రారంభం

రాలెగావ్ సిద్ధి (మహారాష్ట్ర) : లోక్‌పాల్, లోకాయుక్త న నియామకాల్లో జాప్యాన్ని నిరసిస్తూ ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే నిరాహారదీక్షను ప్రారంభించారు. మహారాష్ట్రలంఓని ఆయన స్వగ్రామం రాల్‌గావ్ సిద్దిలో బుధవాంర ఉదయం ఆయన దీక్ష ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '2013లోనే లోక్‌పాల్ బిల్లు ఆమోదం పొందింది. కానీ ఇంతవరకు లోక్‌పాల్, లోకాయుక్తలను నియమించలేదు. ఏ పార్టీ దీని గురించి మాట్లాడటం లేదు. లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటు చేసే వరకు దీక్ష విరమించను' అని ఆయన అన్నారు. సిఎం కార్యాలయాన్ని లోకాయుక్త పరిధిలోకి తీసుకువస్తూ ఫడ్నవిస్ మంత్రివర్గం మంగళవారం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో దీక్షను రద్దు చేసుకోవాల్సిందిగా మంత్రి గిరీష్ మహాజన్, హజారేను కోరారు. ఆయన చేసిన డిమాండ్లన్నింటినీ నెరవేర్చామని చెప్పారు. అయితే, లోకాయుక్త చట్టం అమల్లోకి వచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని హజారే స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రాల స్థాయిల్లో లోకాయుక్త నియామకాలతో మిగతా 9లో

# ఇక మేమెందుకు?

- కీలక నిర్ణయాల్లో మా భాగస్వామ్యం లేదు
- జాతీయ గణాంక కమిషన్ ఛైర్మన్ పిసి మోహనన్ రాజీనామా
- మరో సభ్యురాలు జెవి మీనాక్షీ గుడ్‌బై



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ విధానాల మూలాన ఒక్కొక్క సంస్థ నిర్వీర్యమౌతూవస్తోంది. రిజర్వుబ్యాంకు, కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఎన్నికల సంఘం ఇలా మోడీ సర్కార్ జోక్యం చేసుకోని రాజ్యాంగ సంస్థ అంటూ లేకుండా పోతోంది. ఇప్పుడు ఈ జాబితాలో దేశ ప్రగతికి అంచనాల కోసం ఎంతో కీలకమైన జాతీయ శాంపిల్ సర్వే నిర్వహించే జాతీయ గణాంక కమిషన్ (ఎన్ఎస్‌సి) చేరింది. ఈ కమిషన్‌లో ప్రభుత్వేతర సభ్యులుగా ఉన్న పిసి మోహన్, జెవి మీనాక్షీ గత సోమవారం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యాక్రమాల అమలు (ఎంఒఎస్‌పిఐ) శాఖ బుధవారం నిర్ధారించింది. వీరిలో పిసి మోహన్ కమిషన్‌కు యాక్టింగ్ ఛైర్మన్‌గా ఉన్నారు. కీలక నిర్ణయాల్లో ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తమ రాజీనామాలపై మీడియాతో మాట్లాడుతూ పిసి మోహనన్ విమర్శించారు. ప్రధానంగా స్థూల జాతీయోత్పతి (జిడిపి), ఉద్యోగాల సమాచారానికి సంబంధించిన గణాంకాల విషయంలో ప్రభుత్వం వ్యవహరించినతీరు ఏమాత్రం బాగోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ శాంపుల్ సర్వే తాజా అధ్యయన సమాచారం విడుదల చేయటంలో కొనసాగుతున్న జాప్యం, జిడిపి బ్యాక్ సీరిస్ మిగతా 9లో

# బాలికపై అత్యాచారం

- ఆస్పత్రికి తరలింపు, తప్పిన ప్రాణాపాయం,
- నిందితుడు అరెస్టు
- శిక్షించాలని రాస్తారోకో
- బాధితురాలికి మంత్రి సునీత, రాజకుమారి పరామర్శ



రాస్తారోకో చేస్తున్న తమ్మకోట గ్రామస్తులు

ప్రజాశక్తి - రెంటచింతల

ఏడేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. తీవ్ర రక్తస్రావంతో అల్లాడుతూ ఇంటికొచ్చిన బాలికను తల్లి, బంధువులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుండి బయట పడింది. గుంటూరు జిల్లా రెంటచింతల మండలం తమ్మకోటలో బుధవారం ఈ ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. తమ్మకోటకు చెందిన ఓ మహిళ భర్త రెండేళ్ల కితం మృతి చెందాడు. అప్పటి నుండి ఆమె కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లల్నీ మిగతా 9లో

## రీసెర్చ్ స్కాలర్ల స్టైఫండ్ 20 శాతం పెంపు

- అసంతృప్తి వ్యక్తం చేసిన రీసెర్చ్ స్కాలర్లు

8



# బిజెపికి చరమగీతం పాడాలి



- జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో హన్నన్ మొల్లా, జిగ్నేష్ పిలుపు
- జై జవాన్..జై కిసాన్..జై సంవిధాన్ నినాదాల హోరు
- ఫిబ్రవరి 7 వరకు కొనసాగనున్న ఉద్యమం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తూ దేశాన్ని తిరోగమనంలోకి నెట్టేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, గుజరాత్ స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా రైతులు, సైనికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజైన బుధవారం మాజీ సైనికోద్యోగులు (ఎక్స్ సర్వీస్‌మెన్) ఆందోళన చేపట్టారు. రైతు వ్యతిరేక..సైనిక వ్యతిరేక మోడీ సర్కార్ డౌన్..డౌన్, జై జవాన్, జైకిసాన్, జై సంవిధాన్ అంటూ సైనికుల నినాదాలతో జంతర్ మంతర్ హోరెత్తింది. అఖిల భారత ఎక్స్ సర్వీస్‌మెన్ సంఘం నాయకుడు మేజర్ జనరల్ సాబ్బీర్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన మిగతా 9లో





ట్రంప్, కొలంబియా కలిసి

## నా హత్యకు కుట్ర పన్నారు

మదురో

9

## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించనున్న రాష్ట్రపతి

8

## చంద కొచ్చర్ దోషే

- నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చిన శ్రీకృష్ణ కమిటీ

8



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# 1 నుండి 13 వరకు నిరసనలు

## ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన జెఎసి ఏర్పాటు
## ఆందోళనల కేసులు ఎత్తివేత
## అఖిలపక్షంలో సిఎం ప్రకటన

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఫిబ్రవరి ఒకటోతేదీ నుండి 13వ తేదీ వరకూ వేర్వేరు రూపాల్లో ఆందోళన నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. హోదా, విభజన హామీల సాధన కోసం భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం సెక్రటేరియట్లోని సిఎం కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షత వహించారు. దీనికి ప్రత్యేక హోదా సాధన సమితి, అమ్‌ఆద్మీ, లోక్‌సత్తా, నవతరం పార్టీ, ముస్లింలీగ్, ఆర్‌ఎస్‌పి, ఫార్వార్డ్‌బ్లాక్, ఆర్‌పిఐతోపాటు పలు జర్నలిస్టు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో పోరాట కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేశారు. భేటీకి రాని పార్టీలను కూడా కలిసి జెఎసిలోకి ఆహ్వానించాలని సిఎం మంత్రులకు సూచించారు. ఆందోళనలో భాగంగా ఒకటోతేదీ నిరసనలు, 11న ఢిల్లీలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. అది ప్రభుత్వం తరుపునే నిర్వహిస్తామని సిఎం ప్రకటించారు. 12వ తేదీన రాష్ట్రపతి వద్దకు అఖిలపక్షం వెళ్లాలని ఒకటో తేదీ నుండి 13 వరకూ వేర్వేరు రూపాల్లో నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించారు. గతంలో హోదా పోరులో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు, యువజనులపై పెట్టిన కేసులన్నీ ఎత్తేయనున్నట్లు ప్రకటించారు. దీనికోసం గురువారం జరిగే మంత్రిమండలిలో తీర్మానం చేస్తామని చెప్పారు. హోదాకోసం మంత్రివర్గంతో కలిసి ఢిల్లీలో ఒకరోజు నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు అఖిలపక్షం నిర్వహించామని, ఒకటో తేదీన విభజన హామీలపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ నిర్వహించనున్నామని, నల్లబ్యాడ్జీలు ధరించి సభకు హాజరువుతామని పేర్కొన్నారు. బంద్‌కు ప్రత్యక్షంగా మద్దతు తెలపలేమన్నారు. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్రం ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతుందని, ఇప్పుడే కేంద్రంపై ఒత్తిడి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ ఎపిజెఎసి నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎన్‌జిఓ అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకులు జి.ఆంజనేయులు, నవీన్‌రాజ్, కృష్ణాంజనేయులు, ఐ.వి.సుబ్బారావు, గెజిటెడ్ ఉద్యోగులు, మహిళా ఉద్యోగుల సంఘం నాయకులూ పాల్గొని మద్దతు ప్రకటించారు.



## మరో మూడ్రోజులు చలి!

**ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాష్ట్రంలో ప్రస్తుతం చలి తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పగలు సైతం చలిగాలులు వీస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు చలి ప్రభావం చూపించనుందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. 5.8 కిలోమీటర్ల ఎత్తులో వ్యాపించి ఉన్న పశ్చిమ ఆటంకాలు ఆఫ్ఘనిస్తాన్ నుండి ఉత్తర భారతదేశం వైపునకు పయనిస్తున్నందున దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాలపైనా చలి ప్రభావం చూపిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంపై ద్రోణులు, ఆవర్తనాలు లేనందున మూడు రోజుల తర్వాత పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపారు. క్రమంగా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ప్రపంచంలో అత్యంత రద్దీ ఎయిర్ పోర్ట్ ఏది?
2. ఎవరి బౌలింగ్ యాక్షన్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిషేధం విధించింది?
3. పాక్‌లో తొలి హిందూ మహిళ జడ్జిగా ఎవరు నియామితులయ్యారు?
4. అంతర్జాయ చెస్‌కు వీడ్కోలు పలికిన రష్యా ఆటగాడు ఎవరు?
5. డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఎవరు మొదటి స్థానంలో నిలిచారు?

# అవాస్తవాల పుట్ట

## గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షాలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రస్తుత ప్రభుత్వ చివరి అసెంబ్లీ సమావేశాల సందర్భంలో గవర్నరు చేసిన ప్రసంగం వాస్తవ సమస్యలను విస్మరించిందని, కేవలం గొప్పలు చాటుకొనేదిగాను, ఎన్నికల హామీలు గుప్పించి ప్రజలను మోసం చేసేందుకు యత్నించేదిగానూ ఉందని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ సంక్షోభం, రుణమాఫీ, కరువు, కార్మికులు, కనీస వేతనాలు, ఉపాధి హామీ, దళితులు, మహిళలపైదాడులు, భూనిర్వాసితుల సమస్యలు, యువతకు ఉపాధి, పెరుగుతున్న విద్య, వైద్యభారం వగైరా సమస్యలను వదిలేసి ఎన్నికల వాగ్దానాలను గుప్పించి అసెంబ్లీ వేదికను దుర్వినియోగం చేయడమేనని తెలిపారు. అసలు సమస్యలను మరుగునపరిచి పెంచిన పెన్షన్లు, పసుపు, కుంకుమ వంటి పథకాల పేరుతో కేవలం గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమైందని వివరించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందిందని చెప్పడం వాస్తవ విరుద్ధమని తెలిపారు. గత నాలుగు బడ్జెట్ ప్రసంగాల్లో మాదిరిగానే రాష్ట్ర విభజన గురించి కేంద్రం హామీల గురించి ఏకరువు పెట్టి తన అసమర్థతను కప్పి పుచ్చుకనే ప్రయత్నంగా గవర్నర్ ప్రసంగం ఉందని మధు తెలిపారు.

**గవర్నర్ చేత అబద్ధాలు చెప్పించారు : వైసిపి**

గవర్నర్ చేత టిడిపి ప్రభుత్వం అబద్ధాలు చెప్పించిందని, వాటిని వినాల్సి రావడం ప్రజల దురదృష్టమని అన్నారు. ఎన్‌టిఆర్ చెప్పిన విధంగా సమాజమే దేవాలయమని చెప్పించారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్న ప్రభుత్వం నడుపుతున్న అసెంబ్లీ దెయ్యాల కొంపా అని ప్రశ్నించారు. స్పీకర్ చక్కగా డ్రామా నటిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఫోన్లు చేస్తున్నానని చెబుతున్నారని, అది సరికాదని అన్నారు. ప్రతిపక్షం నుండి తీసుకున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే అదేగంట నుండి అసెంబ్లీకి హాజరవుతామని అన్నారు. నాలుగేళ్లు ఎన్‌డిఏతో కలిసుండి ప్యాకేజీ బాగుందని చెప్పి, కేంద్రంతో రాజీపడి ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వృద్ధిరేటు 50 శాతం పెరిగిందని చెబుతున్నారని, దాన్ని రుజువు చేస్తే తాము ప్రభుత్వం ఏమి చెప్పినా చేస్తామన్నారు.

**అవినీతిలో రాష్ట్రం ఎల్లలు దాటింది: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ అవినీతిలో ఎల్లలు దాటిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. గవర్నర్ ప్రసంగాన్ని అబద్దాల చిట్టాగా అభివర్ణించారు. ఆయనపేర్కొన్న ప్రతి అంశాన్ని ఆరునెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగాల్లో చెబుతున్న అంశాలేననీ, 40 పేజీల ప్రసంగంలో ఒక్క కొత్త అంశం కూడా కొత్తది లేదని మండిపడ్డారు. విజయవాడ దాసరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎపి 11 శాతం వృద్ధిరేటు సాధించిందనడం సిగ్గుచేటన్నారు. అనంతపురంలో రెయిన్‌గన్స్‌తో పంటలు పండిస్తున్నాం అని గవర్నర్ చెప్పారని, రెయిన్‌గన్స్‌తో ఒక్కపంటైనా అనంతపురంలో పండిందా అని సిఎంను సూటిగా ప్రశ్నించారు.

**గవర్నర్ ప్రసంగం తప్పుల తడక : బిజెపి**

గవర్నర్ ప్రసంగం తప్పుల తడకని, కేంద్రం రాష్ట్రాన్ని మోసం, కుట్రలు చేసిందన్న మాటలు వాడడం బాధకరమని బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో కేంద్రం రాష్ట్రానికి 20 వేల కోట్లు ఇచ్చిందని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు లక్షా 58 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇచ్చిందని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు.

**రాష్ట్ర సమస్యలను ప్రస్ఫుటం చేసింది: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

రాష్ట్ర సమస్యలను ప్రస్ఫుటం చేసే విధంగా గవర్నర్ ప్రసంగం ఉందని టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బాబుని నమ్మవద్దని చెప్పే ప్రతిపక్ష పార్టీలకు గవర్నర్ ప్రసంగం గుణపాఠమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయన్నారు.

**విడ్డూరంగా ఉంది : కౌలు రైతుల సంఘం**

గవర్నర్ ప్రసంగం విడ్డూరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.రంగారావు, పి.జమలయ్య పేర్కొన్నారు. 32 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకొచ్చామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో 17 శాతం వృద్ధి సాధించామని చెప్పడమూ విడ్డూరమన్నారు. నాలుగున్నరేళ్లలో రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు, విజయ నగరం, విశాఖ జిల్లాల్లో కరువు ఏర్పడిందని పేర్కొన్నారు.

# సొంత కృషితో ముందుకు



(మొదటిపేజీ తరువాయి)

కాపులకు ఐదు శాతం ఇతరులకు ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించారని చెప్పారు. ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద 50.51 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారని, అణగారిన వర్గాల పింఛన్ల కోసం రూ. 14,000 కోట్లు ఖర్చు చేసిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందిందన్నారు. జగ్జీవన్ జ్యోతి పథకంతో 2017-18లో 10.30 లక్షల ఎస్‌సి కుటుంబాలకు రూ.65.16 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేశామని, ఆదరణ కింద చేతివృత్తులవారు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి రూ.964 కోట్లతో ఆధునిక పనిముట్లు సమకూర్చినట్లు చెప్పారు. చంద్రన్న చేయూత పథకం ద్వారా దాదాపు రూ. 233.31 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో సుమారు 31,815 మంది ఎస్‌సి యువత ప్రయోజనాన్ని పొందారన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం ముందెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి రూ.1101 కోట్లు కేటాయించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్రం సహాయ నిరాకరణకు పాల్పడుతున్నా రాష్ట్ర వృద్ధి తీరు సగటున 10.66 శాతంగా ఉందని, (అఖిల భారత వృద్ధి రేటు 7.3 శాతం) ఇది దేశంలోనే అత్యధికమని అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు 11 శాతం వృద్ధి రేటును నమోదు చేశాయని తెలిపారు. చంద్రన్న బీమా కింద 2.1 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,685 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేశామని, చేనేతలకు రూ.1004 కోట్ల విలువైన ప్యాకేజీని ప్రకటించామని తెలిపారు. స్వయం సహాయక బృంద సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి పసుపు-కుంకుమ పథకాన్ని ప్రవేశపెట్టి 86,04,304 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులకు రూ.10,000 చొప్పున అందించామని చెప్పారు. రైతులకు రూ.24,000 కోట్ల రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. వ్యవసాయంలో వ్యూహాత్మకంగా సూక్ష్మ సేద్యం, పెట్టుబడిలేని ప్రకృతి సేద్యం వంటి వినూత్న పద్ధతులపై దృష్టి సారించామన్నారు. ఆంధ్రప్రదేశ్ చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని అన్నారు. మత్స్య పరిశ్రమల నుంచి జివిఏ 2013-14లో రూ.15,516 కోట్ల నుంచి 2017-18 నాటికి రూ.41,328 కోట్లకు పెరిగందని చెప్పారు. 2004-14 కాలంలో సాగునీటి పై రూ.79,357 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసినా దానికి తగినంత ఫలితం రాలేదని కానీ, గడచిన ఐదేళ్లలో జలవనరుల రంగంలో రూ.64,333 కోట్ల వ్యయాన్ని చేసిందని, స్థిరీకరణతో కలుపుకుని 32.02 లక్షల ఎకరాల విస్తీర్ణానికి సాగునీటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కింద గోదావరి-చంపావతి-నాగావళి నదులను అనుసంధానం చేయాలని, ఇవన్నీ కలిస్తే మహాసంగమం అవుతుందని అన్నారు. బడికొస్తా పథకం కింద 2018-19 సంవత్సరానికి 3,81,142 సైకిళ్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. గత నాలుగేళ్లలో సంవత్సరానికి 0-900 యూనిట్ల శ్రేణిలో గృహ వినియోగదారులకు ప్రభుత్వం టారిఫ్‌ను పెంచలేదని తెలిపారు. భారతదేశంలో పది ఉత్తమ పరిశుభ్ర నగరాల జాబితాలో విజయవాడ చేరిందన్నారు. భవిష్యత్ తరాలు అందుకునేందుకు నిత్యం ఈ అభివృద్ధిని కొనసాగించాలని, దానికి ప్రజల సహకారం గట్టి మద్దతు ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక కారిడార్లను ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

# మరోసారి మోసానికి బాబు ప్రయత్నం



- టిడిపి పాలనలో ప్రజలపై భారాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కొత్త పథకాల ప్రకటన ద్వారా మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు అన్నారు. విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలపైనా భారాలు మోపారన్నారు. ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆగ్రహావేశాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని తగ్గించుకునేందుకే పెన్షన్ల పెంపు, పసుపు-కుంకుమ, ఆటోలకు లైఫ్‌ట్యాక్స్ రద్దు, బిసి కార్పొరేషన్ల ఏర్పాటు వంటి ప్రకటనలు చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో గుర్తురాని వారందరిపైనా ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో టిడిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహిళలకు పసుపు-కుంకుమ ద్వారా డబ్బులు ఉచితంగా ఇస్తున్నారా? అప్పుగా ఇస్తున్నారా? ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. పెద్ద కంపెనీలకు భూములిస్తున్న సర్కారు పేదలకు ఒక్క ఎకరా కూడా ఇవ్వలేదన్నారు. ప్రత్యేకహోదా, విభజనహామీల సాధనలో టిడిపి విఫలమైందని, నాలుగేళ్ల బిజెపితో అంటకాగి అన్యాయం జరిగేందుకు అవకాశం ఇచ్చారన్నారు. రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని, 4,5 విడతల రుణమాఫీ డబ్బు చెల్లించలేదని, కౌలురైతులకు రుణ మాఫీ వర్తింపచేయలేదని తెలిపారు. 88,738 కుటుంబాలకు నేటికీ రుణమాఫీ కాలేదన్నారు. బిసి సబ్‌ప్లాన్‌కు 2017-18లో రూ.10వేలకోట్లు కేటాయించినా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్రంలో 11 వృత్తి ఫెడరేషన్‌లను, కులాల కార్పొరేషన్‌లుగా మార్చుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, కార్పొరేషన్లకు ప్రభుత్వం చైర్మన్లను, డైరెక్టర్లను నియమించి ప్రభుత్వ జేబు సంస్థలుగా మార్చేస్తుందని చెప్పారు. హుద్‌హుద్ తుఫానులో నష్టపోయిన కల్లుగీత వృత్తిదార్లకు నేటికీ పరిహారం చెల్లించలేదన్నారు. బెల్టు షాపులను తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తొలగించ కపోగా 25వేల మందికి ఒక షాపు ఉంటే ఇప్పుడు 5వేల మందికి ఒక షాపు పెట్టేందుకు అనుమతిచ్చారని, ప్రభుత్వం ఎలా మోసం చేస్తోందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలకు సవరణ చేసిందని మండిపడ్డారు. 74 కేటగిరీల్లో పనిచేస్తున్న 50 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులకు 15 సంవత్స రాల నుండి వేతన సవరణ చేయలేదని, సిఫార్సు చేయాల్సిన లేబర్ అడ్వైజరీ బోర్డును ఇటీవల నియమించినా అది వేతన సవరణ సిఫార్సు చేయలేదని అన్నారు. బాక్సైట్ తవ్వకాలకు జిఓ 97 విడుదల చేశారని, గిరిజనుల ఆందోళనలతో తవ్వకా లను ఆపినా జిఓ రద్దు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉన్నా 18వేల ఖాళీలు మాత్రమే భర్తీ చేసిందని, 22వేల టీచర్ల ఖాళీలకుగానూ కేవలం 7 వేలకే డిఎస్సీ నిర్వహించిందని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.2వేలు అని ఊరించి నాలుగేళ్ల అనంతరం రూ.1000 మాత్రమే అందించారని తెలిపారు. ఉపాధిహామీ కూలీలకు బకాయిలు రూ.420కోట్లు నేటికీ చెల్లించలేదన్నారు. భూనిర్వాసితులకు నష్టపరిహారం అరకొర చెల్లించి బలవంతపు భూసేకరణకు పూనుకుంటున్నారన్నారు. పేదలకు 20లక్షల ఇళ్లు కట్టిస్తామని వాగ్దానం చేసి 64వేల ఇళ్లు కూడా కట్టించలేదన్నారు. సమస్యలపై పోరాడే వివిధ తరగతులపై తీవ్ర నిర్బంధం, అరెస్టులు, కేసులు, లాఠీచార్జిలకు ప్రభుత్వం పూనుకుంటోందని మండిపడ్డారు. పెన్షన్లు పెంచినట్లు ప్రకటించినా ఇప్పటికీ అర్హత కలిగిన 6,02,225 మందికి పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. కిలోమీటరుకు ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లకు ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఉన్నత పాఠశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, కానీ రేషనలైజేషన్ పేరుతో 4,200 పాఠశాలలు మూసేశారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను ధనుష్ ఇన్ఫోటెక్‌కు, 108 సర్వీసును బివిజి (భారత్ వికాష్ యోజన)కు, 102 (తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సర్వీసు)ను జివికెకు, మెడికల్ టెస్టులు మెడాల్‌కు కట్టబెట్టారన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# ఏది నిజం?

## రైతాంగ ఆత్మహత్యలపై పొంతనలేని లెక్కలు
## ఒక్కరూ ఆత్మహత్య చేసుకోలేదు : గవర్నర్
## ఐదేళ్లలో 395కు తగ్గించాం: శ్వేతపత్రంలో ప్రభుత్వం
## నాలుగేళ్లలో 915 మంది : కేంద్రం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రైతుల ఆత్మహత్యల విషయంలో ప్రభుత్వం రోజుకో మాట చెప్పడంతో ఏది నిజమనే సందేహం తలెత్తుతున్నాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తూ 'గత నాలుగున్నరేళ్లలో రుతుపవనాలు అనుకూలంగా లేనప్పటికీ రాష్ట్రంలో ఒక్క రైతు ఆత్మహత్యకు పాల్పడలేదు' అని పేర్కొన్నారు. గత డిసెంబరులో 24వ తేదీన ప్రభుత్వం వ్యవసాయ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రంలో 2004 నుంచి 2014 వరకూ 1,987 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, గత ఐదేళ్లలో 395కు తగ్గించినట్లు పేర్కొన్నారు. ఏడాదికి సగటున 79కి ఈ సంఖ్యను తగ్గించినట్లు తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం చెబుతున్న రెండు మాటలకు పొంతన లేకుండా ఉండటం గమనార్హం! మరోవైపు రైతుల ఆత్మహత్యల నమోదు విషయంలోను ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని రైతు సంఘాలు చెబుతున్న విషయం తెలిసిందే! రైతులు ఆత్మహత్య చేసుకున్న సమయంలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు ఆత్మహత్యలను వక్రీకరించి ఇతర కారణాలను ఆపాదిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. మరోవైపు లోక్‌సభలో డిసెంబరు 11న రైతుల ఆత్మహత్యలపై కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో 2014లో 160 మంది, 2015లో 516, 2016లో 239 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మూడేళ్లలో 1,437 మంది రైతు కూలీలు ఆత్మహ త్యలు చేసుకున్నారని తెలిపారు. గత నాలుగేళ్లలో రాష్ట్రంలో వరుసగా కరువు పరిస్థితులు నెలకొనడం,గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆత్మహత్యల బాట పట్టారు. ఈ ఏడాది కూడా 346 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా గుంటూరు, కర్నూలు, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, కడప, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా నమోదవు తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయంలో 2104-15లో 3.35 నుంచి 2017-18లో 17.78 శాతం చొప్పున గణనీయమైన వృద్ధి సాధించామని చెబుతున్నప్పటికీ రైతులు ఆత్మహత్యలు మాత్రం ఆగలేదు. ఈ వాస్తవాలను మరుగుపరిచేలా గవర్నర్ చేత మాట్లాడించడం విమర్శలకు దారి తీస్తోంది.

ప్రత్యేకం

# బాధ్యత లేని ప్రతిపక్షం దురదృష్టకరం

## ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దురద ష్టవశాత్తు రాష్ట్రానికి బాధ్యత లేని ప్రతిపక్షం ఉందని, ప్రజల సమస్యలు అసెంబ్లీ దష్టికి తీసుకురావడం లేదని మంత్రి జవహర్ అన్నారు. అఖిలపక్షం అనేది మూహర్తం చూసి పెట్టాలి అని ప్రతిపక్షం చెప్పడం విడ్డురమన్నారు. అఖిలపక్షానికి రావటానికి టైం లేదని చెప్పడం విడ్డురమన్నారు. మా టార్గెట్ 175 నియోజకవర్గాలు గెలవడమేనని అన్నారు.

**కాంగ్రెస్ 200 రూపాయలిస్తే మేము రెండు వేలు రూపాయలిస్తున్నాం : పల్లే**

కాంగ్రెస్ ప్రభుత్వం 200 రూపాయల పెన్షన్ ఇస్తే, మేము రెండు వేలు రూపాయలు ఇస్తున్నామని మాజీ మంత్రి పల్లే రఘునాధ రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రతి పక్షం అడ్డుపడుతోందని అన్నారు. ప్రభుత్వం వచ్చాక కరెంట్ కోతలు అసలు లేవన్నారు. విద్యుత్ చార్జీలు పెంచము అని చెప్పిన ఏకైక ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం అని అన్నారు.

**రాష్ట్రంలో గణనీయమైన ప్రగతి**

దేశంలోనే రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించినట్లు శాసనమండలి సభ్యుడు బచ్చుల




అర్జునుడు అన్నారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద బుధవారం ఉదయం ఆయన మాట్లాడుతూ 99 అంశాలకు సంబంధించి ప్రభుత్వం పని తీరు బాగుందంటూ గవర్నర్ ప్రసంగం కొనసాగినట్లు తెలిపారు.

11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చారని, కొత్తగా మరో 10 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్థికంగా వనరులు సష్టించే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు.

**అనంత దిశ తిరిగింది: ఎమ్మెల్సీ శమంతకమణి**

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన కొత్తలో అనంత పురం జిల్లా తీవ్ర కరవులో ఉండి, సరైన జీవనోపాధి లేక ప్రజలు వలసలు వెళ్ళేవారని, ఆ పరిస్థితి ఇప్పుడిప్పుడే మారుతోందని, దానికి కారణం అనంతపురానికి కియా మోటారు కంపెనీ రావటమేనని, ఇంకా ఎన్నో పరిశ్రమలు అనంతపురానికి రానున్నాయని తెలిపారు.

**పసుపు కుంకుమతో వెలుగులు: ఎమ్మెల్యే సుగుణమ్మ**

చంద్రబాబు ప్రవేశపెట్టిన పసుసు కుంకుమ పథకం ఎంతో ఆదరణ పోందిందని, ఈ పథకం ఎన్నో కుంటుంబాల్లో వెలుగులు నింపిందని తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు.

**గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దూరంగా ఉంది -బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు చాలా దూరంగా ఉందని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరుని రాష్ట్ర ప్రభుత్వం చెబితే గవర్నర్ తన ప్రసంగంలో చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ మాట్లాడిన 99 అంశాల్లో 74 అంశాల్లో కేంద్రం సహకరిస్తోందనేది గవర్నర్ ప్రసంగం ద్వారా తేటతెల్లమైందన్నారు. రాయలసీమ ప్రాంతంలో 24/7 కరెంటుకు సంబందించి కేంద్ర ప్రభుత్వం ఏపీ, ఢిల్లీ, రాజస్థాన్‌లకు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారని అది సిఎంకు ఎలా సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. కేంద్రం ప్రాజెక్టుల్లో చంద్రబాబు హడావిడి తప్పా ఆయన చేసింది ఏమీ లేదన్నారు.

## జగన్‌ను లక్ష్యంగా చేసుకునే హత్యాయత్నం

### హైకోర్టుకు ఎన్‌ఐఏ నివేదన

**ప్రజాశక్తి - అమరావతి**

ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ కీలక విషయాల్ని హైకోర్టుకు తెలియజేసింది. వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకునే ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నానికి ప్రయత్నించారని ఎన్‌ఐఏ హైకోర్టుకు నివేదించింది. కేంద్ర పారిశ్రామిక భద్రత దళం, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్‌ఐఏ, ఏపీ ప్రభుత్వ సమాచారాలన్నింటినీ క్రోడీకరించాకే జగన్‌పై కావాలనే హత్యాయత్నం జరిగిందనే నిర్ణయానికి తాము వచ్చామని ఎన్‌ఐఏ తెలిపింది. విమానాశ్రయ ఆవరణలో హత్యాయత్నం జరిగినందున ఈ కేసును దర్యాప్తు చేసే పరిధి తమదేనని ఎన్‌ఐఏ స్పష్టం చేసింది. విమానాశ్రయంలో ఆయుధాలతో లేదా ప్రాణం తీసే విధమైన వస్తువులతో దాడి చేస్తే అలాంటి కేసులను ఎన్‌ఐఏనే విచారించాలని విమానయాన సంస్థ చట్టం స్పష్టం చేస్తోందని తెలిపింది. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఎన్‌ఐఏ తన వాదనలతో కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. దీనిపై తమ వాదనల్ని తెలిపేందుకు సమయం కావాలని ఏపీ ప్రభుత్వం కోరడంతో కేసు విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ జి. శ్యాంప్రసాద్ ప్రకటించారు. ఈ కేసులో తనను ప్రతివాదిగా ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామక ష్ణారెడ్డి తరపు లాయర్ కోరారు. అందుకు ఏపీ ప్రభుత్వ న్యాయవాది అభ్యంతరం చెప్పారు. దీనిపై కూడా తమ కౌంటర్‌లో వివరిస్తామని తెలిపారు.

## అయేషా మీరా కేసులో సిట్ క్లోజ్

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయేషా మీరా హత్య కేసులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక విచారణ బృందం(సిట్)ను క్లోజ్ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును సిబిఐకి అప్పగించడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## నేటితో ముగియనున్న డిఎస్‌సి

ఉపాధ్యాయ నియామకానికి సంబంధించిన డిఎస్‌సి ఎస్జిటి పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల 18 నుంచి ప్రారం భమైన ఎస్జిటి పరీక్షలకు 3,46,053 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసు కున్నారు. రోజుకు రెండు పూటలా చొప్పున ఈ పరీక్షలు జరిగాయి. మొదటి దశలో స్కూల్ అసిస్టెంట్లకు, రెండో దశలో స్కూల్ ఎస్‌జిటిలకు జరిగాయి.

## రూ.10వేలు రుణం కాదు.. గ్రాంటు

### డ్వాక్రా మహిళలకు సహాయంపై మంత్రులు

డ్వాక్రా గ్రూపు మహిళలకు ప్రభుత్వం ఇచ్చే రూ. 10వేలను తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రులు అచ్చెన్నాయుడు, పరిటాల సునీత తెలిపారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో బుధవారం మంత్రులు విలేకర్ల సమావేశంలో మాట్లాతూ రుణం రూపంలో కాకుండా గ్రాంటుగా ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1, మార్చి 8, ఏప్రిల్ 5వ తేదీల్లో మూడు విడతలుగా చెక్కులు అందించనున్నట్టు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 94 లక్షల మంది డ్వాక్రా మహిళలున్నారన్నారు. డ్వాక్రా గ్రూపు పేరుతో చెక్కులు ఇస్తామని, కొత్త ఉత్తర్వుల ప్రకారం డ్వాక్రా సంఘాలకు ఇచ్చే మొత్తాలను వారికి ఇష్టమొచ్చినట్టు ఉపయోగించు కోవచ్చన్నారు. పసుపు కుంకుమ పథకం కింద అందరికీ ప్రయోజనం కలిగేలా చూస్తున్నామని మంత్రి పరిటాల సునీత చెప్పారు.

## 'రవాణా' లో మరింత సాంకేతికత : అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర రవాణా శాఖలో త్వరలో మరింత సాంకేతికతను వినియోగించనున్నట్లు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఒకే రాష్ట్రం-ఒకే సిరీస్ (ఎపి 39 సిరీస్) కార్యక్రమాన్ని విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగేళ్ల ముందు రవాణా శాఖ అంటే ప్రజల్లో చెడ్డపేరు ఉండేదని, అధికారుల పాత్ర కన్నా ఏజెంట్ల పాత్ర ఎక్కువగా ఉండేదని అన్నారు. నేడు సాంకేతికత ద్వారా రవాణా శాఖలో వినూత్న మార్పు తీసుకురాగలిగామన్నారు. వేలిముద్రల ద్వారా ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరలో ఐరిష్ ద్వారా కూడా చేయగలగాలని, మొబైల్ నుంచే రవాణా శాఖకు చెల్లింపులు చేసేలా యాప్‌ను తయారు చేయాల్సి ఉందని అన్నారు. ప్రజలకు సౌలభ్యకరమైన సదుపాయాలు కల్పించగలిగామని, అందుకే ఫలితాలు సాధించగలుగుతున్నామని తెలిపారు.

## అలరించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. యువత తమ ప్రతిభతో ఆహూతులను అలరించారు. శాస్త్రీయ నృత్యపోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన నృత్యకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భరతనాట్యంలో ప్రకాశం జిల్లాకు చెందిన పద్మ దత్తవర్ష ప్రదర్శన అలరించింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రావణి చేసిన ఒడిస్సి నృత్యం ఆకట్టుకుంది. అలాగే సిఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన జానపద బృంద నృత్య పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బృందం చేసిన లంబాడీ నృత్యం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

హైదరాబాద్ నాంపల్లిఎగ్జిబిషన్‌లో అగ్నికి ఆహుతైన స్టాళ్లు



## నాంపల్లి ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటు చేసు కుంది. ఆంధ్రాబ్యాంకు స్టాల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. రాత్రి 8.30-9 గంటల ప్రాంతంలో ప్రారం భమైన మంటలు క్షణాల్లో 30కి పైగా స్టాళ్లకు వ్యాపించాయి. 400 స్టాళ్లు పైగా భస్మమయ్యాయి. మైదానమంతా దట్టమైన పొగలతో నిండిపోయింది. పెద్ద సంఖ్యలో ఉన్న సందర్శకులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ తొక్కిసలాటలో పలువురికి గాయాలైనాయి. వీరిని ఆసుపత్రికి తరలించారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కూడా మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. ఆ సమయం వరకు ఈ సంఘటనలో ఎవ్వరూ ప్రాణాలు కోల్పోలేదని అధికారులు తెలిపారు. ప్రమాదంపై ఎటువంటి పుకార్లను నమ్మవద్దని హైదరాబాద్ సిపి విజ్ఞప్తి చేశారు. పది అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పే పనిలో ఉన్నాయి.

# చేనేతకు బకాయిల చిల్లు

- ఆప్కో నుంచి ఏడాదిగా రూ.140 కోట్లు
- సంక్షోభంలో సహకార సొసైటీలు
- సర్కారు నిర్వాకం వల్లే సమస్యలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి**

చేనేతలను బకాయిల చిక్కు వీడటం లేదు.. ఆప్కో సంస్థ వైఫల్యంతో ఆ రంగం సంక్షోభంలో నెట్టబడింది.. ఏడాదిగా రూ.140 కోట్లు బకాయిలు పడటంతో సహకార సొసైటీలు విల విలలాడుతున్నాయి.. దీంతో లక్షలాది మంది చేనేత కార్మికులు ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు.

రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాల లివరీ ఉత్పత్తుల విక్రయం ద్వారా ఆప్కో గతేడాది కాలం నుంచి ఆయా సహకార సంఘాలకు కోట్లాది రూపాయలను చెల్లించాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని 33 సొసైటీలకు సుమారు రూ.మూడు కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అప్కోలు చేనేత సహకార సంఘానికి రూ.50 లక్షల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గతేడాది నుంచి చేనేత లివరీ ఉత్పత్తులను ప్రాథమిక సంఘాల ద్వారా ఆప్కో సేకరిస్తోంది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం తమ శాఖ అవసరాల నిమిత్తం ఆప్కో నుంచి తిరిగి కొనుగోలు చేసి పాఠశాలల విద్యార్థులకు, వసతిగృహాల విద్యార్థులకు, అధికారులకు అందజేస్తోంది. ఇందుకు సంబంధించిన డబ్బులను ఆప్కోకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపెట్టింది. దీంతో, చేనేత సొసైటీ సభ్యులకు బకాయిలు చెల్లించలేని దుస్థితిలో సంస్థ నెట్టవేయబడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలకు ఆప్కో సంస్థ రూ.140 కోట్లపైనే బకాయి పడింది. నాబార్డు నిబంధనలను పాటించక పోవడంతో నగదు పరపతి పొందే అర్హతను ఆప్కో కోల్పోయింది.

ఆప్కాబ్ సంస్థ నుంచి నగదు పరపతిని ప్రస్తుతం పొందడం ద్వారా లావాదేవీలు నడుపుతోంది. భవిష్యత్తులో ఇవీ కూడా నిలిచిపోయే అవకాశమున్నట్లు తెలు స్తోంది. చేనేత సహకార సంఘాలకు నగదు పరపతి రూపంలో వర్కింగ్ క్యాపిటల్‌ను నాబార్డు సంస్థ మంజూరు చేస్తోంది. నిబంధ నలు పాటించి విక్రయించిన ఉత్పత్తులకు సంబం ధించి కనీసం 50 శాతం నిధులను నగదు పరపతి ఖాతాకు జమచేసి, మిగిలిన నిధులు వినియోగించాలనేది నిబంధన. దీన్ని క్రమం తప్పకుండా పాటించడం వల్ల ఆ సంఘాలు కొంతమేరకు మనుగడలో ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలోని 50 సొసైటీలకు రూ.11 కోట్లు, గుంటూరులోని 57 సొసైటీలకు రూ. మూడు కోట్లు ఆప్కో సంస్థ బకాయి ఉంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖల నుంచి అప్పులు తీసుకొని చేనేత సొసైటీలు నడుస్తున్నాయి. ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించి ఆప్కో నుంచి ఏడాదిగా ఒక్క రూపాయీ రాకపోవడం తో ఇవి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. డిసిసిబిల నుంచి తీసుకున్న అప్పు మేరకు ఏటా లక్షలాది రూపాయలు ఒక్కో సంఘం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో, సొసైటీలపై అప్పుల భారం మరింత పెరిగిపోతోంది.



మగ్గంపై వస్త్రాన్ని నేస్తున్న చేనేత కార్మికుడు

### ఆప్కో నిధులు విడుదల చేయాలి



చేనేత సహకార సంఘాల పరిస్థితి ఆందో ళనకర స్థితికి చేరింది. ఆ సంస్థ చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఆ సంఘాలను ఆదుకోవడం ద్వారా కార్మికులకు ఉపాధి కలుగుతుంది. లేకపోతే కార్మికులఆగ్రహావేశాలకు ఆప్కో, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**దొంతంశెట్టి విరూపాక్షం, చేనేత సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు**

### కార్మికుల పరిస్థితి దయనీయం



చేనేత రంగంపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం కారణంగా ఈ రంగంలోని కార్మికులంతా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఆప్కోకు నిధులు విడుదల కాకపోడంతో సంఘాలకు అందించడం లేదు. దీంతో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం స్పందిస్తే తప్ప కార్మికులకు ఉపాధి దొరికే పరిస్థితి లేదు.

**- కట్టా శివదుర్గారావు, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు**

## ఫీజు కోసం 'నారాయణ' వేధింపులు

**విద్యార్థిని పరిస్థితి విషమం • కళాశాల ఎదుట ఆందోళన**

**ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)**

నారాయణ విద్యాసంస్థ యాజమాన్యం ట్యూషన్ ఫీజు కోసం విద్యార్థినిని వేధించింది. తరగతి గదిలో నిలబెట్టి సహ విద్యార్థుల సమక్షంలో ప్రశ్నించడంతో ఆ విద్యార్థి మనోవేదనకు గురై సుగర్ లెవెల్స్ తగ్గి ఆస్పత్రి పాలైంది. విషయం తెలుసుకున్న విద్యార్థిని బంధువులు, ప్రజాసంఘాల నేతలు కళాశాల ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా పలాస మున్సిపాలిటీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి గ్రామానికి చెందిన గేదెల మన్మథరావు, రాజేశ్వరి కుమార్తె జి.వెన్నెల పలాసలోని నారాయణ విద్యాసంస్థల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి చదువుతోంది. ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.15 వేలు కాగా ఇప్పటివరకు రూ.10 వేలు చెల్లించింది. మరో రూ.5 వేలు చెల్లించాల్సి ఉండగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాయుడు సోమవారం ట్యూషన్ ఫీజు చెల్లించాలని, లేకుంటే ప్రాక్టికల్స్‌కు అనుమతించ బోమని తరగతి గదిలో అందరి విద్యార్థుల మధ్య వెన్నెలను ప్రశ్నించారు. ఇటీవల తిత్లీ తుపానుకు పంట నాశనమైందని, మా నాన్న కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్నారని, అమ్మ నాన్నకు సపర్యలు చేస్తూ అక్కడే ఉందని, కొంతగడువు ఇవ్వాలని కోరింది. దీనికి నాయుడు ససేమిరా అనడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. అనంతరం ఇంటికి చేరుకున్న తరువాత పరీక్షలు రాయలేమోనని మనస్తాపానికి గురై అస్వస్థతకు గురైంది. బంధువులు, స్థానికులు గుర్తించి మంగళవారం ఉదయం పలాసలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో విద్యార్థిని చేర్పించారు. ఆమెను పరామర్శించేం దుకు వచ్చిన విద్యార్థుల ద్వారా పై విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో బంధువులు, ప్రజాసంఘాల నాయకులు బుధవారం కళాశాల ఎదుట బైఠాయించి, ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపల్ యు.వెంకటేశ్వరరావును నిలదీశారు. విద్యార్థినికి ఏమైనా జరిగితే యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెన్నెల

## కుక్కల దాడిలో వృద్ధురాలు మృతి

**ప్రజాశక్తి-వంగర (శ్రీకాకుళం)**

కుక్కల దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా వంగర మండలం శ్రీహరిపురంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీహరిపురానికి చెందిన అంపిల్లి రాముడమ్మ(80)కు గంగిశెట్టి, సూరిశెట్టి ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు అంపిల్లి గంగిశెట్టి ఇంటి వద్ద నివాసముంటోంది. వారం రోజులుగా రాముడమ్మ ఆరోగ్యం క్షీణించడంతో గడపలో పరదాలు కట్టి మంచంపై వేశారు. ప్రతిరోజూ చిన్నకుమారుడు ఆమెకు సపర్యలు చేసేవాడు. మంగళవారం అర్ధరాత్రి జనసంచారం లేని సమయంలో వీధి కుక్కలు ఆమెను తీవ్రంగా గాయపరచడంతో ఆమె బాధ భరించలేక ప్రాణాలు విడిచింది.

## సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి - కడప ఏడురోడ్లు**

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందనీ, వారి భాగస్వామ్యంతోనే మెరుగైన భారతదేశం సాధ్యమని ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి వీరవల్లభ పేర్కొన్నారు. నగరంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన బెహతర్ భారత్‌లో భాగంగా ఎన్‌ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా విద్యార్థులతో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సమస్యలను వారి ద్వారానే తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో బెహతర్ భారత్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు.

## వైసిపిలో పలువురి చేరిక

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

వైఎస్‌ఆర్‌సిపిలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం గుంటూరు జిల్లాకు చెందిన పలువురు టిడిపి నేతలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గురజాల నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు డాక్టర్ పొన్నం నాగ మల్లిఖార్జునరావు, టీడీపీ నేత వర్ల రామయ్య సోదరుడు వర్ల రత్నం తదితరులు వైఎస్‌ఆర్‌సిపి కండువా కప్పుకున్నారు. వైఎస్ జగన్ వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కడప జిల్లా రాజంపేట టిడిపి ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి గురువారం అధికారికంగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. బుధవారం సాయంత్రమే ఆయన తన అనుచరులతో హైదరాబాద్‌కు చేరుకున్నారు.

# ప్రజల కోసం ఎన్ని పాటలైనా రాస్తా

**సినీగేయ రచయిత సుద్దాల**

**ప్రజాశక్తి-కూర్మన్నపాలెం, విశాఖ**

పేద ప్రజల కోసం ఎన్ని పాటలైనా రాయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ (సిఐటియు), వడ్లపూడి సిడబ్ల్యుసి ఆధ్వర్యాన బుధవారం వడ్లపూడి, స్టీల్‌ప్లాంటులో కల్చరల్ ఫెస్ట్-2019 నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశ భక్తి గీతాలు, భరత నాట్యం, కూచిపూడి తదితర నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్‌తేజ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం తాము నిర్వహించే పోరాటానికి ఒక పాట రాయాల్సిందిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు కోరిన మీదట, ఆయన వద్ద ఒక రోజు శిక్షణ తీసుకొని పాట రాశానని చెప్పారు. సినిమా అనే ఒక ప్రత్యేక ప్రపంచంలో బతుకుతున్న తనను ప్రజా పోరాటం కోసం పాట రాయ మని కోరడంతో తన తండ్రి అందించిన వామపక్ష భావజా లం తనలో మళ్లీ చిగురించిందని చెప్పారు. ఈ సందర్భంగా పాటకు, ప్రజా జీవితానికి గల సంబంధాన్ని ఆయన వివరించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగ రావు మాట్లాడుతూ, స్టీల్ మార్చ్ పేరిట తాము నిర్వహించిన ఉక్కు పరిరక్షణ పోరాటానికి సుద్దాల రాసిన గీతం తమను 30కిలో మీటర్లు నడిచేలా ఉత్తేజాన్నిచ్చిందన్నారు.



ఫెస్ట్‌లో మాట్లాడుతున్న సినీ గేయరచయిన సుద్దాల అశోక్ తేజ

## ప్రజలే బుద్ధి చెప్పాలి

**టిడిపి, వైసిపిపై సిపిఎం నేత సిహెచ్ బాబూరావు ఆగ్రహం**

**ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి**

ప్రజా సమస్యలు పట్టించుకోని అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. బుధవారం నగరంలోని 56వ డివిజన్ వాంబే కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకునే క్రమంలో జనసేన సెంట్రల్ నియోజకవర్గ నాయకులు బొలిశెట్టి వంశీకృష్ణతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను స్థానికులు బాబూరావు దృష్టికి తీసుకొచ్చారు. తమకు పింఛను ఏళ్లతరబడి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ పలువురు వృద్ధులు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా కంటక పాలన తెలుగుదేశం పార్టీ సాగిస్తుంటే, అధికార దాహంతో వైసిపి నేత జగన్ ఉన్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లేనని ఉదహరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పేదలకు ఇళ్లు ఇవ్వాలని గుర్తుకు రాలేదని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇపుడు పేదలకు ఇళ్లు, పింఛను రెట్టింపు, డ్వాక్రా మహిళలకు వరాల ప్రకటనలు చేస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు పాల్గొన్నారు.



## బోగస్ కంపెనీలకు భూ కేటాయింపులు

- రాష్ట్ర సర్కార్‌పై హైకోర్టులో పిల్
- పూర్తి వివరాలు అందజేయాలని ఏపిఐఐసికి ధర్మాసనం ఆదేశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కాగితాలకే పరిమితమైన బోగస్ కంపెనీలకు పెద్ద ఎత్తున ఏపీ సర్కార్ భూములు కేటాయించిందనే ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. డొల్ల కంపెనీలకు భూములు దారాదత్తం చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ న్యాయాధికారి జె.శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు సోమవారం విచారించింది. భూముల కేటాయింపులకు చెందిన పూర్తి వివరాలన్నింటినీ తమ ముందుంచాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తిలతో కూడిన డివిజన్‌బెంచ్ ఏపీఐఐసీని ఆదేశించింది. గత విచారణలో హైకోర్టు ఆదేశించిన మేరకు కాగితాలకే పరిమితమైన డొల్ల కంపెనీలకు భూములు కేటాయించిన వాటి వివరాలు అందజేసినట్లు శ్రవణ్‌కుమార్ చెప్పారు. విజయనగరం జిల్లాలో ఒక డొల్ల కంపెనీకి 40 ఎకరాలు ఇచ్చారని, భూకేటాయింపుల చట్టానికి మూడేళ్ల క్రితం సవరణ చేసిన వాటిని తుంగలోకి తొక్కి 2012 నాటి నిబంధనల మేరకు భూములు ఇచ్చారన్నారు. కొన్ని కంపెనీలు తీసుకున్న భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టాయని, ఆ డబ్బును ఇతర అవసరాలకు మళ్లించాయని ఆరోపించారు. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణను వచ్చే నెల 5కి వాయిదా వేసింది.

## వెయ్యి కాళ్ల మండపానికి ఆధారాలేమిటి?

**వైసిపి ఎమ్మెల్యే రోజాను ఆదేశించిన హైకోర్టు**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తిరుమలలో కూల్చిన చోటే తిరిగి వెయ్యి కాళ్ల మండపాన్ని నిర్మిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం హామీ ఇచ్చి ఉంటే వాటి వివరాలు అందజేయాలని వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజాను హైకోర్టు ఆదేశించింది. గతంలో టీటీడీ తిరిగి వేయికాళ్ల మండపాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆమె లాయర్ హైకోర్టు దష్టికి తెచ్చారు. దాంతో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిలతో కూడిన డివిజన్ బెంచ్ పైవిధంగా పిటిషనర్‌ను కోరింది. నారాయణగిరి వద్ద వెయ్యి కాళ్ల మండపాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు టీటీడీ తరఫు లాయర్ చెప్పారు. విచారణ వారం రోజులకు వాయిదా పడింది.

## డిప్యూటీ చీఫ్ ఆఫ్ నేవల్‌గా పవార్

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

డిప్యూటీ చీఫ్ ఆఫ్ నేవల్‌గా వైస్ అడ్మిరల్ ఎంఎస్.పవార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పవార్ సైనిక్ స్కూల్ 60వ ఆలుమ్ని మీట్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఖడక్‌వాలా పూనె)లో 1982 బ్యాచ్‌కు చెందిన వారు. నేవిగేషన్ డైరెక్షన్‌లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన అధికారిగా పవార్‌కు గుర్తింపు ఉంది. ఇండియన్ నేవీలో అనేక నూతన ఆవిష్కరణలకు రూపశిల్పిగా వెలుగొందుతున్నారు.




చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయ వాదులు న్యాయమూర్తులు

## అంకిత భావంతోనే కక్షిదారులకు న్యాయం

**హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్**

**ప్రజాశక్తి-గన్నవరం**

న్యాయమూర్తులు, న్యాయవాదులు అంకిత భావంతో పని చేస్తే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని హైకోర్టు చీఫ్ జస్టిస్ సిజె ప్రవీణ్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం పాత ఐటిఐ రోడ్డులో జిల్లా జ్ఞానేంద్ర భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన అడిషన్ చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. రాజధానికి సమీపాన ఉన్న గన్నవరంలో ఏర్పాటైన మొదటి కోర్టును తనచేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు గుడివాడలోని మూడు కోర్టుల్లో నడుస్తున్న ఉంగుటూరు, పమిడిముక్కల, ఉయ్యూరుకు చెందిన మండలాలకు చెందిన 672 కేసులను నూతన కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ రెండో సబ్‌కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ మాట్లాడుతూ ఈ కోర్టుకు పూర్తి స్థాయిలో న్యాయమూర్తి వచ్చేవరకు వారానికి ఒక రోజు కోర్టు పని చేస్తుందన్నారు. అవసరమైతే కేసుల డిమాండ్‌కు అనుగుణంగా రెండు రోజులు కూడా పని చేసేలా చూస్తామన్నారు. అనంతరం సీజే ప్రవీణ్ కుమార్‌తో పాటు ఇతర న్యాయమూర్తులను గన్నవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగాధరరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మణరావు, గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎ.రామచంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎన్.రాయుడు, సీనియర్ న్యాయవాదులు కెవి.రమణ, అనుమోలు వెంకటేశ్వరరావు, ఎస్‌వి.సాంబశివరావు, వేణుబాబు పాల్గొన్నారు.

సంపాదకీయం


# అఖిలపక్ష ప్రహసనాలు

ఎన్నికల వేళ రాష్ట్రంలో అనూహ్యంగా అఖిలపక్ష రాజకీయాలు తెర మీదకు వచ్చిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఎన్నికల నోటిఫికేషన్ రేపోమాపో వెలువడనున్న సమయమిది! అధికారం కోసం రాజకీయ పోరాటం ముమ్మరంగా జరగాల్సిన సమయంలో ఈ భేటీల విన్యాసాలు ఎవరి ప్రయోజనాల కోసం? ప్రత్యేక హోదాను సాధించడమే లక్ష్యమని చెబుతూ మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ ఒక సమావేశాన్ని నిర్వహించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అదే విషయమై మరో అఖిల పక్షాన్ని జరిపింది. ఒకే అంశంపై జరిగిన ఈ రెండు భేటీలకు మధ్య 24 గంటల వ్యవధి కూడా లేకపోవడం ఒక విశేషం.

నిజానికి ప్రత్యేక హోదా ఉద్యమాన్ని చంద్రబాబు నాయుడు ఆదినుండీ నీరుగార్చారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని ప్రకటించగానే ఆ ప్రతిపాదనను అర్ధరాత్రి విలేకరుల సమావేశం పెట్టి మరీ ఆహ్వానించిందెవరు? శాసనసభ సమావేశంలో ధన్యవాదాల తీర్మానం కూడా చేసి పంపారే! రాష్ట్రానికి ఏదో ఒరగబెట్టేశారంటూ కేంద్ర మంత్రులను సన్మానాల వెల్లువలో ముంచెత్తింది నిజం కాదా! కనీసం బిజెపితో తెగిన తరువాతైనా ప్యాకేజికి ఒప్పుకోవడం పొరపాటైందని ప్రజల ముందు చెప్పారా? రానున్న ఎన్నికల్లో ఆ పాపం ఎక్కడ వెంటాడుతుందోనన్న ఆందోళన ఆయనలో నెలకొంది. దానినుండి ప్రజలను పక్కదోవ పట్టించేందుకే అధికారాంతమందు ఈ తాపత్రయం! నిజానికి బిజెపితో అంటకాగినన్నాళ్లు చంద్రబాబు నాయుడికి రాష్ట్రంలోని ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు గుర్తుకు రాలేదు. వేలాదిమందిని అరెస్టులు చేశారు. వందలమందిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు బనాయించారు. ఉద్యమంలో పాల్గొన్న వామపక్ష పార్టీల కార్యకర్తలను, నాయకులను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డారు. ఈ ప్రక్రియలో బాబుకు అఖిలపక్షంగానీ, ప్రజాస్వామ్య విలువలు గానీ గుర్తే రాలేదు. ఎన్నికలు మీదబడి ప్రత్యేక హోదా మా హక్కంటూ ఆంధ్ర ప్రజలు నినదిస్తున్న సమయంలో, చేతులు కాలుతున్న వేళ తగుదునమ్మా అంటూ అఖిలపక్ష సమావేశాలకు సిద్ధమైపోవడం, తాను పూసుకున్న బురదను అందరికి పూయాలన్న కుట్ర కాదా? వామపక్షాలతో సహా ప్రధాన పార్టీలన్నీ ఈ ప్రహసనానికి దూరంగా నిలిస్తే వారికెవ్వరికీ చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించడం , కేసులు ఎత్తివేస్తానని ఇప్పుడు చెప్పడం తన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం కాదా?

ఇక ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించిన అఖిలపక్షం మరో గందరగోళం! గొంతుకోసిన వాళ్లు, కోస్తూ ఉంటే చప్పట్లు కొడుతూ చూసిన వాళ్లూ, ఆ ఘోరాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వాళ్లూ అందరూ ఆయన దృష్టిలో ఒక్కటే! ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని తెగేసి చెప్పిన బిజెపిని కూడా ఆయన సమావేశానికి ఆహ్వానించడమే దీనికి నిదర్శనం. అన్యాయం చేసిన వారిని కూడా కలుపుకున్న తరువాత ఇక చేసే పోరాటమేముంది? ఎన్నికల్లో ప్రత్యేక హోదాకు అన్యాయం చేసిన వారిని, వారితో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అంటకాగిన, కాగుతున్న వారిని చిత్తుచిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధమౌతున్న సమయంలో అన్ని పార్టీలనూ ఒకే గాటన కట్టేలా వ్యవహరించడం ఎవరి ప్రయోజనాలు రక్షించడం కోసమో! పైగా సాధారణ ఎన్నికల తర్వాత చేయాల్సిన పోరాట వ్యూహంపై ఇప్పుడు చర్చ చేయాలంటూ మాట్లాడటంలో అర్థం లేదు. ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చేదెవరో, ప్రత్యేక హోదాపై వారి వైఖరి ఏమిటో తెలియకుండా ఇప్పటినుండీ పోరాట వ్యూహ రచన చేయడం విజ్ఞత అనిపించుకోదు. రాష్ట్ర విభజన, అనంతర పరిణామాలు, పోరాటాల్లో మొదటి నుండి సూత్రబద్ధ వైఖరికి కట్టుబడి, ప్రజాప్రయోజనాల కోసమే పోరాడుతున్న సిపిఎం అందుకే ఈ సమావేశాలు రెండింటికి దూరంగా ఉంది. ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పింది. ఇన్నాళ్లు అధికారంలో ఉండి ప్రత్యేక హోదా కోసం ఏం పాటుపడ్డారో చెప్పగల ధైర్యం అధికార పార్టీకి లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ చెప్పుకోవడానికి చేసిందేమి లేదు. ఇక కేంద్రంలో అధికార పార్టీ చేసిందే ద్రోహమైనప్పుడు రాష్ట్ర ప్రజలకు ఏం చెప్పగలదు? ఏం చెబితే ప్రజలు స్వీకరిస్తారు? అందుకే, తలా ఒక తీరున ఇరుకులో పడిన పార్టీలన్నీ ఏకమై 'అఖిలపక్షం' మాటున దాగేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఈ నాటకాలను గ్రహించలేనంత అమాయకులు కారు!

ఇది విషయం



కష్టజీవి! కార్మికుడా! మానవుడా!
కూలీ! మాలీ! రైతూ!
గుడిసెలలో బ్రతికేవాడా!
గంజినీళ్లు తాగి కాలం గడిపేవాడా!
కడుపెడు సంతానం కలిగినవాడా!
ఆకలికన్నూ! మానవుడా!
తిరగబడేవాడా! ప్రశ్నించేవాడా!
అన్యాయాలకు ఆహుతి కావడానికైనా
జంకనివాడా!

- శ్రీశ్రీ


# నగదు బదిలీ రైతులకు చేయూతనిస్తుందా?

విశ్లేషణ



**గత ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు గాలికి పోగా ప్రభుత్వ వ్యతిరేకత నుండి తట్టుకునేందుకు ఎన్నికల తాయిలంగా నగదు బదిలీ పథకం అటు ప్రధాని మోడీ ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు తెర మీదకు తెచ్చారు. 2014లో ప్రారంభమైన రైతు రుణ మాఫీ ఇంకా అంగలార్చుతూనే వుంది. ప్రస్తుతం కొత్తగా నగదు బదిలీ పథకం తెర మీదకు తెచ్చారు. రాష్ట్రంలో జరిగిన రైతు రుణ మాఫీ గణాంకాలు పరిశీలిస్తే విస్తుపోవాల్సి వుంటుంది.**

ఎన్నికలు ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పుడు సంక్షోభంలో చిక్కుకున్న రైతులు గుర్తుకొస్తు న్నారు. పుణ్యకాలం గడిపేసి ఆపద మొక్కులు చెల్లిస్తున్నారు. తెలంగాణలో అమలు జరిగిన రైతుబంధు పథకం అమలు దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోడీ, తర్వాత ఏపి ముఖ్యమంత్రి, ఇంకా చెప్పాలంటే విపక్షనేత జగన్ అందరూ నగదు బదిలీ పథకాన్ని ముందుకు తెచ్చారు. వ్యవసాయాన్ని సంక్షోభం నుండి గట్టెక్కిం చేందుకు నిపుణుల కమిటీలు ఏం చెప్పాయి? అనే అంశాలను పరిశీలనకు కూడా తీసు కోవడం లేదు. ఎన్నికల గండం గడిచేందుకు ఓట్లు కొల్లగొట్టేందుకు ఇంకా పచ్చిగా చెప్పాలంటే ఓటుకు నోటు తరహాలో ఈ పథకాల తీరుతెన్నులు వున్నాయి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఏమోగాని ఈ సందర్భంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 25 కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వడం కాదు, 25 ఏళ్ల భవిష్యత్తు పదిలం చేసే విధంగా పథకాలు వుండాలని పదే పదే నొక్కి చెప్పడం ప్రాధాన్యత సంతరించుకొన్నది.



వి శంకరయ్య

గత 30 ఏళ్లుగా దేశంలో రైతుల ఆత్మ హత్యలు కొనసాగు తున్నాయి. వ్యవసాయం సంక్షోభం లో చిక్కుకున్నది. ఈ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు కమిషన్లు నియమించాయి. అవి నివేదికలను కూడా అందజేశాయి. అయితే ప్రస్తుతం రైతులను ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హడావుడిలో నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోనికి తీసుకోకపోవడం గమనార్హం. 2004లో కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్ నాయకత్వాన ఒక కమిషన్‌ను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి, జయతీ ఘోష్ ఆధ్వర్యంలో ఒక కమిటీని, 2014 తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు సామాజిక ఆర్థిక అధ్యయనాల సంస్థ (సెస్)ను నియమించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ప్రతి సందర్భంలోనూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను పదేపదే నిలదీసేవారు. దురదృష్టమేమంటే 2014లో ఆయన అధికారం చేపట్టాక స్వామినాథన్ కమిషన్ పేరు ఉచ్చరిస్తే ఒట్టు. పైగా స్వయంగా తను నియమించిన 'సెస్' సమర్పించిన నివేదికను కూడా పరిశీలనకు తీసుకోలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకపక్క రైతులను ఆదుకొనేందుకు నగదు బదిలీ పథకం అమలుకు సిద్ధమౌతూ మరోపక్క రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, రెండంకెలలో రంకెలు వేస్తూ పరుగెడుతున్నదని గొప్పలు చెప్పడం విడ్డూరం. ఇలాంటి నేతల కసరత్తులు దృష్టిలో పెట్టుకొని వ్యవసాయభివృద్ధిని అంకెల రూపంలో చూడకూడదు. అన్ని పథకాలలో మానవీయ కోణం వుండి తీరాలి. రైతుల వాస్తవ ఆదాయాన్ని అభివృద్ధికి కొలబద్దగా తీసుకోవాలని ఎంఎస్ స్వామినాథన్ తన నివేదికలో నొక్కి చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే సీలింగ్, మిగులు, బంజరు భూములను సన్న చిన్నకారు రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. అయితే నేడు ఏపిలో భూముల పంపిణీ దేవుడెరుగు. కార్పొరేట్ శక్తులకు భూములు అప్పగించేందుకు లక్షలాది సన్న, చిన్నకారు రైతులను భూముల నుండి వెళ్లగొట్టిందీ ప్రభుత్వం.

నాణ్యమైన వ్యవసాయ భూమిని, అడవులను వ్యవసాయేతర అవసరాల కోసం కార్పొరేట్ రంగానికి బదలాయించడం ఆపాలని స్వామినాథన్ ముఖ్యమైన సూచనగా చేశారు. ప్రస్తుతం ఏపిలో తద్విరుద్ధంగా సాగుతోంది. సాంప్రదాయ రుణ వ్యవస్థను నిజమైన రైతులకు అవసరమైన వారికే చెందేలా చర్యలు తీసుకోవాలని, రుణాల చెల్లింపు సామర్థ్యం పుంజుకొనే వరకు ప్రైవేటు అప్పులతో సహా అని రుణాల వసూళ్లపై మారటోరియం విధించాలని, వరుస ప్రకృతి విపత్తుల తర్వాత రైతులకు సహాయం అందించేందుకు వ్యవసాయ విపత్తు నిధిని నెలకొల్పాలని స్వామినాథన్ నొక్కి చెప్పారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేసిన సందర్భంలో ఈ విపత్తు నిధి గురించి పదే పదే వాగ్దానం చేసినా నేడు ఆచరణలో గాలికి పోయింది. ఈ నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో ఉత్పత్తేతర రంగానికి వ్యయం చేసిన కోట్లాది రూపాయలు మళ్లించి వుంటే విపత్తు సహాయానికి ఒక రూపు వచ్చేది.

కనీస మద్దతు ధర అనేది సగటు ఉత్పత్తి వ్యయానికి యాభై శాతం అదనంగా వుండా లని స్వామినాథన్ మరో సూచన చేశారు. ఇదంతా నేడు హుష్ కాకి అయ్యింది. పండిన పంటలకు కనీస ధర లేక రోడ్ల వెంబడి పార బోయడం చూస్తున్నాం. పెట్టిన పెట్టుబడు లు అప్పుగా మిగిలితే ఆదుకునేవారు లేక ఉరి కంబాలు ఎక్కిన రైతులెందరో. స్వామి నాథన్ తన సిఫార్సును సమర్పించి 11 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఇటీవల ఢిల్లీలో మాట్లాడుతూ కేవలం ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చినంత మాత్రాన ఒక దఫా రుణ మాఫీ చేసినంత మాత్రనా రైతుల ఆత్మహత్యలు నివారించడం సాధ్యం కాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దుర్నీతిని ఎండగట్టారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలు వ్యవసాయ రంగం లో అమలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. 2014 ఎన్నికల్లో రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని బిజెపి చేసిన వాగ్దానం బుట్ట దాఖలైందని ఆరోపించారు.

ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రకటిస్తున్న నగదు బదిలీ వ్యవ సాయాభివృద్ధికి ఏమాత్రం ఉపకరించదు. ఓట్లు దండుకోవడానికి మాత్రమే ఉపకరి స్తుంది. వైఎస్ హయాంలో నియమింపబడిన జయతీఘోష్ కమిటీ రైతులకు గిట్టుబాటు ధర లభించడానికి, అవసరాల కోసం వచ్చిన ధరకు పంట తెగనమ్మకుండా చూడటానికి సకాలంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ చేపట్టాలని, ప్రధానంగా మార్కెట్ ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని' సూచించింది. అయితే ఆ సలహాను అటు వైఎస్ ప్రభుత్వం గాని, నేడు ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రభుత్వం గానీ ఎంత మాత్రం అమలులో పెట్టిందీ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

అలాగే చంద్రబాబు నాయుడు నియమిం చిన 'సెస్' అధ్యయన నివేదిక 134 సిఫార్సు లను చేసింది. రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతుల సంఖ్య పెరుగుతోందని సగానికి పైగా సాగు విస్తీర్ణం వ్యాపారుల నుండి అది కూడా అధిక వడ్డీలకు తీసుకుంటు న్నారని ఈ నివేదిక ధృవీకరించింది. రాష్ట్రంలో ప్రతి కుటుంబంపై రూ.1.23 లక్షల అప్పు వుందని రైతులు చేస్తున్న అప్పులలో 50 శాతం తినడానికి, ఆరోగ్యం, విద్య, గృహ అవసరాలకే సరిపోతోం దని వెల్లడించింది. బ్యాంకులు ఇచ్చే కొద్దిపాటి రుణాలతో రైతులు వ్యవసాయంలో సుస్థిరత సాధించలేరని ప్రభుత్వ పెట్టుబడి క్రమేణా తగ్గిపోతోందని ఆందోళన వెలిబుచ్చింది. రాష్ట్రంలో ఎక్కువ భాగం కౌలు రైతులు వున్నందున వారికి ప్రభుత్వం నుండి రాయి తీలు లభించడం లేదని చెప్పింది.


ఏపిలో 60.73 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతూ వుంటే 20.53 లక్షల హెక్టార్లను అంటే 33.8 శాతం కౌలు రైతులు సాగు చేస్తున్నట్లు ఈ నివేదిక బహిర్గతం చేసింది. రాష్ట్రంలో వ్యవసాయం కుదుటబడాలంటే పంజాబ్ రైతు కమిషన్ తరహాలో ఆంధ్రప్రదేశ్ రైతు కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ అధ్యయన నివేదిక ప్రధాన సూచన చేసింది. ఈ నివేదికనే పరిశీలించి ముఖ్యమంత్రి రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తారని ఎలా భావించగలం? గత ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు గాలికి పోగా ప్రభుత్వ వ్యతిరేకత నుండి తట్టుకునేందుకు ఎన్నికల తాయిలంగా నగదు బదిలీ పథకం అటు ప్రధాని మోడీ ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు తెర మీదకు తెచ్చారు. 2014లో ప్రారంభమైన రైతు రుణ మాఫీ ఇంకా అంగలార్చుతూనే వుంది. ప్రస్తుతం కొత్తగా నగదు బదిలీ పథకం తెర మీదకు తెచ్చారు. రాష్ట్రంలో జరిగిన రైతు రుణ మాఫీ గణాంకాలు పరిశీలిస్తే విస్తుపోవాల్సి వుంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఒక నమూనా సర్వే ప్రకారం రైతులలో 45 శాతం మందికే బ్యాంకులు రుణాలిస్తున్నాయని ఒకటిన్నర ఎకరా గల సన్న, చిన్నకారు రైతులలో 15 శాతం మందికే బ్యాంకు రుణాలు లభ్యమౌతున్నాయని వెల్లడైంది. ఈ నేపథ్యంలో పాక్షికంగా అమలు జరిగిన రుణ మాఫీ ఏవిధంగానూ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ లేదు. పైగా సిగ్గు విడిచిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ఒక సభ్యుని ప్రశ్నకు జవాబు చెబుతూ దేశంలో రైతు కుటుంబాల సగటు నెల ఆదాయం 6 వేల రూపాయలుగా వుందని చెప్పడం మరో విశేషం.

**(రచయిత విశ్రాంత పాత్రికేయుడు, సెల్ : 9848394013)**

# బీసీల్లో కూడా తెలివైన పిల్లలు వుంటారట!

సెటైర్

ముఖ్యమంత్రి మహోదయా ఏమంటిరి ఏమంటిరి? బీసీ పిల్లల్లో కూడా తెలివైన వారుంటారని సెలవిచ్చితిరా? ఎంత మాట ఎంత మాట. ఇది అజ్ఞానమనుకుందుమా? లేక అహంభావమని నామకరణం చేయుదుమా? చెప్పండి ప్రభూ. గతములో కూడా తమరు ఇటులనే 'ఎవరూ ఒక ఎస్సీగా పుట్టాలని కోరుకోరు' అంటూ వాక్రుచ్చితిరి కదా. ఇది ఏదో పొరపాటున నోరు జారితిరని సరిపెట్టుకొమ్మందురా? అటులనే అనుకొందుము కాని మీరు ఇటుల మాటిమాటికీ నోరు జారుట పరిపాటి కాదని మా విన్నపము. ఇదంతయూ ఏల? అసలు తెలివితేటలనిన ఏమిటో ఒకపరి వివరముగా తొక్కలు తీసి తేల్చుకొనుట మేలు కదా. అయినచో చిత్తగించుడీ మానవుడి పాదాలకు ప్రాణ దానము చేసిన ఆ ఆదిమ కళాకారుడు.. చర్మకారుడు తెలివి తక్కువవాడని మీ విశ్వాసమా? బహుశా ఆ చర్మకారుడు తన కండరాలను కదిలించి మస్తిష్కమును మథించి సృష్టించిన పాదరక్షలను రంగుటద్దాలలో ప్రదర్శించి విపణి వీధిలో కోట్లు గడించిన వాడే మహా మేధావి అని తమరు భావించితిరేమో. మానవుడి చర్మానికి రక్షా కవచముగా వస్త్రమును నేసిన ఆ ప్రాచీన కళాకారుడు.. చేనేత కార్మికుడు తెలివి తక్కువ వాడని తమ అభిప్రాయమా? నిజమే ఆ నేత కార్మికుడి కండల కొండలలో ఉదయించిన వస్త్రారుణ ఆకాశాలను ప్లాస్టిక్ బొమ్మలకు చుట్టి చకచ్చకిత కాంతి మందిరాలలో పెట్టి అమ్ముకొని అశేష ధనరాశులను కొల్లగొట్టిన వాడే మీ దృష్టిలో తెలివైన వాడు కావొచ్చు.



ప్రసాద మూర్తి

కొండముచ్చు శిరస్సుల మీద బొచ్చు గొరిగి..చంకలలో కేశాల డొంకలను చదును చేసి మానవుడి ముఖానికి అందాన్ని అతికించిన క్షురక బ్రహ్మను కూడా తమరు తెలివి తక్కువ వారి జాబితాలో వేసి పరిహసించవచ్చు. అవును మరి! మనిషిని జంతువు నుంచి వేరు చేసి లోకాన్ని శుభ్రం చేసిన వాడి పేరు మార్చి మణిమయ కాంతుల సెలూన్లు..బ్యూటీ పార్లర్లు పెట్టి కోట్లు కొట్టిన వాడే అసలు బ్రహ్మ అని మీ ఆలోచన కాబోలు. ఊరిని ఉతికి ఆరబెట్టి గంజి పెట్టి ఇస్త్రీ చేసి తళతళా మెరుపులద్ది ప్రపంచానికి పరిశుభ్రత నేర్పిన ఆ అనాది సృష్టికర్త..రజక శ్రామికుడు తెలివి తక్కువ వాడనే తమ ఉవాచ కాబోలు. అందుకే ఆ యుగాల శ్రామికుని రక్తము నుంచి దోచుకొనిన కళను లాండ్రీలలో బంధించి వ్యాపారము చేయువాడే బుర్ర ఉన్న వాడని తస్మదీయ హృదయ సాగరము ఘోషించుచున్నది కావలయును. అగ్నిలో దేహాలను లోహాలుగా కరిగించిన కమ్మరి కూడా మీకు తెలివి తక్కువ వాడే. కావుననే కమ్మరి కొలిమిని కర్మాగారములకు తరలించిన వారిని తమరు మేధో సంపన్నులుగా గుర్తించుచుంటిరేమో.

ఎంత పరిశోధన గావించి ఈ మహత్తర విషయమును ఆవిష్కరించితిరో కదా. మీ తెలివితేటలను కీర్తించుటకు మా తెలివి తక్కువ




**జ్ఞానమనిన దొరతనము.. దొంగతనమూ కాదని, అది శరీరమూ.. మెదడూ.. మనసూ కలిసి చరిత్రను చిలికిన సారమని బోధించే పిల్లలు పుట్టుకొస్తున్నారు రాజా. మీరు కానుకగా ఇచ్చే సైకిళ్ళ మీద కాదు, వాళ్ళు కాలం కత్తి మొన మీద నిలబడి కొత్త చదువులు చదువుతున్నారు. వారి ధగద్ధగాయమాన జ్ఞాన కాంతి వలయాలలో చిక్కుకుని 'కుయ్యో... మొర్రో' అన్ననూ ఒక్కండును.. ఒక్కండును మీ మొర ఆలకింపడు బాబూ!**

నోటికి మాటలు తట్టుట లేదు మహాప్రభో. మట్టి కడలిని మథించి వెన్నెల పాత్రలను వెలికి తీసిన ఆ మట్టి మనిషి కుమ్మరి కూడా తెలివి తక్కువ వాడే. అరుణారుణ ఉదయాలను స్వర్ణ భస్మముగా మార్చి మనోహర సువర్ణాభరణ చరణ చరణాల సౌందర్య గీతాల రచనలు చేసిన ఆ మహా విశ్వకర్మ కూడా తెలివితక్కువ వాడే. కాదు కాదు కొండొకచో మీ అభిమతమున కొందరు తెలివైన వారునూ పుట్టుదురు. వారిని ఆదుకొనుటకు తమబోంట్లను దేవుడు ఇలకు పంపించయుండవచ్చును. అందువలనే తమరు జాలర్లకు వలలను.. రజక మిత్రులకు ఇస్త్రీ పెట్టెలను.. నేతగాండ్రకు మరమగ్గములను.. కమ్మరులకు కుమ్మరులకు సుత్తీ చెక్రాలను ఎందరెందరికో ఎన్నో అద్భుత పనిముట్లను కానుకగా ఇచ్చి ఆదుకొనుచున్నారు. ఎంతటి దయామయ కరుణామయ త్యాగమూర్తులు మీరు? ఒక మర్మము బోధపడకున్నది మహానుభావా. తెలివి తక్కువవారు కొన్ని కులములలో పుట్టుదురని ప్రవచించిన ప్రవక్తా! మరి ఆ తెలివి తక్కువ కులముల వారి కులవృత్తులు మీ అపార పరివార గణములకు వ్యాపార కేంద్రములుగా ఎటుల అక్కరకు వచ్చినవో చెప్పగలవా?

జ్ఞానమనిన దొరతనము.. దొంగతనమూ కాదని, అది శరీరమూ..మెదడూ..మనసూ కలిసి చరిత్రను చిలికిన సారమని బోధించే పిల్లలు పుట్టుకొస్తున్నారు రాజా. మీరు కానుకగా ఇచ్చే సైకిళ్ళ మీద కాదు, వాళ్ళు కాలం కత్తి మొన మీద నిలబడి కొత్త చదువులు చదువుతున్నారు. వారి ధగద్ధగాయమాన జ్ఞాన కాంతి వలయాలలో చిక్కుకుని 'కుయ్యో... మొర్రో' అన్ననూ ఒక్కండును.. ఒక్కండును మీ మొర ఆలకింపడు బాబూ!

అభిప్రాయం

## ఓటు విలువ తెలుసుకోండి



డబ్బుకు, ఇతర ప్రలోభాలకు లోబడి ఓటు వేయడం చట్ట విరుద్ధం. రాజకీయ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలి. ఐదేళ్లకు ఒక్కసారి వచ్చినా, మన జీవితాలను, తల రాతను మార్చేది ఎన్నికలు. మనం వేసే ఓటుతోనే నవసమాజం నిర్మితమౌతుంది. అందుకనుగుణంగా ఓటు ఆవశ్యకత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకున్న పాత్ర గురించి యువ ఓటర్లను చైతన్యం చేయాలి. ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో ప్రజలే పరిపాలకులు. మనం వేసే ఓటే మన భవిష్యత్తు, రాబోయే తరాల మనుగడ నిర్ణయిస్తాయి. కానీ మన దేశంలో ఎన్నికల పరిస్థితి దారుణంగా ఉంది. ఎన్నికల సమయంలో దేశం మొత్తంలో 60 శాతం పోలింగ్ కూడా నమోదు కావడం లేదు. 125 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో సుమారు 100 కోట్ల మంది ఓటర్లు వుంటే, కేవలం 50 కోట్ల లోపు ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. మన దేశ పరిస్థితి ఇలా వుంటే, ఇతర దేశాల్లో మాత్రం ఓటు వేయడం తప్పనిసరి. ఒక వేళ ఓటు వేయకుండా వుంటే ఎన్నికల సంఘం నుంచి జరిమానా పత్రం ఇంటికి వెళుతుంది. అంతేకాదు చట్టబద్ధమైన చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ మన దేశంలో అనేక మంది ఓటింగ్ రోజును కేవలం సెలవు దినంగా మాత్రమే చూస్తారు. ఓటు ప్రాముఖ్యతను ఎంతమంది ఎన్నిరకాలుగా చెప్పినా పట్టించుకునే వారు చాలా అరుదు. అందుకే ఇతర దేశాల మాదిరి మన దేశంలో కూడా ఓటు హక్కుపై కఠిన నియమాలు పెట్టవచ్చు. కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రతి పౌరున్ని మేల్కొల్పాలి. ఎన్నికల కమిషన్, ప్రభుత్వ పెద్దలు ఈ బాధ్యతను నిర్వర్తించాలి. అపుడే మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది.


**కాళంరాజు వేణుగోపాల్, మార్కాపురం.**

**వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా**
editpageps@gmail.com

# దగా పడుతున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సమీక్ష


కాంట్రాక్టు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సి 2015 మినిమం టైంస్కేల్‌ను ఏప్రిల్ 1 నుండి వర్తింపచేస్తూ ఇటీవలె జీఓ 12ను జారీ చేసింది. ఈ జీఓ 3 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం చేస్తోంది. ఈ జీఓ.12 ను సవరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, నేషనల్ హెల్త్ మిషన్, ఎస్ఎన్‌సియు, 104, 108, 102, ముఖ్య మంత్రి ఆరోగ్య కేంద్రాలు, ఆర్‌బిఎస్‌కె, ట్రామా, బ్లడ్‌బ్యాంక్స్, ఎపి సాక్స్, ఆర్ఎన్‌టిసిపి, ఆరోగ్య మిత్ర, రిమ్స్, వైద్యవిధాన పరిషత్ తదితర వైద్య, ఆరోగ్య రంగంలోని విభాగాలు, సర్వశిక్షా అభియాన్ లోని అన్ని విభాగాలు, కెజిబివి, వెలుగు, ఉపాధి హామీ తదితర కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, యూనివర్సిటీలలో పని చేస్తున్న 3 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్‌ను వర్తింపచేయాలని జెఏసి కోరుతున్నది.



ఏ వి నాగేశ్వరరావు

జీఓ.12 వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 3 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో 2,90,000 మందికి అదనంగా ఒరిగేదేమీ లేదు. మిగిలిన 10 వేల మందికి గతంలో ఉన్న విధంగా మాత్రమే మినిమం టైం స్కేల్ అమలవుతుంది. మన ఉమ్మడి రాష్ట్రంలో 5 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2005 నుండి 2015 వరకు మినిమం టైంస్కేల్ అంటే రెగ్యులర్ ఉద్యోగుల మినిమం బేసిక్ జీఓ 2501, అనంతరం జీఓ.3 ల ద్వారా వర్తించేది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జీఓ లకు భిన్నంగా జీఓ.151, జీ.ఓ 95, జీఓ.27 లను విడుదల చేసింది. ఈ జీఓ ల ద్వారా రెగ్యులర్ ఉద్యోగుల మినిమం బేసిక్‌ను తొలగించింది. జీఓ.151 ద్వారా కేటగిరీల వారీగా వేతనాలను తగ్గించే పద్ధతికి శ్రీకారం చుట్టింది. గతంలో మినిమం బేసిక్‌ను 9వ పీఆర్‌సి ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపచేస్తూ నాటి రాష్ట్ర ప్రభుత్వం జీఓ.3 ను జారీ చేసింది. జీఓ.3 ద్వారా రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైంస్కేల్ అమలయ్యింది. ఆ పద్ధతికి భిన్నంగా ప్రభుత్వం నేడు ప్రభుత్వ శాఖలలోని కాంట్రాక్టు ఉద్యోగులకు, అదీ ఖాళీలలో ఆర్థికశాఖ ఆమోదంతో మాత్రమే పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే వర్తింపచేస్తూ జీఓ.12 ఇవ్వడం దుర్మార్గం.

**ఎన్నికలు దగ్గర పడిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల మందికి అన్యాయం చేయడం తగదు. అన్ని వర్గాలకు వరాలు ప్రకటిస్తున్నానని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల మందికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడింది. ఇప్పటికైనా జీఓ.12 ను సవరించాలని, ఈ రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 3 లక్షల మందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మినిమం టైంస్కేల్‌ను అమలు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని జెఏసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.**



ఉన్న హక్కును తొలగించి, వేతనాలను తగ్గించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు జీఓ.12 ద్వారా కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలను పెంచామని, ఇది వరమని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. జీఓ.12 లోని నిబంధనల రీత్యా ఈ జీఓ ప్రకారం ఒకప్పుడు తీసుకుంటున్న మినిమం టైం స్కేల్ ఇప్పుడు కేవలం 10 నుండి 12 వేల మందికి వర్తింపచేస్తామని, ఇది ఘనతగా ప్రభుత్వం చెప్పుకుంటున్నది. వాస్తవంగా 2,90,000 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను దగా చేస్తున్నది.

### 'సుప్రీం' తీర్పు ప్రకారం అందరికీ వేతనాలు

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు పెంచుతున్నామని ఘనంగా ప్రభుత్వం చెప్పుకుంటున్నది. కానీ అదే సుప్రీంకోర్టు కేవలం కాంట్రాక్టు ఉద్యోగులకే కాక ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్, టెంపరరీ తదితర ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల మినిమం బేసిక్‌ను వర్తింప చెయ్యమని తీర్పు చెప్పింది. ఆ తీర్పు ప్రకారం రాష్ట్రంలోని 3 లక్షల మందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయాలి. సుప్రీంకోర్టు తీర్పుకు ముందే ఈ రాష్ట్రంలో 2005 నుండి 2015 వరకు మినిమం టైంస్కేల్ అమలవుతున్నది. కానీ ఆ హక్కును తెలుగుదేశ ప్రభుత్వమే తొలగిం చింది. 3 లక్షల మందికి అమలవుతున్న మినిమం టైం స్కేల్ వేతనాలను తగ్గించి, ఇప్పుడు కేవలం 10 వేల మందికి పాత వేతనాలకు సమానంగా జీఓ.12 ఇస్తున్న పుడు ఇది కాంట్రాక్టు ఉద్యోగులకు వరం ఎలా అవుతుందో ప్రభుత్వమే చెప్పాలి. 3 లక్షల మందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయాలి.

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి ఎన్నికల మ్యానిఫెస్టో లోని హామీ ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయడానికి, వేతనాలు పెంచడానికి అధికారం చేపట్టిన వెంటనే మంత్రివర్గ సబ్‌కమిటీని వేసింది. ఈ కమిటీ నెలలోగా నివేదిక ఇవ్వాలని జీఓ ఇచ్చింది. నాలుగున్నర సంవత్సరాల తర్వాత మంత్రివర్గ సబ్‌కమిటీ "కొండను తవ్వి ఎలకను పట్టిన" చందంగా మినిమం టైంస్కేల్‌ను అదీ కేవలం కాంట్రాక్టు ఉద్యోగులకు అదీ ప్రభుత్వ శాఖల ఖాళీలలో ఆర్థికశాఖ ఆమోదంతో పని చేస్తున్న వారికి మాత్రమే వర్తించే నిర్ణయాన్ని చేసింది. ఇది అన్యాయం.

### ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఎన్నికలు దగ్గర పడిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల మందికి అన్యాయం చేయడం తగదు. అన్ని వర్గాలకు వరాలు ప్రకటిస్తున్నానని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల మందికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీఓ.12 ను సవరించాలని, ఈ రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 3 లక్షల మందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మినిమం టైంస్కేల్‌ను అమలు చేయాలని, డీఏ చెల్లించాలని, 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు అమలు చేయాలని, చనిపోయిన వారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని జెఏసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. సమస్యలు పరిష్కారానికై కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్య ఆందోళనలకు సంసిద్ధం కావాలని జెఏసి కోరుతున్నది.

**( రచయిత ఏపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ మరియు వర్కర్స్ జెఏసి ఛైర్మన్ )**



మ్యాజిక్ అంటే ఇష్టపడనివారు ఉండరు. అయితే ఆ మ్యాజిక్స్ వెనకున్న ట్రిక్కు ఏంటో ఎంత మందికి తెలుస్తుంది? బాబాలు చేసే మాయల వెనుక సైన్స్ సూత్రాలేంటో ఎవరు గమనిస్తారు? అందుకే పిల్లలకు సైన్స్‌పై అవగాహన పెంచి, మూఢనమ్మకాల నుంచి విముక్తి కలిగించడానికి దేశవ్యాప్తంగా బాల విజ్ఞాన మేళాలు జరుగుతున్నాయి. పిల్లల్ని సైన్స్ నేర్చుకునేలా ప్రోత్సహించడం, ప్రజల్లోని అశాస్త్రీయ భావాలను తొలగించి, శాస్త్రీయ దృష్టి వైపుగా పయనింపజేయడంలో ఈ విజ్ఞాన మేళాలు ఎంతో సహాయపడుతున్నాయి. మనుషులు సైన్స్‌తో జీవిస్తున్నారనీ, దానిని గుర్తించడంలో కాస్త వెనకడుగులో ఉన్నారనీ తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఆవశ్యకం. బడి పిల్లల ద్వారా ఇంటింటికీ విజ్ఞానాన్ని చేర్చే ఈ మేళాల గురించి తెలుసుకుందామా?

# ఇంటింటికీ విజ్ఞానం



శాస్త్రీయతను ప్రచారం చేయడమే ధ్యేయంగా ప్రజలకు సైన్స్‌పై సమాచారాన్ని అందించే క్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం 'విగ్యాన్ ప్రసార్' అనే ప్రణాళికను రూపొందించింది. ఇందులో జాయ్ ఆఫ్ లెర్నింగ్ అనే సంస్థతో పాటు ఆయా రాష్ట్రాలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తున్న 'జన విజ్ఞాన వేదిక (జెవివి)' వంటి వివిధ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా 'బాల్ విజ్ఞాన్ మేళా'లు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కాశ్మీర్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణా, ఒడిశా, ఉత్తరాఖండ్, జైపూర్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి మేళాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాల విజ్ఞాన మేళాలు అధికంగా ఏర్పాటు చేస్తున్నారు.

### జెవివి భాగస్వామ్యం

ఇటీవల జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఆంధ్రప్రదేశ్‌లో బాల విజ్ఞాన మేళాలు నిర్వహించారు. ఇక్కడకు నాలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో జన విజ్ఞాన వేదిక ముఖ్యపాత్ర వహించి, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేళాలో తమిళనాడు సైన్స్ ఫోరం నుంచి వచ్చిన వ్యక్తులు, ప్రభుత్వ టీచర్లు, ఎన్‌జిఓ సభ్యులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లతో పాటు సైన్స్‌ను ఆటల ద్వారా నేర్పే 'జాయ్ ఆఫ్ లెర్నింగ్ ఫౌండేషన్' నుంచి వచ్చిన ప్రతినిధులు రిసోర్స్ పర్సన్స్‌గా సైన్స్ సూత్రాల్లోని కిటుకులను బోధించారు. ఇది ఐదు రోజుల కార్యక్రమం. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది. దీనికి పొడిగింపుగా కడపలోనూ సమతా విజ్ఞాన ఉత్సవాలూ నిర్వహించడానికి జెవివి పూనుకుంది.

### అనుమానాలకు సైన్స్ నివృత్తి

పిల్లలకి సైన్స్‌లో భవిష్యత్తును నిర్మించుకోవడానికి అనుకూలమైన ఆలోచనలు కల్పించడమూ బాల విజ్ఞాన మేళాల ముఖ్య ఉద్దేశం. సైన్స్‌లో ఉద్యోగం సంపాదించుకోవడానికి, లేదంటే సైన్స్‌ని రోజువారీ జీవితంలో ఆపాదించడానికి, అనుసరించడానికి అవసరమైన విజ్ఞానాన్ని ఈ కార్యక్రమం అందిస్తుంది. ఇందులో చెట్లు పునరుత్పత్తి, జీవపరిణామం, విద్యుత్తు వంటి చాలా అంశాలు బోధిస్తారు. గాజుపెంకుల గుట్టలుగా పోసి, వాటిపై డ్యాన్స్ చేయడం... కాగుతున్న నూనెలో చేతులు పెట్టి, వేగుతున్న భజ్జీలు తీయడం వంటి పనుల వెనుక ఉన్న సైన్స్‌ని తెలియజేస్తారు. చాలా మంది పిల్లలకు సైన్స్ సూత్రాలు... అవి ఎలా పనిచేస్తాయి అనే వాటిపై కొన్ని అనుమానాలు ఉంటాయి. వాటిని సులువుగా అర్థం చేసుకోవడానికి, అర్థం చేయించడానికి ఈ మేళాల్లో శిక్షణ అభ్యర్థులు ఇక్కడ శిక్షణ తీసుకొని వారివారి జిల్లాల్లో సైన్స్‌కి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి ఇది తొలిమెట్టు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని కల్గించే విధంగా ప్రణాళికలు రూపొందించడంలో ఈ కార్యక్రమం సహకరిస్తుంది. ఇక్కడ శిక్షణ ఇస్తున్నవారు, శిక్షణ తీసుకుంటున్నవారిలో సైన్స్ బోధించే టీచర్లే కాకుండా ఇతర విషయాలను బోధించే వ్యక్తులూ ఉన్నారు. ఇందులో పాల్గొంటున్న వ్యక్తులు వారికి తెలిసిన సైన్స్‌తో పాటు వారు తెలుసుకోవాల్సిన సైన్స్ విషయాలనూ ఇక్కడ నేర్చుకుంటారు. ముఖ్యంగా ప్రాక్టికల్ సైన్స్‌ని ప్రచారం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా శిక్షణ ఇస్తారు. సైన్స్ సిద్ధాంతాల్లో ఉన్న ప్రాథమిక సూత్రాలను సులువుగా అర్థం చేసుకోవడానికి ఇక్కడ తీసుకుంటున్న టీచర్లు వారివారి ప్రాంతాలకు వెళ్లిన తర్వాత పాఠశాల స్థాయిలో పనిచేస్తారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం విద్యార్థులకు సైన్స్‌ను, వాటి సూత్రాలను అర్థం చేసుకోవడంలో కళ్లకు కనిపించిన సైన్స్ సత్యాలను కళ్లెదుట ఉంచే ప్రయత్నం. ఉదాహరణకు లైట్ ప్రయాణం గురించి చెప్పడానికి... ఒక లైట్ బీమ్‌లో చపాతీ పిండిని చల్లి, లైట్ పరిణామాన్ని తెలియజేయడం. ఇలాంటివెన్నో అంశాలపై శిక్షణ, బోధన ఉంటుందిక్కడ.




### సైన్స్‌ను వ్యాప్తి చేయాలి

బాల విజ్ఞాన మేళాలో నేర్చుకున్న పాఠాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అందులో పాల్గొన్న ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చెబుతారు. 'ప్లే వే మెథడ్' (ఆటలతో నేర్పే పద్ధతి) ద్వారా ఇక్కడ వివిధ అంశాలను నేర్పుతురు. దీనివల్ల డబ్బు ఖర్చు చేయకుండా చిన్నచిన్న వస్తువులతో సైన్స్‌ని బోధించవచ్చు. అందుకే టీచర్లు కూడా ఆసక్తిగా నేర్చుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారు. అంతేగాక వీటిని పాఠశాలల్లో పిల్లలు నేర్చుకోవడమూ సులువు అవుతుందని అంటారు టీచర్లు. ఇక్కడ నేర్చుకునే కాన్సెప్ట్‌ను ఉపయోగించి, సైన్స్‌కు సంబంధించిన అన్ని విషయాలను సులువుగా అర్థం చేసుకోవచ్చని, లెక్కలు, ఖగోళ భౌతికశాస్త్రాలనూ నేర్పుతున్నట్లు చెబుతున్నారు టీచర్లు. సైన్స్ వినడం ద్వారా కాకుండా ప్రాక్టికల్‌గా చేసి చూపించడం ద్వారా ఎక్కువ తెలుస్తుందని ఈ కార్యక్రమం నిరూపించి చూపుతుంది.

**ముఖ్యంగా పిల్లల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించడానికి ఇలాంటి బాల విజ్ఞాన మేళాలు ఎంతో తోడ్పడతాయి. అవును.. సైన్స్ బోధించడం ఎంత ముఖ్యమో సైన్స్‌ను అర్థం చేసుకునే విధంగా పిల్లల్ని తయారుచేయడం అంత ముఖ్యం. దానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగపడతాయి. అయితే ఇక్కడ నేర్చుకున్నవి బయటకెళ్లి, వ్యాప్తి చేసినప్పుడే ప్రతిఫలం ఉంటుంది. సామాన్యులు సైతం సైన్స్‌ని సులభంగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.**

**- ప్రవీణ్ వెలువోలు**


### సైన్స్ టెంపర్‌ను పెంచుతారు



ఈ విజ్ఞాన మేళాలకు విగ్యాన్ ప్రసార్ ద్వారా ఫండింగ్ అందిస్తారు. జాతీయ స్థాయిలో గిరిజన పిల్లలకు, స్కూళ్లలో పిల్లలకు సైన్స్‌ను సులువుగా నేర్పడమే వీటి ముఖ్య ఉద్దేశం. ఇది పిల్లల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంచడానికి చేస్తున్న కార్యక్రమం. ఇక్కడ సాహిత్య, సాంస్కృతిక, సాంకేతిక విద్యను కూడా అందిస్తారు.

**- కె. త్రిమూర్తులు, జన విజ్ఞానవేదిక, ఆంధ్రప్రదేశ్**

### జాయ్‌గా శిక్షణ



జాయ్ ఆఫ్ ఫౌండేషన్ కూడా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాల నిర్వహణలో కీలక భాగస్తులయ్యారు. గిరిజన బాలవిజ్ఞాన మేళాలో జాయ్ ఆఫ్ లెర్నింగ్ భాగస్వాములవ్వడం వల్ల సరదాగా చదువుకోవడం ఎలాగో పిల్లలకే కాకుండా పెద్దలకూ, ముఖ్యంగా ఉపాధ్యాయులకు, బోధకులకు అర్థమవుతుంది.

**- వికాస్, జాయ్ ఆఫ్ ఫౌండేషన్, ఢిల్లీ.**

### మెరుగైన ఫలితం పొందాము



ఇక్కడ చెప్పే అంశాల ద్వారా సొంతగా కొన్ని బోధనా పద్ధతుల్ని రూపొందించుకొని, దానికి సహకరించే పరికరాలను స్వయంగా తయారుచేసుకొని, పిల్లలకు బోధిస్తున్నాం. దీని ద్వారా పిల్లలు సైన్స్‌ని కష్టమైన విషయంగా కాకుండా ఎంతో ఇష్టంగా నేర్చుకోవడం గమనించాం. మా పాఠశాలలో ఈ పద్ధతుల్ని పాటిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.

**- పద్మ, గణిత ఉపాధ్యాయిని, భద్రాచలం.**

### ప్రాక్టికల్‌గా నేర్పాలి



అన్ని సబ్జెక్టుల్లాగానే సైన్స్ కూడా టెక్స్ట్‌బుక్స్ ద్వారానే బోధించడం సరైన పద్ధతి కాదు అనిపిస్తుంది. సైన్స్ అనేది చేస్తూ.. లేదంటే ఆచరిస్తూ నేర్చుకోవాల్సిన సబ్జెక్ట్. ప్రాక్టికల్‌గా సైన్స్‌ను బోధించలేకపోవడం వల్ల టీచర్లు కాన్సెప్ట్ పరంగా నమ్మకంగా చెప్పలేకపోతున్నారు. కనుక చిన్నచిన్న సైన్స్ అంశాలను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

**- షేక్ జానీ భాషా, స్కూల్ అసిస్టెంట్, భోగాల మండలం, నెల్లూరు జిల్లా**



# బెల్లంతో కాలేయ శుద్ధి



తీపి కోసం చక్కెరని వాడడం అందరికీ అలవాటుగా మారింది. అయితే చక్కెర కన్నా బెల్లం వాడకం ఎంతో మంచిది. ఎందుకంటే బెల్లంలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. దీనివల్ల అధికంగా క్యాలరీలు చేరుతాయన్న ఆందోళన, అధిక బరువు పెరుగుతామన్న భయం ఉండవు. ఈ క్రమంలోనే నిత్యం రోజూ రాత్రి పూట భోజనం చేశాక ఒక చిన్న బెల్లం ముక్కను తింటే కాలేయం కూడా శుద్ధవుతుందని నిపుణులు చెబుతున్నారు.

- బెల్లంలో ఉండే ఔషధ గుణాలు జీర్ణాశయంలోని పలు డైజెస్టివ్ ఎంజైమ్‌లను ప్రభావితం చేస్తాయి. దీనివల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ సమస్యలూ ఉండవు.
- బెల్లం మన శరీరంలోని లివర్‌కు ఎంతగానో మేలు చేస్తుంది. లివర్‌ను శుభ్రపరిచేందుకు బెల్లం పనికొస్తుంది. నిత్యం బెల్లంను తింటుంటే లివర్‌లో ఉండే హానికర వ్యర్థాలు, విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. దీంతో లివర్ శుభ్రంగా ఉంటుంది. లివర్ సంబంధ అనారోగ్యాలు రావు. అధిక బరువు తగ్గుతారు.
- బెల్లంలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దీన్ని తింటే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యంలో ఉంటాయి. దీంతో కండరాల నిర్మాణం సరిగ్గా ఉంటుంది. శరీర మెటబాలిజం సరిగ్గా ఉంటుంది. దీంతోపాటు శరీరంలో అధికంగా ఉండే నీరు బయటకు వెళ్లిపోతుంది. గుండె జబ్బులు రావు.

★

### జీవన సౌరభం

**ప్రశాంతమైన మనసుతో ఉండేవారికి ఏ పనీ అయోమయంగా కనిపించదు. ఎందుకంటే వారికి సరైన అవగాహన శక్తి ఉంటుంది.**

### మీకోసం

**మెంతుల్ని అరగంటసేపు నీటిలో నానబెట్టి మెత్తని పేస్టులా చేసుకుని ముఖానికి, చేతులకూ రాసుకుని అరగంట తర్వాత స్నానం చేస్తే చర్మం నిగారిస్తుంది.**



# రోబోలే.. ఆ రెస్టారెంట్‌లో వెయిటర్లు

హోటళ్లలో, రెస్టారెంట్లలో వెయిటర్ల పాత్ర చాలా కీలకం. ఆర్డరు తీసుకోవటం దగ్గర నుంచి కావాల్సిన పదార్థాలు అమర్చటం దాకా వారి పనులన్నీ కస్టమర్లను సంతోషపెట్టడానికే! ఆ సమయంలో మనకేమైనా కావాల్సి వచ్చినా వారిని పిలిచి చెబుతాము. కానీ, ఈ హోటల్ అలా కాదు. ఆర్డరు చేసిన పదార్థాలు ఐదు నిమిషాల్లోనే టేబులు మీదికి వచ్చేస్తాయి. తినడం ప్రారంభించి పూర్తయ్యే దాకా వెయిటర్లు అందుబాట్లోనే, టేబులు పక్కనే ఉంటారు. ఏ క్షణాన ఏమి కావాలో తెలుసుకోవటానికి కనిపెట్టుకొని ఉంటారు. అంతేకాదు, కస్టమర్లతో సరదాగా మాట్లాడతారు, జోకులతో నవ్విస్తారు. డ్యాన్సులతో అలరిస్తారు. అదంతా చేస్తున్నది వెయిటర్లే కానీ, మనుషులు కారు. అవును.. ఆ వెయిటర్లు మనిషి సృష్టించిన అత్యాధునిక రోబోలు.

హంగేరియా దేశ రాజధానిలో ఇ-సోజెట్వర్ఫ్‌జెలెస్సో అనే ఐటి కంపెనీ ఇటీవల బుడాపెస్ట్ కేఫ్ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఏకంగా రోబోలనే వెయిటర్లుగా నియమించింది. 'అవును... కృత్రిమ మేధస్సుతో తయారుచేసిన ఈ రోబోలు ఇక్కడికొచ్చే ప్రతి వినియోగదారునీ తమ సేవలతో అలరిస్తున్నాయి' అంటున్నారు ఈ కేఫ్‌ను స్థాపించిన తిబోర్ సిజిమామియా. ఈ రోబోలు ఎక్కడా ఆలస్యం లేకుండా, అసౌకర్యం కలిగించకుండా వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న వీటిని చూసి వినియోగదారులు కూడా మురిసిపోతున్నారు. కస్టమర్లకు పూర్తిస్థాయిలో సేవలందించడమే లక్ష్యంగా తయారుచేసిన ఈ రోబోలు బాగానే పనిచేస్తున్నాయని యజమాని సిజిమామియా వివరించారు. వినియోగదారులతో సంభాషించడం, వారు కోరితే నృత్యం చేయడం... వంటి పనుల్లో రోబోలు బిజీ అయ్యాయని చెప్పారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ 16 నుంచి 20 రోబో వెయిటర్లను ఆపరేట్ చేసేందుకు ఐటి నిపుణుల అవసరం ఎక్కువగా ఉంటుందని, దీని కారణంగానే ఎక్కువగా వాటిని నియమించ లేకపోతున్నామని ఆయన అంటున్నారు. ఎంత గొప్ప రోబోలు అయినా, మళ్లీ వాటిని నడిపించేది మనిషేనన్న విషయం ఇక్కడ గమనించాలి.



★

# చుండ్రు శాశ్వతంగా పోవాలంటే?

చుండ్రు సమస్యతో సతమతం కానివారు దాదాపుగా ఎవరూ ఉండరు. తలలో చుండ్రు అధికంగా ఉండడం వల్ల దురద, ముఖం మీద మొటిమలూ వస్తుంటాయి. రసాయన షాంపూలతో పనిలేకుండా చుండ్రుని శాశ్వతంగా నివారించడానికి నిపుణుల సూచనలివి.



- గోరువెచ్చని నీటిలో కొన్ని వేపాకులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే వేపాకులను తీసేసి, ఆ నీటిని తలకు రాసుకోవాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది.
- యాపిల్ సిడర్ వెనిగర్‌లో కొంచెం నీరు చేర్చి, బాగా కలపాలి. షాంపూకి బదులుగా ఈ మిశ్రమాన్ని తలకు వాడాలి. దీనిలో ఉండే యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు తలలోని క్రిములను తొలగిస్తాయి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చుండ్రు మాయమై, దురద తగ్గుతుంది.
- గోరింటాకు పొడిలో చక్కెర, ఆలివ్ నూనె, నిమ్మరసం, కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు పూతగా పట్టించాలి. 45 నిమిషాల తరువాత తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే తలంతా శుభ్రంగా ఉంటుంది.
- వేడి నీటిలో గులాబీ ఆకులను బాగా మరిగించాలి. చల్లారాక ఆ నీటిని తలకు రాసుకోవాలి. గంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తే చుండ్రు తగ్గుతుంది.
- మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీరు వంటి పానీయాలను రోజుకు రెండుసార్లయినా తీసుకుంటే, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి.

★

సెన్సెక్స్ ↓ 1.25
35,591

నిఫ్టీ ↓ 0.40
10,651

రూపాయి ↓ 01 పై
అమెరికా డాలరుకు రూ.
71.11

ఫిక్కీ కార్యవర్గం భేటీ..

ఫిక్కీ జాతీయ కార్యవర్గం బుధవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యింది. ఈ సమావేశానికి ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమాని, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ వైవి రెడ్డి, ఫిక్కీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీతా రెడ్డి, సెక్రటరీ జనరల్ దిలీప్ చినాయ్, తెలంగాణ కో చైర్ మురళీధరన్, తెలంగాణ ఐటి శాఖ మంత్రి జయేష్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సవాళ్లపై వారు చర్చించారు.




## బంగారం @ రూ.34వేలు



**న్యూఢిల్లీ :** బంగారం ధర పరుగులు పెడుతోంది. సామాన్యులకు అందుబాటులో లేకుండా 10 గ్రాముల ధర ఏకంగా రూ.34వేలకు చేరింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు వచ్చే పెళ్లిళ్ల సీజన్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా అభరణాల వర్తకులు, రిటైలర్లు అపరంజి కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పసిడితో పాటు వెండి ధరలు కూడా పెరుగుతున్నాయి. బుధవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.320 ప్రియమై వరుసగా రూ.34,070, రూ.33,920కి ఎగిసింది. గ్లోబల్‌గా న్యూయార్క్ మార్కెట్‌లో ఒక ఐన్స్ పసిడి ధర 1,314.76 డాలర్లకు చేరింది. వెండి ధర 15.96 డాలర్లుగా నమోదయ్యింది. దేశీయంగా కిలో వెండిపై రూ.330 పెరిగి రూ.41,330కి చేరింది. అమెరికా-చైనా మధ్య పెరుగుతున్న వాణిజ్య ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి పెట్టుబడులకు డిమాండ్‌ను పెంచుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. తాజాగా చైనాకు చెందిన టెలికం కంపెనీ హువాయిపై సమాచార శౌర్యం పేరిటా అమెరికా కేసులు బనాయించడంతో ఇరు దేశాల మధ్య మరింత ఉద్రిక్తత పెరిగిందని భావిస్తున్నారు.

## ఐసిఐసిఐ బ్యాంకుకు కేటాయింపుల భారం

**ముంబయి :** దేశంలోని అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసిఐసిఐ బ్యాంకు మొండి బాకీల కోసం కేటాయింపులు పెంచడంతో లాభదాయకతపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.1,604.91 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,650.24 కోట్ల లాభాలు సాధించింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో మొండి బాకీల కోసం కేటాయింపుల భారం 18.89 శాతం పెరిగి రూ.4,244.15 కోట్ల ఎగిశాయి. 2017-18 ఇదే త్రైమాసికంలో రూ.3,569.56 కోట్ల కేటాయింపులు చేసింది. ఇదే సమయంలో 7.82 శాతంగా ఉన్న బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు.. క్రితం క్యూ3లో 7.75 శాతానికి తగ్గాయి.

## ఎన్‌టిపిసి లాభాలు రూ.2,385 కోట్లు

**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసి 2018 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.2,385.41 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,360.81 కోట్ల లాభాలు ఆర్జించింది. 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఈ ప్రభుత్వ రంగ సంస్థ మొత్తం ఆదాయం 15.27 శాతం పెరిగి రూ.24,038.01 కోట్లకు చేరింది. ఇంతక్రితం 2017-18 ఇదే క్యూ3లో రూ.21,087.84 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. 2018 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో ఎన్‌టిపిసి నికర లాభాలు రూ.7,399.57 కోట్లకు తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.7,417.58 కోట్ల లాభాలు సాధించింది.

## తగ్గిన ఐఒసి లాభాలు..




**ముంబయి :** ప్రభుత్వ రంగంలోని చమురు కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) లాభాల్లో 78 శాతం పతనాన్ని చవి చూసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడంతో 2018 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో లాభాలు రూ.716 కోట్లకు తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3,247 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.1.5 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రూ.1.6 లక్షల కోట్లకు చేరింది. 2018 ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో బ్యారెల్‌పై స్థూల రిఫైనింగ్ మార్జిన్ (జిఆర్‌ఎం) 5.83 డాలర్లుగా నమోదయ్యింది.

# ఇక సెబీనే టార్గెట్..!

- అధికారాలకు కోత
- ప్రభుత్వ వ్యూహం
- కమిటీ పేరుతో గుప్పిట్లోకి..
- ఆర్‌బిఐ తరహాలో ప్లాన్

**ముంబయి :** దేశంలోని స్వతంత్ర సంస్థలను ఒక్కో దాన్ని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం తాజాగా సెబీపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ రెగ్యులేటరీ అధికారాలను గుప్పిట్లోకి తీసుకోవడానికి కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని మింట్ ఓ కథనం వెలువరించింది. ఇప్పటికే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ)ను ప్రభావితం చేసిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో సెబీని కూడా తయారు చేయాలని చూస్తోంది. గత 25 సంవత్సరాలుగా సెబీ బోర్డు సొంతగా నిబంధనలు రూపొందించుకోవడం ద్వారా స్టాక్ మార్కెట్లను, విత్త సంస్థలకు మార్గనిర్దేశకాలు చేస్తుంది. ఏవైనా సంస్థలు ఆర్థికపరమైన తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటుంది. సెబీ కొన్నేళ్లుగా అమల్లోకి తెచ్చిన నియమ నిబంధనల్లో ఒక్క దానిని కూడా పార్లమెంట్ మార్చలేదంటే ఆ సంస్థ ఎంత పటిష్టంగా పని చేస్తోందో స్పష్టం అవుతోంది.



తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న వ్యూహం వల్ల సెబీ ఏవైనా నిర్ణయాలు తీసుకొనే ముందు ఆ ప్రతిపాదనలను ఒక స్వతంత్ర కమిటీకి నివేదించాల్సి ఉంటుంది. ఈ కమిటీలో సభ్యులుగా బోర్డు డైరెక్టర్లు ఉంటారా లేదా బయట వ్యక్తులు ఉంటారా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. ఒక వేళ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ఈ కమిటీ సభ్యులను నియమిస్తే ప్రభుత్వానికి సెబీపై మరింత పట్టు లభించనుంది. ఇప్పటికే సెబీ నిబంధనలను ఆమోదించే ముందు ఆ ప్రతిపాదనలను ఒక కమిటీ ఎదుట ఉంచాలని ఆర్థిక వ్యవహారాల విభాగం సూచించినట్లు తెలుస్తోంది. దీనికి భవిష్యత్తులో సెబీ చట్టానికి సవరణ కూడా చేయనున్నారని సమాచారం.

గతేడాది అక్టోబర్ నెలలో ఆర్‌బిఐ స్వతంత్రతను దెబ్బతీయడానికి కేంద్రం సెక్షన్ 7ను ప్రయోగించడానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఆర్‌బిఐ వద్ద ఉన్న దాదాపు రూ.9.6 లక్షల కోట్ల రిజర్వు నిధుల్లో మూడో వంతు కేంద్రానికి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చింది. ఈ అంశాలపై విభేదించిన అప్పటి గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా చేశారని రిపోర్టులు వచ్చాయి. ఉర్జిత్ రాజీనామాతో ప్రధానీ మోడీకి అత్యంత అనుకూలమైన శక్తికాంత దాస్‌ను ఆర్‌బిఐ గవర్నర్‌గా చేశారు. అదే విధంగా మిగులు నిధుల అందజేతపై ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇదే తరహాలో సెబీలో కూడా మార్పులు జరుగొచ్చనే రిపోర్టులు జోరందుకున్నాయి. ఈ వార్తలపై సెబీ స్పందించలేదు. ప్రస్తుతం సెబీలో ఎనిమిది మంది బోర్డు సభ్యులున్నారు. వీరు స్వతంత్రంగానే నిబంధనలు రూపొందిస్తున్నారు. సెబీ నిబంధనల రూపకల్పనలో ఆర్థిక మంత్రిత్వ శాఖకు అధికారం ఉన్నప్పటికీ.. బోర్డు ఆమోదం తప్పనిసరి అని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## హెరిటేజ్ ఫుడ్స్ ఫలితాలు ఆకర్షణీయం..

**ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో**

హెరిటేజ్ ఫుడ్స్ 2018-19 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 20 శాతం వృద్ధితో రూ.20.10 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.16.76 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ మొత్తం రెవెన్యూ 6.9 శాతం పెరిగి రూ.618.76 కోట్లకు చేరింది. 2018 ఇదే డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.578.93 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. 2018-19 తొలి తొమ్మిది మాసాల్లో తమ నిర్వహణ మార్జిన్లలో మెరుగుదల ఉందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మాని నారా పేర్కొన్నారు. తమ ఉత్పత్తులకు మరింత డిమాండ్ పెరుగుతుందన్నారు. క్రితం డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల కాలంలో సంస్థ నికర లాభాలు 45.6 శాతం పెరిగి రూ.62.43 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.42.88 కోట్ల లాభాలు ఆర్జించింది.

## బజాజ్ ఆటోకు అమ్మకాల దన్ను

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో లిమిటెడ్ అధిక లాభాలను సాధించింది. 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 15.60 శాతం వృద్ధితో రూ.1,101.88 కోట్ల నికర లాభాలు ఆర్జించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.952.44 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ వాహన అమ్మకాలు ఏకంగా 25.79 శాతం పెరిగి 12,59,828 యూనిట్లుగా నమోదయ్యాయి. అయినా బుధవారం సెషన్‌లో ఈ కంపెనీ షేర్లు అమ్మకాలను ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బిఎస్‌ఇలో 2.65 శాతం తగ్గి రూ.2498.85కు పడిపోయింది.

## డిహెచ్‌ఎఫ్‌ఎల్ మదుపరి విలవిల

### రెండో రోజూ షేర్ పతనం

**ముంబయి :** దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డిహెచ్‌ఎఫ్‌ఎల్) రూ.31,000 కోట్ల ప్రజల నిధుల మళ్లింపు కుంభకోణానికి పాల్పడిందన్న ఆరోపణలతో ఆ కంపెనీ షేర్ రెండో రోజూ భారీగా పడిపోయింది. బుధవారం సెషన్‌లో ఈ సూచీ రూ.154కు పడిపోయి 35 నెలల కనిష్ట స్థాయిని తాకింది. ఈ ఒక్క సెషన్ ప్రారంభంలోనే 10 శాతం విలువ కోల్పోయింది. తుదకు 4.97 శాతం నష్టంతో రూ.161.60 వద్ద ముగిసింది. ఇంతక్రితం సెషన్‌లో కూడా ఓ దశలో 11 శాతం నష్టపోయిన సూచీ తుదకు 8 శాతం పతనం చవి చూసింది. ఈ రెండు రోజుల్లో నికరంగా 13 శాతం మేర షేర్ పడిపోవడంతో మదుపరి ఆ మొత్తాన్ని నష్టపోవడంతో విలవిలమన్నారు.

## బ్యాంకింగ్ స్టాక్స్ పరుగు

**ముంబయి :** వరుసగా నాలుగో సెషన్‌లోనూ దేశీయ స్టాక్ మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బుధవారం సెషన్‌లో ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్, రియాల్టీ షేర్లు అమ్మకాలకు గురైయ్యాయి. కాగా బ్యాంకింగ్, లోహ, పిఎస్‌యు, ఎఫ్‌ఎంసిజి స్టాక్స్ 0.40 శాతం నుంచి 1.40 శాతం వరకు పెరిగి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. అయినా తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 1.25 పాయింట్లు తగ్గి 35,591.25 వద్ద ముగిసింది. రోజంతా 35,850-35,490 మధ్య ఊగిసలాడింది. నిఫ్టీ 0.40 పాయింట్లు తగ్గి 10,651.25 వద్ద ముగిసింది. ఐసిఐసిఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ షేర్లు 2.45 శాతం నుంచి 5.29 శాతం వరకు పెరిగాయి.

జీకే



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

# అత్యధికంగా పద్మ పురస్కారాలు దక్కిన రాష్ట్రం?

## మన్మోహన్‌కు పీవీ స్మారక అవార్డు

దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు దిశ, దశ మార్చిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. చెన్నయ్‌కి చెందిన ఇండియా నెక్ట్స్ అనే స్వచ్ఛంద సంస్థ తొలిసారిగా పీవీ నర్సింహారావు మెమోరియల్ నేషనల్ లీడర్‌షిప్ అండ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. దీనికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్‌తో కలిసి జయప్రకాశ్ నారాయణ ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం ఇండియా నెక్ట్స్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 28న ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు రామచంద్రమూర్తి తెలిపారు.



## ప్రణబ్‌ముఖర్జీ, నానాజీ, హజారికాలకు భారతరత్న

కేంద్ర ప్రభుత్వం 2019 జనవరి 25న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జనసంఘ నేత నానాజీ దేశ్‌ముఖ్, గాయకుడు భూపేన్ హజారికాలకు భారతరత్న పురస్కారాలను ప్రకటించింది.

నానాజీ, హజారికా పేర్లను మరణానంతరం పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రభుత్వ అధికారిక ప్రకటన పేర్కొంది. నాలుగేళ్ల విరామం అనంతరం భారతరత్న పురస్కారాలను ప్రకటించారు. చివరిసారిగా 2015లో మోడీ ప్రభుత్వం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు మదన్‌మోహన్ మాలవీయకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇప్పటిదాకా భారతరత్న పొందిన వారి సంఖ్య 48కి చేరింది. 2019 గణతంత్ర దినోత్సవం సందర్భంగా 11 మంది విదేశీయులు సహా 112 మంది ప్రముఖులకు పద్మ పురస్కారాల్ని ప్రకటించింది. ఇందులో నలుగురిని పద్మవిభూషణ్, 14 మందిని పద్మభూషణ్, 94 మందిని పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది.

### పద్మవిభూషణ్

1. తీజన్ బాయ్ - జానపద సంగీతం - ఛత్తీస్‌గఢ్
2. ఇస్మాయిల్ గుల్లేహ్ -ప్రజాసంబంధాలు -డీజిబౌటీ
3. అనీల్‌కుమార్ నాయక్ -వాణిజ్యం, పరిశ్రమలు -మహారాష్ట్ర
4. బల్వంత్ మోరేశ్వర్ పురందరే-రంగస్థల కళాకారుడు -మహారాష్ట్ర

### 'పద్మ భూషణ్' పురస్కార గ్రహీతలు

1. జాన్ చాంబర్స్ - అమెరికా వ్యాపారవేత్త
2. సుఖ్‌దేవ్ సింగ్ ధిండా - రాజకీయ వ్యవహారాలు - పంజాబ్
3. ప్రవీణ్ గోవర్ధన్ ప్రజాసంబంధాలు - దక్షిణాఫ్రికా మంత్రి
4. మహాశయ్ ధరమ్ పాల్ గులాటీ -వాణిజ్యం, పరిశ్రమలు -ఢిల్లీ
5. దర్శన్‌లాల్ జైన్ -సామాజిక సేవ -హరియాణా
6. అశోక్ లక్ష్మణ్‌రావు కుకడే -వైద్య సేవ -మహారాష్ట్ర
7. కరియా ముండా -రాజకీయ వ్యవహారాలు -జార్ఖండ్
8. బుధాదిత్య ముఖర్జీ -సితార్ కళాకారుడు -పశ్చిమ బంగా
9. మోహన్‌లాల్ -సినీనటుడు-కేరళ
10. నంబి నారాయణ్ -ఇస్రో శాస్త్రవేత్త-కేరళ
11. కుల్దీప్ నయ్యర్ (మరణానంతరం)-జర్నలిజం-ఢిల్లీ
12. బచేంద్రి పాల్-పర్వాతారోహకురాలు -ఉత్తరాఖండ్
13. వీకే షుంగ్లూ-మాజీ కాగ్ (సివిల్ సర్వీస్) -ఢిల్లీ
14. హుకుందేవ్ యాదవ్ (ఎంపీ) -రాజకీయ వ్యవహారాలు -బీహార్

మనోజ్ బాజ్‌పేయి, ప్రభుదేవా, శంకర్ మహదేవన్, శంతను నారాయణ్ (అడోబ్ సంస్థ సీఈవో), భజరంగ్ పూనియా, శివమణి తదితరులకు పద్మశ్రీ ప్రకటించారు.

### పద్మశ్రీ అవార్డులు

- రామ్ శరణ్ వర్మ (యూపీ)- వ్యవసాయం
- స్వామి విషధనానంద (కేరళ)- ఆధ్యాత్మికం
- హీరాలాల్ యాదవ్ (యూపీ)- జానపదం
- యడ్లపల్లి వెంకటేశ్వరరావు (ఆంధ్రప్రదేశ్)- వ్యవసాయం
- బాబులాల్ దహియా (మధ్యప్రదేశ్)- వ్యవసాయం
- తంగ డార్లింగ్ (త్రిపుర)- సంగీతం- వేణువు
- ప్రభుదేవా (కర్ణాటక)- నృత్యం
- రాజ్ కుమారి దేవి (బీహార్)- వ్యవసాయం
- భాగీరథీ దేవి (బీహార్)- ప్రజా వ్యవహారాలు
- బాల్దీప్ సింగ్ (పంజాబ్)- వ్యవసాయ ఇంజినీరింగ్
- హారిక ద్రోణవల్లి (ఆంధ్రప్రదేశ్)- క్రీడలు (చెస్)
- గోదావరి దత్తా (బీహార్)- పెయింటింగ్
- గౌతమ్ గంభీర్ (ఢిల్లీ)- క్రీడలు (క్రికెట్)
- ద్రౌపది మిమిరే (సిక్కిం)- సమాజ సేవ
- రోహిణి గాడ్బోలే (కర్ణాటక)- అణుశాస్త్రం
- సందీప్ గులేరియా (ఢిల్లీ)- వైద్యం
- ప్రతాప్‌సింగ్ హర్దియా (మధ్యప్రదేశ్)- కంటి వైద్యం
- బులు ఇమామ్ (జార్ఖండ్)- సమాజసేవ
- ఫ్రెడ్రిక్ ఇరినా (జర్మనీ)- జంతురక్షణ
- రాజేశ్వర్ ఆచార్య (యూపీ)- హిందుస్థానీ సంగీతం
- బంగారు అడిగలార్ (తమిళనాడు) - ఆధ్యాత్మికం
- ఇలియాస్ అలీ (అస్సోం)- వైద్యం
- మనోజ్ బాజ్‌పేయ్ (మహారాష్ట్ర)- నటన
- ఉద్దవ్ కుమార్ భరాలి (అస్సోం) - ఇంజినీరింగ్
- ఒమేష్ కుమార్ భారతి (హిమాచల్ ప్రదేశ్) - వైద్యం
- ప్రీతమ్ భరత్వాన్ (ఉత్తరాఖండ్)- జానపదం
- జ్యోతి భట్ (గుజరాత్)- పెయింటింగ్
- దిలీప్ చక్రవర్తి (ఢిల్లీ)- పురాతత్వ శాస్త్రం
- మమ్మన్ చాందీ (ప.బంగా)- వైద్యం
- స్వపన్ చౌదరి (ప.బంగా)- సంగీతం
- కన్వాల్‌సింగ్ చౌహాన్ (హర్యానా)- వ్యవసాయం
- సునీల్ ఛెత్రి (తెలంగాణ)- ఫుట్‌బాల్
- దిన్యర్ కాంట్రాక్టర్ (మహారాష్ట్ర)- నాటకం
- ముక్తాబెన్ పంకజ్ కుమార్ (గుజరాత్)- సంఘసేవ
- జోరావరిసింగ్ జాదవ్ (గుజరాత్)- నాట్యం
- జయశంకర్ (ఢిల్లీ)- ప్రజాసేవ
- నర్సింగ్ దేవ్ జమ్వాల్ (కాశ్మీర్)- సాహిత్యం
- ఫయాజ్ అహ్మద్ (కాశ్మీర్)- లలిత కళలు
- జయన్ (కేరళ)- సంగీతం
- సుభాష్ కక్ (అమెరికా)- సాంకేతికత
- శరత్ కమల్ (తమిళనాడు)- టేబుల్ టెన్నిస్
- రజనీ కాంత్ (యూపీ)- సమాజ సేవ
- సుదమ్ కటే (మహారాష్ట్ర)- వైద్యం
- వామన్ కేంద్ర (మహారాష్ట్ర)- నాటకం
- కాదర్ ఖాన్ (కెనడా)- నటన (మరణానంతర పురస్కారం)
- అబ్దుల్ గఫూర్ ఖత్రి (గుజరాత్)- పెయింటింగ్
- రవీంద్ర కోల్హ్ అండ్ స్మితా కోతే (మహారాష్ట్ర)- వైద్యం
- బొంబయిలా దేవి లైశ్రాం (మణిపూర్)- క్రీడలు
- కైలాష్ మదబైయా (మధ్యప్రదేశ్)- సాహిత్యం
- రమేష్ బాబాజీ మహారాజ్ (యూపీ)- జంతు రక్షణ
- వల్లభభాయ్ వసమ్ రాయ్ (గుజరాత్)- వ్యవసాయం
- గీతా మెహతా (అమెరికా)- సాహిత్యం
- షాదాబ్ మహమ్మద్ (యూపీ)- వైద్యం
- కే.కే. మహమ్మద్ (కేరళ)- పురాతత్వ శాస్త్రం
- శ్యాంప్రసాద్ ముఖర్జీ (జార్ఖండ్)- వైద్యం
- దైతరీ నాయక్ (ఒడిశా)- సమాజ సేవ
- శంకర్ మహదేవన్ (మహారాష్ట్ర)- సినిమా
- శంతాను నారాయణ్ (అమెరికా)- వ్యాపారం
- నర్తకి నటరాజ్ (తమిళనాడు)- భరతనాట్యం
- సెరింగ్ నొర్బో (కాశ్మీర్)- వైద్యం
- అనూప్ రంజన్ పాండే (ఛత్తీస్‌ఘఢ్)- సంగీతం
- జగదీష్ ప్రసాద్ పరిఖ్ (రాజస్థాన్)- వ్యవసాయం
- గణపతిభాయ్ పటేల్ (అమెరికా) - సాహిత్యం
- విమల్ పటేల్ (గుజరాత్)- వ్యవసాయం
- హనీఫ్ ఖాన్‌శాస్త్రి (ఢిల్లీ)- సాహిత్యం
- బ్రిజేష్‌కుమార్ శుక్లా (యూపీ)- సాహిత్యం
- నరేంద్రసింగ్ (హర్యానా)- జంతు పెంపకం
- ప్రశాంత్‌సింగ్ (యూపీ)- బాస్కెట్ బాల్
- సుల్తాన్ సింగ్ (హర్యానా)- జంతు పెంపకం
- జ్యోతికుమార్ సిన్హా (బిహార్)- సమాజసేవ
- ఆనందన్ శివమణి (తమిళనాడు)- సంగీతం
- శారద శ్రీనివాసన్ (కర్ణాటక)- పురాతత్వ శాస్త్రం
- దేవేంద్ర స్వరూప్ (యూపీ)- జర్నలిజం (మరణానంతరం)
- అజయ్‌ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్)- కబడ్డీ
- రాజీవ్ తారనాథ్ (కర్ణాటక)- సంగీతం
- సాలుమరద తిమ్మక్క (కర్ణాటక)- సమాజ సేవ
- జమున తుడు (జార్ఖండ్)- సమాజ సేవ
- భారత్ భూషణ్ త్యాగి (యూపీ)- వ్యవసాయం
- రామస్వామి వెంకటస్వామి (తమిళనాడు)- వైద్యం
- హుకుంచంద్ పాటిదార్ (రాజస్థాన్)- వ్యవసాయం
- హర్వీందర్ సింగ్ ఫూల్కా (పంజాబ్)- ప్రజా వ్యవహారాలు
- మదురై చిన్నా పిళ్ళై (తమిళనాడు)- సమాజసేవ
- తావో పోర్ఫోన్ లించ్ (అమెరికా)- యోగా
- కమలా పుజారి (ఒడిశా)- వ్యవసాయం
- భజరంగ్ పునియా (హర్యానా)- రెజ్లింగ్
- జగత్ రామ్ (ఛండీగఢ్)- కంటివైద్యం
- రమణి (తమిళనాడు)- వైద్యం
- దేవరాపల్లి ప్రకాశ్‌రావు (ఒడిశా)- విద్య
- అనూప్ సాహ్ (ఉత్తరాఖండ్)- ఫొటోగ్రఫీ
- మిలేనా సాల్విని (ఫ్రాన్స్)- కథకళి
- నాగిన్దాస్ సంఘవి (మహారాష్ట్ర)- జర్నలిజం
- సిరివెన్నెల సీతారామ శాస్త్రి (తెలంగాణ)- రచన
- షబ్బీర్ సయ్యద్ (మహారాష్ట్ర)- జంతురక్షణ
- మహేష్ శర్మ (మధ్యప్రదేశ్)- గిరిజన సంక్షేమం

**ఎవరికెన్ని.. :** 112 పద్మ పురస్కారాల్లో అత్యధికంగా మహారాష్ట్రకు 12 దక్కాయి. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌కు 10, ఢిల్లీకి 8, తమిళనాడుకు 7, గుజరాత్‌కు 6, మధ్యప్రదేశ్‌కు 4, కేరళ, కర్ణాటక, బీహార్, హరియాణాలకు 5 చొప్పున, జార్ఖండ్‌కు 4, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్, పశ్చిమబంగా, జమ్మూకాశ్మీర్‌లకు 3 చొప్పున, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు 2 చొప్పున, మణిపూర్, సిక్కిం, త్రిపురలకు 1 చొప్పున లభించాయి. విదేశీయుల్లో అమెరికాకు 6, దక్షిణాఫ్రికాకు 1, జర్మనీకి 1, కెనడాకు 1, ఫ్రాన్స్‌కి 1 చొప్పున లభించాయి.

★

## క్రీడలు- ఐసీసీ అవార్డులు




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనకుగాను క్రికెటర్లకు అందించే అవార్డులను జనవరి 22న ప్రకటించింది.

- క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ (సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ): విరాట్ కోహ్లీ,
- టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : విరాట్ కోహ్లీ
- వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ విరాట్ కోహ్లీ
- ఈ అవార్డుల చరిత్రలోనే తొలిసారిగా ఒకే ఏడాదీ మూడు ప్రధాన వ్యక్తిగత అవార్డులను సొంతం చేసుకున్న తొలి ఆటగాడిగా కోహ్లీ రికార్డు సృష్టించాడు. అదేవిధంగా ఐసీసీ టెస్టు, వన్డే జట్లకు . కెప్టెన్‌గానూ కోహ్లీ ఎంపికయ్యాడు.
- ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : రిషభ్ పంత్
- అంపైర్ ఆఫ్ ది ఇయర్: కుమార ధర్మసేన (శ్రీలంక)
- ఐసీసీ స్పిరిట్ ఆఫ్ క్రికెట్ అవార్డు: న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్
- ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ (రాచెల్ హీహోయ్ ఫ్లింట్ అవార్డు)
- వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ : స్మృతి మంధాన (భారత్)

### సిరీస్ విజేత భారత్

**భారత్** - ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మూడు వన్డే మ్యాచ్‌ల క్రికెట్ సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో గెలుచుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్ నెగ్గడం భారత్‌కి ఇదే తొలిసారి. ఎంఎస్ ధోనీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు.

### ఐసీసీ కొత్త సీఈవోగా మను సాహ్ని



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీఈవోగా మను సాహ్ని నియమితులయ్యారు. ఈ మేరకు ఐసీసీ జనవరి 17న ఐసీసీ ప్రకటించింది. డేవిడ్ రిచర్డ్సన్ స్థానంలో మను సీఈవోగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. వచ్చే మే-జూన్ నెలల్లో ఇంగ్లండ్‌లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌తో రిచర్డ్సన్ పదవీకాలం ముగియనుంది.

## ట్రాన్స్‌కో ఎస్‌ఇకి సమ్మె నోటీసు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో పని చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ట్రాన్స్‌కో ఎస్ఇ ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24న కార్మిక సంఘాలు సమావేశమై మీటర్ రీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్ సిఎండి అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 10వ తేదీ తరువాత ఏ రోజైనా నిరవధిక సమ్మెలోకి వెళతామని కార్మిక సంఘాలు తీర్మానించాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**ఆందోళన**

వేతన సవరణలో న్యాయం చేయాలని బిహెచ్‌పివి పరిరక్షణ ఫ్రంట్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖలో నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న జిటిపి.ప్రకాష్



## రూ.131 కోట్లు అవినీతి జరిగినా కేసులు పెట్టరా?

### రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు

### విద్యుత్ కండకర్ల కొనుగోలు వ్యవహారంపై ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థ స్వీడన్ నుంచి కండక్టర్ల కొనుగోలులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుందని విజిలెన్స్ నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. రూ.131 కోట్లు అవినీతి జరిగినట్లు తేలినా ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్‌ల ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రశ్నించింది. విజిలెన్స్ నివేదిక అందుకున్నా సంబంధిత బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదిక అందజేయాలని ఆదేశించింది. బెంగళూరులోని రేచమ్ ఆర్‌పీజీ ప్రై. వేట్ లిమిటెడ్ కంపెనీకి టెండర్ ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ హెచ్.జె.దొర నిబంధనలు తయారుచేయించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ క ష్ణా జిల్లా ఆళ్లపురం గ్రామస్తుడు ఎస్.శాంతి కిరణ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని డివిజన్ బెంచ్ బుధవారం మరోసారి విచారించింది. భారీ అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చే యకపోవడానికి కారణాలు, ఇంతవరకూ తీసుకున్న చర్యలను వివరించాలని బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా పడింది.

## పాలకుల యత్నాలను తిప్పికొట్టాలి

### సిపిఎం, సిపిఐ జనసేన నేతలు

ప్రజాశక్తి-కందుకూరు(ప్రకాశం)

నాలుగున్నర ఏళ్లుగా ప్రజాసమస్యలు పట్టని పాలకులు మరోసారి మోసం చేసేందుకు చేపడుతున్న యత్నాలను తిప్పికొట్టాలని సిపిఎం, సిపిఐ, జనసేన నేతలు పిలుపునిచ్చారు. బుధవారం కందుకూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, జనసేన నేతృత్వంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాళ్లపాడుకు సాగునీరు తెస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చని శాసన సభ్యులు పోతుల రామారావు అధికారం కోసం పార్టీ ఫిరాయించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాళ్లపాడు ఆయకట్టు రైతాంగం పరిస్థితి దుర్భరంగా ఉందని, తాగునీటి సమస్య మరింత జఠిలంగా మారిందని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిజె.చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు రామిశెట్టి వంశీకృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సిపిఎం జిల్లా కమిటీ నాయకులు జి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. సభలో కందుకూరు నియోజకవర్గ ప్రణాళికను నేతలు ఆవిష్కరించారు. ముందుగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటేశ్వర్లు, సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి పి.మాలకొండయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం సీనియర్ నాయకులు డాక్టర్ ముచ్వా కొండయ్య, ముప్పరాజు కోటయ్య పాల్గొన్నారు.

## అట్రాసిటీ, వెల్ఫేర్ కమిటీలో అవకాశం కల్పించండి

### సంచార జాతుల సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అట్రాసిటీ, వెల్ఫేర్ కమిటీల్లో సంచార జాతుల్లోని 10 కులాలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచార జాతుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి రవి, వై శ్రీనివాసులు బిసి సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. తమ కులా పేర్లు తిట్లు పేర్లతో పిలవడం అవమానకరంగా ఉందన్నారు. ఈ కులాలకు అట్రాసిటీ కేసులు వర్తించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరి నట్టు వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలకృష్ణ రేణకే కమిషన్ ఆధారంగా సంచార జాతులకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్నట్టుగా 50 శాతం సబ్సిడీ రుణాలివ్వాలన్నారు. ప్రత్యేక హౌసింగ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భూమి లేని ప్రతి నిరుపేదకు 3 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజ్ఞ జవాబులు**

1.దుబాయ్
2.అంబటి రాయుడు
3.సుమన్ కుమారి
4.వ్లాదిమిర్ క్రామ్నిక్
5.నయోమి ఒసాకా, జకోవిచ్

# ఆలూరులో కరువు కేక

- పాల్గొన్న గఫూర్, రామచంద్రయ్య, హర్షద్
- హామీల అమలులో టిడిపి విఫలం

ప్రజాశక్తి - ఆలూరు రూరల్(కర్నూలు)

రాయలసీమలో ప్రత్యేకించి కర్నూలు జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆలూరులో బుధవారం సిపిఎం, సిపిఐ, జనసేన 'కరువు కేక'ను నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. సాయిబాబా దేవాలయం నుంచి చెక్‌పోస్టు, మెయిన్ బజార్ నుంచి స్థానిక పాతబస్టాండు వరకూ భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు హనుమంతు, సిపిఐ మండల కార్యదర్శి భూపేష్ అధ్యక్షతన జరిగిన సభల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం ఎ గఫూర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఆలూరు నియోజకవర్గంలోని అరికెర, కురవల్లి గ్రామాల సభల్లో పాల్గొని నగరడోణ, వేదవతి రిజర్వాయర్లు నిర్మించి హంద్రీనీవా నుంచి నియోజకవర్గంలోని చెరువులను నింపుతామని, జింకల పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

ఇంతవరకూ హామీలు నెరవేరలేదన్నారు. వేదవతి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామని నాలుగున్నరేళ్లుగా నాయకులు చెబుతున్నారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిఓ జారీ చేస్తున్నట్లు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కరువు సహాయక చర్యలు చేపట్టడంలో ఏ మాత్రమూ చొరవ చూపలేదని ఎద్దేవా చేశారు. సిపిఐ నాయకులు రామచంద్రయ్య మాట్లాడుతూ హోదా కోసం పోరాడిన వామపక్ష, యువజన సంఘాల నాయకులపై చంద్రబాబు కేసులు బనాయించారని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు ప్రాంతాల్లో ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపిలను ఓడించి సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలను గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు నబీ రసూల్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, రాధాకృష్ణ, జనసేన జిల్లా నాయకులు హర్షద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.



కర్నూలు జిల్లా ఆలూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు

## ఆర్టీసీ కార్మికుల 'చలో ఆర్ఎం ఆఫీసు'

- సమ్మెకు సన్నద్ధం
- జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన




విజయవాడలో నినాదాలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ప్రజాశక్తి యంత్రాంగం

ఆర్టీసీ పరిరక్షణ, మెరుగైన వేతనాల సవరణ కోసం వచ్చే నెల 6 నుంచి తలపెట్టిన సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మిక వర్గం సన్నద్ధమవ్వాలని ఆర్టీసీ జెఎసి పిలుపునిచ్చింది. ఆర్‌టిసి యూనియన్లు ఎస్‌డబ్ల్యుఎఫ్, కార్మిక పరిషత్, వైఎస్ఆర్ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్, డబ్ల్యుయు, బిడబ్ల్యు, కార్మిక సంఘం, యుడబ్ల్యుయు తదితర యూనియన్లు బుధవారం ఆయా ఆర్ఎం కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించాయి. . సమ్మె సన్నాహకంలో భాగంగా విజయవాడ పాత బస్టాండ్ సెంటర్ నుంచి బుధవారం చేపట్టిన చలో ఆర్ఎం ఆఫీసు కార్యక్రమాన్ని ఆర్టీసీ కార్మికులు విజయవంతం చేశారు. కృష్ణాజిల్లాలోని 14 డిపోల పరిధిలోని వందలాది మంది కార్మికులు పాతబస్టాండ్‌కు చేరుకొని అక్కడి నుంచి ర్యాలీగా పిఎన్ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మెరుగైన వేతనాల సవరణ చేయాలని, ఆర్టీసి సంస్థను పరిరక్షించాలని, ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రభుత్వ, యాజమాన్య మొండివైఖరి నశించాలని కోరుతూ కార్మికులు నినాదాలు చేశారు. బస్‌స్టేషన్ ముఖద్వారం వద్ద జరిగిన కార్యక్రమాన్నుద్దేశించి జెఎసి నాయకులు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.జిలానీ బాష మాట్లాడారు. ఆర్టీసి పరిరక్షణకు, వేతనాల సవరణ కోసం వచ్చే నెల 6వ తేదీ నుంచి జరపతలపెట్టిన సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని కార్మికుల శక్తి ఏమిటో ప్రభుత్వానికి, యాజమాన్యానికి తెలియజేయాలన్నారు. జెఎసి నాయకులు, అధికార గుర్తింపు సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వై.వి.రావు మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం మొండివైఖరి కారణంగానే కార్మికులు సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. తక్షణం కార్మికుల న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుంటూరు బస్టాండ్‌లో భారీ ర్యాలీ చేశారు. జెఎసి నాయకులు అయ్యపరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ రూట్లల్లో ప్రయివేటు వాహనాలకు ప్రభుత్వం అనుమతులివ్వడం వల్ల ఆర్టీసీ ఏటా రూ.3 వేల కోట్ల నష్టానికి గురవుతోందని చెప్పారు. అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవి.రావు మాట్లాడారు. నెల్లూరు ఆర్ఎంఒ కార్యాలయం ఎదుట జెఎసి ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు, ఎంప్లాయిస్ యూనియన్ ఛీఫ్ అడ్వయిజర్ పి.సుబ్రమణ్యం రాజు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రమణ్యం, నాయకులు ఎం. హరిబాబు, కార్మిక పరిషత్ రాష్ట్ర నాయకులు వై.రాము, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎన్. రాజశేఖర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, కార్మిక పరిషత్ ఆధ్వర్యాన విశాఖ ద్వారకానగర్‌లోని ఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కర్నూలు ఆర్ఎం కార్యాలయం ముందు ఆర్‌టిసి కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ఆర్‌టిసి కార్మికులు హక్కులు సాధించుకునేందుకు సమ్మెకు సిద్ధం కావాలని జెఎసి నాయకులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.నాగేశ్వర్‌రావు, కార్మిక పరిషత్ నాయకులు డిఆర్ బాబు, వైసిపి యూనియన్ నాయకులు శివశంకర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు.

## వాగ్గేయకారుల భక్తి సంగీత సంకీర్తనలు

**సత్యనారాయణపురం (విజయవాడ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంలో అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం, పూర్ణానందంపేటలోని శ్రీకోదండరామ శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాగ్గేయకారుల భక్తి సంగీత సంకీర్తనలు, ప్రస్తుత రచయితల భక్తి గీతాల గాన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పూర్ణానందంపేట కోదండరామ, దాసాంజనేయ దేవస్థానంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తలను సంగీతంతో పాటు తెలుగు భాష ఔనత్యాన్ని చాటుతాయని చెప్పారు. సంకీర్తనా కళానిధి పప్పు సదాశివశాస్త్రి సంకీర్తనలు మధురంగా గానం చేశారు.

**రౌండ్‌టేబుల్**

# సామాజిక న్యాయానికి తూట్లు

- అలాంటి శక్తులను ఓడించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- దళిత ఎజెండాను విడుదల చేసిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

సామాజిక న్యాయం, రాజ్యాంగస్ఫూర్తికి తూట్లు పొడిచే శక్తులను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) సంయుక్తంగా 'సామాజిక న్యాయం - దళితుల సంక్షేమం - అభివృద్ధికై పోరాడదాం - పాలకులను నిలదీద్దాం' అనే అంశంపై బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో దళిత సోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులు ఉద్యోగాలు, భూ పంపకాల విషయంలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. దామాషా ప్రకారం కేటాయించాల్సిన నిధుల కంటే తక్కువ కేటాయింపులు చేస్తున్నారని వాటిని కూడా వినియోగించటంలేదన్నారు. అరకులో ముఖ్యమంత్రి దత్తత తీసుకున్న గ్రామంలో పర్యటించిన సందర్భంలో అక్కడి యువకులు ఉద్యోగాలు ఇప్పించాలని కోరారన్నారు. గోసంరక్షణ, అయోధ్య అంశాలను రాజకీయం కోసం వాడుకుటున్నారని విమర్శించారు. మనువాదాన్ని ముందుకు తీసుకువచ్చే శక్తులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఉండే దళితులు వారి అధిష్టానంపై ఒత్తిడి తెచ్చి హక్కుల సాధించుకోవాలని సూచించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత మ్యానిఫెస్టో విడుదల చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. మోడీ పాలనలో ప్రజాస్వామ్య విలువలు నాశనం అవుతున్నాయన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులకు నష్టపరిహారం సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం బాహాటంగా అగ్రకుల పెత్తందార్లకు మద్దతుస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో దళిత ఎజెండాకు అనుకూలంగా, దళితుల సమస్యలను పరిష్కరించే వారికి మద్దతుగా నిలవాలని, సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, వికలాంగుల సంఘం నాయకులు బందెల కిరణ్‌రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.వెంకటేశ్వర్లు, లోక్‌జనశక్తి పార్టీ నాయకులు చింతా వెంకటేశ్వర్లు, దళిత మహాసభ నాయకులు క్రిష్ట, డిహెచ్‌పిఎస్ నాయకులు బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు



ధర్నా చేస్తున్న డప్పు కళాకారులు

## డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

### సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతి కుమార్

ప్రజాశక్తి-విజయవాడ

డప్పు కళాకారులకు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరుతూ చుట్టుగుంట బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం దళిత డప్పు కళాకారులకు అక్టోబర్ 2018 నుండి పెన్షన్ ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిందని, నేటికీ ఆచరణలోకి రాలేదని తెలిపారు. పెన్షన్ కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అందరికీ డప్పు కళాకారుల ఐడీ నెంబర్‌తో సంబంధం లేకుండా ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ పశ్చిమ కష్ణా కార్యదర్శి జి.నటరాజ్ మాట్లాడుతూ.. సాంస్కతిక శాఖ వద్ద గుర్తింపు కార్డులు కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీరికి డప్పు పండుగ నిర్వహించి డప్పులు, గజ్జెలు, డ్రెస్సు, రూ.1000 రెమ్యూనరేషన్ ఇవ్వాలని జారీ చేసిన జీవోను అమలు చేయాలన్నారు. బస్ రైల్వేలలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని, డప్పు శిక్షణ కేంద్రం జిల్లాలో ఏర్పాటు చేసి ఈ కళను బతికించాలని పేర్కొన్నారు.

## జిఓ 132 రద్దుకు ఉపాధ్యాయుల ర్యాలీ

ప్రజాశక్తి-పెదబయలు (విశాఖపట్నం)

జిఓ 132ను రద్దు చేయాలని కోరుతూ విశాఖ జిల్లా పెదబయలులో గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం రూరల్ జిల్లా అధ్యక్షులు కోడా సింహాద్రి మాట్లాడుతూ, జిఓ 132తో మూడు నెలలుగా ఉపాధ్యాయులు వేతనాలను నోచుకోని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీపుజాతాలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### జీపుయాత్ర ప్రారంభోత్సవంలో వి.రాంభూపాల్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం(అనంతపురం)

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో బుధవారం జీపుజాతాను ప్రారంభించారు. శింగనమల నియోజకవర్గంలో వామపక్ష, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అనంతపురం సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శింగనమల నియోజకవర్గంలో రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో హెచ్ఎల్సీ కాలువలకు నీరు వదలకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 4వ తేదీన శింగనమల ఆర్టీసీ బస్టాండు వద్ద వామపక్ష, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు, రైతులు, అన్ని రంగాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



విశాఖలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న చిన్నారులు

## 'మా నాన్న జీతాలు పెంచరూ !

### 104 ఉద్యోగుల పిల్లల వినూత్న నిరసన

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా 104 చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. జిఓ 151 ప్రకారం జీతాలు చెల్లించాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు బుధవారం తమ చిన్నారులతో వినూత్నంగా నిరసన తెలిపారు. "సిఎం తాతగారూ 151 జీవో ప్రకారం మా నాన్న జీతాలు పెంచరూ" అంటూ పిల్లలు ప్లకార్డులు పట్టుకుని నిరసనలో పాల్గొన్నారు. శ్రీకాకుళంలోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా పొట్టి శ్రీరాములు కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. కర్నూలులోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం సమీపంలోని ధర్నా చౌక్‌లో చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు జమాల్‌బాష, సికిందర్ మాట్లాడారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. ఉద్యోగులు రోడ్డుపై వెళ్లే ప్రజలకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి వినూత్న నిరసన తెలిపారు. ఒంగోలులో సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన సుందరయ్య భవన్, కర్నూల్‌రోడ్డు, అద్దంకి బస్టాండ్, మస్తాన్‌దర్గా సెంటర్, ట్రంక్‌రోడ్డు, చర్చిసెంటర్ మీదగా కలెక్టరేట్ వరకూ సాగింది. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిఐటియు నగర నాయకులు సిహెచ్ అజయ్ కుమార్ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి బాలాజీచెరువు వరకూ ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎయు నాగేశ్వరరావు మాట్లాడారు. గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని 104 ఉద్యోగుల సమ్మెను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.



ఆందోళన చేస్తున్న సివిల్ సప్లయిస్ గోడౌన్ కార్మికులు

## విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమిస్తాం : సిఐటియు

ప్రజాశక్తి - యలమంచిలి

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని అడవిపాలెం సివిల్ సప్లయిస్ గొడౌన్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సిఐటియు డెల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజారామ్మోహన్‌రాయ్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. జట్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో గొడౌన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. 18 ఏళ్లుగా పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఏ విధంగా తొలగిస్తుందని ప్రశ్నించారు. హమాలీల సంఘం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు మాట్లాడారు. ఆందోళన వద్దకు చేరుకున్న తహశీల్దార్ వి.స్వామినాయుడు, పాలకొల్లు టౌన్, రూరల్ సిఐలు ఆది ప్రసాద్, ఎ.రఘు, యలమంచిలి ఎస్ఐ గంగాధర్‌రావులు, సిఐటియు సంఘం నాయకులతో మాట్లాడారు. పాలకొల్లు లేబర్ కమిషనర్, గొడౌన్ యాజమాన్యంతో చర్చలు జరిపే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. కార్మికులు చేపట్టిన ఆందోళనకు వైసిపి నియోజకవర్గ కన్వీనర్ గుణ్ణం నాగబాబు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యడ్ల తాతాజీ సంఘీభావం తెలిపారు. గొడౌన్ వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## దక్షిణాసియాకు 'అణు' ముప్పు

### అమెరికా ఇంటెలిజెన్స్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** భారత్‌-పాకిస్తాన్ దేశాలు నిర్వహిస్తున్న అణ్వస్త్ర పాటవ పెంపుదల కార్యక్రమాలతో దక్షిణాసియాలో భద్రతకు పెను ముప్పు వాటిల్లుతుందని అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ హెచ్చరించింది. 2019లో అంతర్జాతీయ భద్రతా పరిస్థితిపై తమ అంచనాలను కాంగ్రెస్ సభ్యులకు వివరించిన అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ డేనియల్ కోట్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. షార్ట్ రేంజ్ టాక్టికల్ ఆయుధాలు, సముద్ర ఆధారిత క్రూయిజ్ క్షిపణులు, గగనతల క్రూయిజ్ క్షిపణులు, లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్స్ వంటి కొత్త తరహా అణ్వస్త్ర తయారీలో పాక్ తన కార్యకలాపాలను కొనసాగిస్తుండగా భారత్ మాత్రం ఈ ఏడాది తాను దేశీయంగా అభివృద్ధి అణు జలాంతర్గామిని ప్రవేశపెట్టిందని తెలిపారు.

**సన్నద్ధం**



**సిపిఎం ఆధ్వర్యంలో కొల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో ఫిబ్రవరి 3న నిర్వహించిన పీపుల్స్ బ్రిగేడ్ (ప్రజా కవాతు)కు వామపక్ష కార్యకర్తలు, అభిమానులు సన్నద్ధమౌతున్నారు. ఇందు కోసం ప్రజలను సమాయత్తం చేస్తూ నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా సుందరబన్‌లోని సత్‌జెలియా నదిలో కనిపించిన దృశ్యాలివి.**

## రీసెర్చ్ స్కాలర్ల స్టైఫండ్ 20 శాతం పెంపు

### అసంతృప్తి వ్యక్తం చేసిన రీసెర్చ్ స్కాలర్లు

**న్యూఢిల్లీ :** జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పేరుతో రీసెర్చ్ స్కాలర్లకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను బుధవారం ప్రభుత్వం నామ మాత్రంగా పెంచింది. ప్రస్తుతమిస్తున్న స్కాలర్‌షిప్‌పై 20 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే ప్రస్తుతం రూ.25 వేలుగా ఉన్న స్కాలర్‌షిప్‌ను రూ.31 వేలకు పెంచినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ పెంపుదలపై రీసెర్చ్ స్కాలర్లు అసంతృప్తిగా ఉన్నారు. స్టైపండ్‌ల రూపంలో ఇస్తున్న స్కాలర్‌షిప్‌లను2014 నుండి పెంచలేదని, వాటిని తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న రీసెర్చ్ స్కాలర్లు కొన్ని నెలలుగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు.. ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖతో సహా పలు కార్యాలయాల ఎదుట రీసెర్చ్ స్కాలర్లు ధర్నా చేపట్టారు. తమ నిరసన ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. గత సంవత్సరాలతో సమాంతరంగా ఫెలోషిప్‌లు పెంచుతామని పలువురు నేతలు తమకు హామీ ఇచ్చారని తెలిపారు. కనీసం రూ.9 వేలు, లేదా 56 శాతం పెరుగుదల ఉండాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు పెంచినది తమకు ఆమోదయోగ్యం కాదని, తమ ఆందోళనలు కొనసాగిస్తామనిస్కాలర్ల ప్రతినిధి నిఖిల్ గుప్తా తెలిపారు.

## చందా కొచ్చర్ దోషే

- నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చిన శ్రీకృష్ణ కమిటీ
- విధుల నుంచి తొలగించినట్లు ఐసిఐసిఐ ప్రకటన
- బోనస్, ఇతర భత్యాలు తిరిగి ఇచ్చేయాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** వీడియోకాన్ సంస్థకు ఐసిఐసిఐ బ్యాంక్ భారీగా రుణాలను మంజూరు చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారన్న కేసులో ఆ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్ (56)కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని ఐసిఐసిఐ ఏర్పాటు చేసిన స్వతంత్ర విచారణ కమిటీ తేల్చింది. ఈ స్కామ్‌పై విచారణకు నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ స్వతంత్ర కమిటీ తన రిపోర్టును బుధవారం ఆ బ్యాంకుకు అందించింది. ఆరోపణల నేపథ్యంలో గత అక్టోబర్‌లో బోర్డు ఆదేశంతో సిఇఒ పదవికి రాజీనామా చేసిన చందాకొచ్చర్‌ను ఇప్పుడు పదవి నుంచి తొలగించినట్లుగా భావించాలని ఐసిఐసిఐ బుధవారం ప్రకటించింది. ఇదివరకు ఆమె అందుకున్న బోనస్, ఇతర భత్యాలు వెనక్కి ఇచ్చేయాలని కూడా ఆదేశించింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు శ్రీకృష్ణ కమిటీ చేసిన నిర్ధారణపై చందా కొచ్చర్ స్పందిస్తూ తాను ఒంటరిగా ఏ నిర్ణయమూ తీసుకోలేదనీ, బోర్డు మొత్తం సమిష్టిగానే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు.

ఐసిఐసిఐ బ్యాంక్ మంజూరు చేసిన రూ.3,250 కోట్ల రుణం వెనుక అప్పటి సిఇఒ చందాకొచ్చర్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను వెలికి తీసేందుకు గాను బ్యాంక్ బోర్డు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో ఒక విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని వివిధ కోణాల్లో విచారణ జరిపిన కమిటీ, ఫోరెన్సిక్ ఆడిట్ రూపంలో వాస్తవాలను వెలికి తీసింది. నియమావళిని ఉల్లంఘించి కొచ్చర్ స్వీయ ప్రయోజనం కలిగేలా వ్యవహరించినట్టు జస్టిస్ శ్రీకృష్ణ ప్యానెల్ తేల్చింది. ఈ మేరకు ఆమెను దోషిగా నిర్ధారిస్తూ బ్యాంకు బుధవారం అధికారికంగా ఒక ప్రకటనను విడుదల చేసింది. ఆమెకు సంబంధించి భవిష్యత్తులో చెల్లించాల్సిన సొమ్ములను, ప్రస్తుతం బకాయి ఉన్న చెల్లింపులు అన్నింటిని నిలిపివేస్తున్నట్టు తెలిపింది. క్విడ్‌ప్రోకో ఆరోపణలు నిజమని తేలిన నేపథ్యంలో దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## గిరిజన బాలికపై కాంగ్రెస్ నేత అత్యాచారం

**వయనాడ్ :** గిరిజన బాలికపై ఏడాది కాలంగా అత్యాచారం జరుపుతున్నాడన్న ఆరోపణలతో కేరళలోని వయనాడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు ఓం జార్జ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం, ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టాల కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ నేత ములపల్లి రామచంద్రన్ మాట్లాడుతూ జార్జ్‌పై విచారణ జరుగుతున్న కారణంగా ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు చెప్పారు. నిందితులకు తమ పార్టీ రక్షణ కల్పించదని తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి బ్లాక్, మండల్ అధ్యక్షుల నుండి నివేదిక కోరినట్లు వయనాడ్ కాంగ్రెస్ యూనిట్ ఇన్‌ఛార్జ్ బాలకృష్ణన్ చెప్పారు.లబాధితురాలి తల్లిదండ్రులు జార్జ్‌నివాసంలో పనిచే స్తుంటారు. కొన్ని సార్లు తల్లిదండ్రులతో కలిసి బాధితురాలు కూడా అక్కడకు వెళ్తుండేది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం జార్జ్ తన కుమార్తెను ఫోన్‌లో బెదిరించడాన్ని గమనించిన తల్లిదండ్రులు అనుమానించారు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసుకుందన్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కాగా తల్లి దండ్రులు మీడియాతో మాట్లాడుతూ, డబ్బులు తీసుకుని కేసు రద్దు చేసుకోవాలని నిందితుడు తమపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి నుండి జార్జ్ ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడుతున్నాడని, దీనిపై బాలిక ఫిర్యాదును ఇప్పటికే నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## నోట్ల రద్దుతో యువతకు ఇళ్ళు

### ప్రధాని మోడి



**న్యూఢిల్లీ :** తమ ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు చర్యతో దేశంలోని యువతకు ఇళ్ళు సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చాయని ప్రధాని మోడీ బుధవారం అన్నారు. సూరత్ విమానాశ్రయం టెర్మినల్ భవన విస్తరణ పనులకు బుధవారం మోడీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పెద్ద నోట్ల రద్దు కారణంగా కలిగిన ప్రయోజనమేమిటి? అని అందరూ నన్ను అడుగుతూ ఉంటారు. దేశ యువతను మీరు ఈ ప్రశ్న అడగాలి. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తరువాత వారు సరసమైన ధరలకు ఇళ్ళను కొనుక్కున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనాన్ని ఉపయోగించేవారు. కాని నోట్ల రద్దు వంటి నిర్ణయాలతో దానికి చెక్ పెట్టాం" అని తన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఆయన సమర్థించుకున్నారు.

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించనున్న రాష్ట్రపతి
- రేపు బడ్జెట్ పెట్టనున్న ఆర్థిక మంత్రి పియూష్ గోయల్
- సభా నిర్వహణకు సహకరించండి సుమిత్రా మహాజన్, స్పీకర్



**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమౌతున్నాయి. ఫిబ్రవరి 13 వరకు కొనసాగే ఈ సమావేశాలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సెంట్రల్ హాల్‌లో జరిగే ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించడంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమౌతాయి. దేశంలోని పరిస్థితులను, పాలనా వ్యవహారాలపై ఆయన ప్రసంగిస్తారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లడంతో ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన పియూష్ గోయల్ ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. సాధారణంగా ఎన్నికల ఏడాది మధ్యంతర బడ్జెట్ లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఎన్నికల అనంతరం కొలువుతీరే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఎన్నికలకు ముందు పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయానికి సంబంధించి అనుమతి అవసరం కావడంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. ప్రస్తుతం బిజెపి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికల ముందు ఇదే చివరి బడ్జెట్ అవుతుంది. ఇవే చివరి సమావేశాలు అవుతాయి. కాగా, 2014లో అప్పటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్నికల అనంతరం బిజెపి నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్థిక మంత్రిగా పగ్గాలు చేపట్టిన అరుణ్ జైట్లీ 2014 జూలైలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

**సభా నిర్వహణకు సహకరించాలి : సుమిత్రా మహాజన్, స్పీకర్**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్ని పార్టీల నేతలను కోరారు. బుధవారం నాడిక్కడ పార్లమెంట్ లైబ్రరీ భవనంలో సుమిత్రా మహాజన్ నేతృత్వంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభా నిర్వహణకు సహకరించాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు.

వివిధ పార్టీల నేతలు తమ అభిప్రాయాలను చెప్పారు. దేశంలో నెలకొన్న సమస్యలపై చర్చించాలని కోరారు. రాజ్యాంగ సంస్థలపై దాడిపై ఈ సమావేశాల్లో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సహాయ మంత్రులు విజయ్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, పి. వేణుగోపాల్(అన్నాడిఎంకె), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), భర్తృహరి మెహతాబ్ (బిజెడి), పి.కరుణాకరన్ (సిపిఎం), తోట నరసింహం (టిడిపి), జయప్రకాశ్ యాదవ్ (ఆర్జేడీ), సుప్రియా సూలే (ఎన్సీపి), ప్రేమ్ సింగ్(శిరోమణి అకాలీదళ్), కున్హాలీ కుట్టీ (ఐయుఎంఎల్), పాల్గొన్నారు.

**నేడు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యఅఖిల పక్ష సమావేశం**

ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు నేడు అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నేతలను కోరనున్నారు. అంతేకాకుండా ఆయా పార్టీల అభిప్రాయాలు తీసుకోనున్నారు.

**పార్లమెంట్ ముందుకు రాఫెల్‌పై కాగ్ రిపోర్టు..!**

ఈ సమావేశాల్లో పార్లమెంట్ ముందుకు రాఫెల్ ఒప్పందంపై కాగ్ రిపోర్టు రానున్నది. గత యుపిఎ ప్రభుత్వం హయాంలో జరిగిన ఒప్పందంలో 126 ఎయిర్ క్రాఫ్ట్ ఉన్నాయి. కానీ మోడీ సర్కార్ ఆ ఒప్పందాన్ని రద్దు చేసి కొత్త ఒప్పందం కుదుర్చుకొంది. అందులో 36 విమానాలు మాత్రమే ఉన్నాయి. అలాగే ఒక్కో విమానం ధర కూడా పెరిగింది. దీంతో పాటు గతంలో హెచ్ఎఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంటే . తరువాత దాన్ని రద్దు చేసుకుని అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ సంస్థకు కట్టబెట్టారు. ఇలాంటి ముఖ్యమైన అంశంపై కాగ్ ఏ విధంగా నివేదిక ఇస్తోందో చూడాల్సి ఉంది.

### తాత్కాలిక బడ్జెట్టే : పియూష్

ఎన్నికల ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు బదులు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందనే వార్తలను వచ్చాయి. అయితే ఆ వార్తలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2019-20 ఏడాదికి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ఆర్థికశాఖ ఇన్‌ఛార్జ్ మంత్రి పియూష్ గోయల్ బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

### మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి : పి.కరుణాకరన్, సిపిఎం

ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని సిపిఎం లోక్‌సభా పక్షనేత పి.కరుణాకరన్ డిమాండ్ చేశారు. లోక్‌సభ స్పీకర్ నేతృత్వంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో కరుణాకరన్ వివిధ అంశాలను లేవనెత్తారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తుందని, నిరుద్యోగాన్ని రూపుమాపే చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎయిర్ పోర్టుల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అవినీతిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, నాలుగున్నరేళ్లలో మోడీ సర్కార్ ఇందులో విఫలమైందని అన్నారు. సిబిఐ, సివిసి, కాగ్ వంటి రాజ్యాంగ సంస్థలపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిపారు. ఈ సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిందేనని పట్టుపట్టారు.

## రాహుల్‌వి స్వార్థ రాజకీయాలు : మనోహర్ పారికర్



**న్యూఢిల్లీ :** మర్యాద పూర్వకంగా జరిగిన తమ కలయికను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారని అస్వస్థతతో ఉన్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ విమర్శించారు. తమ మధ్య కేవలం 5 నిముషాలు మాత్రమే సమావేశం జరిగిందని, ఆ సమయంలో రాఫెల్ అంశమే ప్రస్తావనకు రాలేదని పారికర్ చెప్పారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి బుధవారం పారిక్కర్ ఒక లేఖ రాశారు. వాస్తవాన్ని వెల్లడించాలని, అనారోగ్యంతో ఉన్న ఒక వ్యక్తిని మర్యాద పూర్వకంగా కలిసేందుకు రావడాన్ని "అవకాశవాద రాజకీయాలకు ఉపయోగించుకోవద్దు" అని పారిక్కర్ ఆ లేఖలో పేర్కొన్నట్లు బిజెపి వర్గాలు వెల్లడించాయి. రాఫెల్ ఒప్పందంపై ప్రధాని మోడీని మంగళవారం రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో పారికర్ బుధవారం ఆయనకు లేఖ రాశారు. "కొత్త ఒప్పందం" గురించి తనకేమీ తెలియదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## చట్టంతో ఆటలాడొద్దు

### కార్తీని హెచ్చరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** చట్టంతో ఆడలాడొద్దని, దర్యాప్తు సంస్థలకు సహకరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీని సుప్రీం కోర్టు హెచ్చరించింది. కార్తీ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు ఆయన విదేశీ పర్యటనకు బుధవారం అనుమతినిచ్చింది. ఎయిర్‌టెల్ మాక్సిస్ కేసులో మార్చి 5,6,7,12 తేదీల్లో విచారణ నిమిత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) ముందు హాజరుకావాలని ఆదేశించింది. 'మీరు ఎక్కడికైనా వెళ్లండి, ఏదైనా చేయండి, కానీ చట్టంతో ఆటలాడొద్దు. సరిగ్గా సహకరించకపోతే..కఠిన చర్యలు తప్పవు' అని చీఫ్ జస్టిస్ రంజన్‌గొగొయ్ కార్తీని హెచ్చరించారు. విదేశీ పర్యటన నిమిత్తం 10 కోట్ల రూపాయలను డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే కార్తీ విచారణకు సహకరించడం లేదంటూ ఆయన విదేశీ పర్యటన అనుమతించరాదని సిబిఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కేసులో కార్తీ తండ్రి చిదంబరం కూడా నిందితునిగా ఉన్నారు.

## మహా కూటమి వస్తే రోజుకో ప్రధాని : అమిత్ షా

**న్యూఢిల్లీ :** వచ్చే ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీల మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకొక ప్రధాన మంత్రిని చూడాల్సి వస్తుందని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా వ్యాఖ్యానించారు. కాన్పూర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ మహా కూటమి అధికారంలోకి వస్తే మాయవతి సోమవారం, అఖిలేష్ మంగళవారం, మమత బుధవారం, శరద్ పవార్ గురువారం, దేవెగౌడ శుక్రవారం, స్టాలిన్ శనివారం ప్రధానులుగా ఉంటారని, ఆదివారం సెలవు ప్రకటిస్తారని విమర్శించారు. ఎన్నికలకు వెళ్ళడానికి ముందు మహా కూటమి నేతలందరూ ఎన్ఆర్‌సిపై తమ వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బిజెపిని ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలతో కలిసి కూటమిని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోందని అన్నారు.

## అస్సాం పేలుళ్ల కేసులో 10 మందికి జీవిత ఖైదు



**గువహటి :** 2008లో అస్సాంలో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్(ఎన్‌డిఆర్ఎఫ్) చీఫ్ రంజన్ దైమరితో పాటు మరో తొమ్మిది మందికి సిబిఐ ప్రత్యేక కోర్టు బుధవారం యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఈ కేసులో 15 మందిని సోమవారం దోషులుగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. గువహటి, కొకురాజ్‌హర్, బొంగైగన్, బార్‌పేట్‌లో జరిగిన వరుసు పేలుళ్లలో 88 మంది మృతి చెందగా, 500 మందికి పైగా గాయపడ్డారు. దైమరితో పాటు, జార్జ్ బోరో, అజయ్ బసుమతరి, ఖర్గేశ్వర్ బసుమతరి, రాజేంద్ర గాయారి, ఒన్సాయ్ బోరో, తదితరులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి పదివేల రూపాయల జరిమానాను న్యాయ మూర్తి విధించారు. ఈ తీర్పు వెల్లడించే సమయంలో గువ హటిలో కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మరో ముగ్గురు దోషులు ప్రభాత్ బోడో, జయంతి బసుమతరి, మథుర బ్రహ్మలకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 3వేల రూపాయల జరిమానా కోర్టు విధించింది. శిక్షా కాలం పూర్తి అయినందున మరో ఇద్దరు దోషులను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

## మేఘాలయలో పాస్టర్లపై దాడి

**తుర :** మేఘాలయలోని వెస్ట్ గారో పర్వత జిల్లాలోని ఒక చర్చిలోని ఇద్దరు పాస్టర్లపై బుధవారం ముసుగు ధరించిన దుండగులు దాడి చేసి రూ.లక్ష నగదుతో పరారయ్యారని పోలీసు సూపరింటెండెంట్ ఎంజిఆర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో పాస్టర్లకు తీవ్ర గాయాలైనట్లు ఆయన చెప్పారు. బందిపోట్ల ప్రాబల్యం గల గారో పర్వత ప్రాంత జిల్లాలో గడిచిన నెల రోజుల్లో ఇటువంటి సంఘటన జరగడం ఇది నాలుగో సారి. ఇదంతా ఒకే దోపిడీ ముఠాకు చెందిన పని అయ్యుంటుందని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నారు. "రాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సుమారు 20 మంది గుర్తు తెలియని దుండగులు డామినిక్ సావియో మిషన్ చర్చిలోకి ప్రవేశించారు. చర్చిలో ఉన్న రెవరెండం, ఫ్రా. థామస్ జాన్, డానియల్ ఎం. సంగ్మాలను కట్టిపడేసి, వారిపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. అటు తరువాత చర్చిలో ఉన్న రూ.1.25 లక్షల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు తీసుకుని పరారయ్యారు." కుమార్ వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో గతంలో జరిగిన దోపిడీలు, ప్రస్తుత ఘటన ఒకే రీతిలో ఉన్నాయని తెలిపారు.

**ప్రత్యేకం**

# వెనిజులాపై యుద్ధం ప్రకటించిన అమెరికా

### పీపుల్స్ డెమొక్రసీ సంపాదకీయం

**ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:**

వెనిజులాలో నికొలస్ మదురో నేతృత్వంలోని ఎన్నికైన ప్రజా ప్రభుత్వంపై అమెరికా యుద్ధం ప్రకటించిందని సిపిఎం అధికార పత్రిక పీపుల్స్ డెమొక్రసీ (పి.డి) ఆగ్రహం వ్యక్తం చేసింది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ ఆ దేశ మితవాద ప్రతిపక్ష నేత జువాన్ గైడోను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు ట్రంప్ సర్కారు ప్రకటించటం వెనిజులాపై యుద్ధం ప్రకటించటమేనని పి.డి తన తాజా సంచిక సంపాదకీయంలో స్పష్టం చేసింది. ఈ చట్ట విరుద్ధ చర్యకు తోడు చట్టబద్ధంగా ఎన్నికైన దేశాధ్యక్షుడు మదురోకు మద్దతును ఉపసంహరించుకోవాలని వెనిజులా సైనిక దళాలకు పిలుపునివ్వటం గర్హనీయమని వ్యాఖ్యానించింది. జనవరి 23న తనకు తానుగా వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్న గైడోను తాము అధికారికంగా గుర్తిస్తున్నట్లు అమెరికా వెంటనే ప్రకటించింది. ఈ ప్రకటన ద్వారా దేశంలో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రకు తెరతీసింది. కాగా దేశ రక్షణ మంత్రి, సైనికదళాల అధ్యక్షుడు తాము చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి అండగా వుంటామని ప్రకటించటంతో ఈ కుట్ర విఫలమైంది. తరువాత అధ్యక్షుడు మదురోకు మద్దతుగా రాజధాని కారకస్‌లో భారీ ప్రజా ప్రదర్శన జరిగింది. 1999లో హ్యూగో ఛావెజ్ వెనిజులా అధ్యక్షుడుగా ఎన్నికై బొలివేరియన్ విప్లవ ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రయ త్నించిన సమయంలో అమెరికా మద్దతుతో దేశంలోని మితవాద శక్తులు బొలివేరియన్ ప్రభుత్వాన్ని గద్దె దించి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించాయి. 2002లో అప్పటి అధ్యక్షుడు ఛావెజ్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన కుట్ర భారీ ప్రజా సమీకరణతో విఫలమైంది. అప్పటి నుండి అమెరికా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ శక్తుల ప్రేరణతో మితవాద ప్రతిపక్షం వీధి నిరసనలు, హింసను రెచ్చగొడుతూ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తూనే వుంది. వెనిజులాలో ప్రస్తుత సంక్షోభానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. 2014 తరువాత చమురు ధరలు తీవ్ర స్థాయిలో పతనమవటంతో వెనిజులా ఆర్థిక వ్యవస్థ డోలాయమానంలో పడి దేశ ప్రజల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బడా కేపిటలిస్టులు తలపెట్టిన దేశ ద్రోహ చర్యలు, అమెరికా విధించిన ఆంక్షలతో పరిస్థితి మరింత దిగజారింది. ఇక రెండో అంశం బహిర్గతమైనది. గత ఒక్కటిన్నర దశాబ్దాల కాలంగా స్థిరమైన ప్రగతి సాధించిన లాటిన్ అమెరికా దేశాలు ఇప్పుడు తీవ్ర సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దీనికి అమెరికా సామ్రాజ్యవాద శక్తుల దన్నుతో మితవాద ప్రతిపక్షం తలపెట్టిన కుట్ర తోడయింది. అర్జెంటీనాలో మిత వాద ప్రభుత్వం ఏర్పడటం, బ్రెజిల్‌లో మితవాద పక్ష నేత దేశాధ్యక్షుడు కావటం వంటి అంశాలతో ఇక్కడ పరిస్థితులు తారుమారయ్యాయి. పెరూ, కొలంబియా, చిలీ దేశాలలో కూడా మిత వాద ప్రభుత్వాలే వున్నాయి. ఇందులో రెండు దేశాల అధ్యక్షులు కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్, బ్రెజిల్ అధ్యక్షుడు జయిర్ బోల్సనారో వెనిజులాలోని మదురో ప్రభుత్వాన్ని గద్దెదింపాలని కంకణ బద్ధులయ్యారు. మదురో ప్రభుత్వాన్ని మొదటి నుండి వ్యతిరేకిస్తున్న వెనిజులా మితవాద ప్రతిపక్ష శక్తులకు ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తోడయ్యారు. వెనిజులాలో వామపక్ష ప్రభావాన్ని అణచివేసేందుకు అక్కడ అధికార మార్పిడి చేయాలని ఈ శక్తులన్నీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

వెనిజులా అధ్యక్షుడు మదురోను గద్దె దింపేందుకు అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తున్నదనేందుకు వెనిజులా నుండి దిగుమతి అయ్యే చమురు కొనుగోళ్లపై విధించిన ఆంక్షలే ప్రత్యక్ష నిదర్శనం. వెనిజులా ప్రభుత్వ రంగ చమురు సంస్థ పిడివిఎస్ఎకు అమెరికాలో వున్న ఆస్తులను స్థంభింప చేయటం ఇందుకు మరో నిదర్శనం. వెనిజులా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్న ప్రధాన దేశం అమెరికా. అందువల్లే వెనిజులా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు అమెరికాలోని ట్రంప్ సర్కారు ఈ చర్యలు తీసుకుంది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా చట్ట విరుద్ధంగా జోక్యం చేసుకోవటాన్ని ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ స్పెయిన్ వంటి దేశాలు సమర్థిస్తున్నాయి. అమెరికా ప్రతిష్ఠించిన తాత్కాలిక అధ్యక్షుడిని గుర్తించ నిరాకరిస్తున్న ఈ దేశాలు వారం రోజుల వ్యవధిలో తాజా ఎన్నికలు నిర్వహించాలని మదురో సర్కారుకు సూచిస్తున్నాయి. అయితే ఈ డిమాండ్‌ను వెనిజులా ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. గత ఏడాది మేలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మదురో 67.8 శాతం ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించటం, ప్రతిపక్షంలోని ఒక వర్గం ఈ ఎన్నికలను బహిష్కరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వెనిజులా తన స్వాతంత్ర్యానికి, జాతీయ సార్వభౌమత్వానికి చేటు కలిగే పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో మదురో ప్రభుత్వానికి ప్రజాస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులన్నీ అండగా వుండి సామ్రాజ్యవాద శక్తుల చర్యలను ముక్త కంఠంతో ఖండించాల్సి వుంది.

వెనిజులాలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు జరుగుతున్న కుట్రపై మోడీ సర్కారు మౌనం వీడాలని, అక్కడ కొనసాగుతున్న ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా గళం వినిపించాలని పి.డి తన సంపాదకీయంలో డిమాండ్ చేసింది.

## మహాత్ముణ్ని మళ్లీ కాల్చి చంపారు !

- జాతిపిత నాడు వర్ధంతి గాడ్సే శౌర్య దివస్
- యుపిలో హిందూ మహాసభ బరితెగింపు



**న్యూఢిల్లీ :** జాతిపిత మహాత్మాగాంధీని 1948 జనవరి 30న హత్య చేసిన సంఘ్ పరివార్ ఇప్పుడు ఆయన భౌతికంగా లేకపోయినా గాంధీజీ దిష్టిబొమ్మలను తుపాకీతో కాల్చి చంపుతోంది. దేశ ప్రజలంతా బుధవారం జాతిపిత 71వ వర్ధంతి నిర్వహిస్తుండగా అఖిల భారత్ హిందూ మహాసభ మాత్రం గాంధీని హత్యగావించిన నాధురాం గాడ్సే వర్ధంతిని 'శౌర్య దివస్ (అమరవీరుల దినం)'గా జరుపుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి పూజా షాకున్ పాండే ఏకంగా మహాత్మ గాంధీ దిష్టిబొమ్మను తుపాకీతో కాల్చి అదే గాడ్సేకి నివాళి అంటూ వేడుకలు చేసుకున్నారు. తూటా గాయాలకు గాంధీజీ దిష్టిబొమ్మ రక్త మోడేలా ఏర్పాట్లు చేయడం వారి పైశాచికానికి దర్పణం పట్టింది. ఈ సందర్భంగా హిందూ మహాసభ కార్యకర్తలకు పాండే మిఠాయిలు కూడా పంచినట్లు కథనాలు వెలువడ్డాయి. అటు కేంద్రంలో బిజెపి, ఇటు రాష్ట్రంలో కరుడుగట్టిన కాషాయ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉండటమే వీరి బరితెగింపునకు కారణంగా కనిపిస్తోంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో ఒక భాగమైన అఖిల భారత హిందూ మహాసభలో నాధురాం గాడ్సే పనిచేసిన సంగతి తెలిసిందే. గాడ్సే వర్ధంతిని హిందూ మహాసభ ప్రతి యేటా 'శౌర్య దివస్'గా జరుకుంటున్నా..గాంధీజి దిష్టిబొమ్మను తుపాకీతో కాల్చి చంపిన వికృతాలకు పాల్పడటం ఇదే తొలిసారి అని వివిధ మీడియా సంస్థలు తమ కథనాల్లో పేర్కొన్నాయి.

## అరేబియా సముద్రంలో రెండు పడవలు మునక

### 28 మందికి పైగా మృతి, 130 మందికి పైగా గల్లంతు

**అడిస్ అబాబా :** అరేబియన్ దేశమైన డిజిబౌటీ తీరంలో మంగళవారం జరిగిన బోటు ప్రమాదంలో కనీసం 28 మంది మరణించగా మరో 130 మందికి పైగా జాడ తెలియటం లేదని అధికారులు చెప్పారు. ప్రయాణీకులతో రద్దీగా వుండే రెండు పడవలు తీరానికి చేరువవుతున్న సమయంలో పరస్పరం ఢీకొని మునిగిపోవటంతో ఈ ప్రమాదం జరిగింది. గొడోరియా ఈశాన్య తీర ప్రాంతం నుండి బయల్దేరిన ఈ పడవలు 30 నిముషాల తరువాత ప్రమాదానికి గురయ్యాయని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) వెల్లడించింది. సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న తీర రక్షక దళాలు అయిదు మృతదేహాలను వెలికి తీశాయని ఈ సంస్థ వివరించింది. బుధవారం ఉదయం 23 మృతదేహాలను కనుగొని వెలికి తీశామని, కోస్ట్‌గార్డ్ తన గాలింపుచర్యలను కొనసాగిస్తోందని ఐఓఎం ప్రతినిధి లాలిని వీరాస్వామి మీడియాకు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను సజీవంగా తీరానికి చేర్చారని, మరికొందరు మంగళవారం సాయంత్రం ఓబోక్ పట్టణంలో వున్న తమ కార్యాలయానికి చేరుకున్నారని ఆయన వివరించారు. మృతులు, ప్రమాదం నుండి బయటపడిన వివరాలు ఇంకా వెల్లడి కాలేదని ఆయన చెప్పారు.



## చైనాలో ప్రారంభమైన కొత్త సంవత్సర రద్దీ

**బీజింగ్ :** చైనాలో కొత్త సంవత్సరం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాన పట్టణాల నుండి స్వస్థలాలకు వెళ్లే ప్రయాణీకులతో విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. చైనా సౌరమానం ప్రకారం మంగళవారం నుంచి ప్రారంభం కానున్న వరాహ నామ సంవత్సరంలో కుటుంబ, బంధు మిత్రులందరూ ఒక చోట కలుసుకుంటారు. విందులు, వినోదాలతో సరదాగా గడుపుతారు. చైనీయులకు అన్ని పండగలకన్నా అతి పెద్ద పండగ ఇదే. ఈ వేడుకల కోసం విదేశాల్లో వివిధ వృత్తుల్లో పని చేస్తున్న చైనీయులంతా స్వస్థలాలకు తరలి వస్తుండడంతో బీజింగ్ విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో రద్దీ బాగా పెరిగింది. వణికిస్తున్న చలిలో లగేజీ తీసుకుని. బీజింగ్ నుంచి సెంట్రల్ చైనాలోని హునాన్ రాష్ట్రంలోని హువాయి హుయాకు చేరుకునేందుకు 32 గంటలపాటు రైలు ప్రయాణం చేయాల్సి వున్న కుటుంబాలు రైల్వే స్టేషన్‌లో ఒక చేతిలోఛాయ్ మరో చేతిలో మొబైల్ ఫోన్లతో అటు ఇటు తిరుగుతుండడం కనిపిస్తుంది. విశ్రాంతి గదులు నిండిపోవడంతో ప్లాట్‌ఫామ్‌లపై మడత పెట్టేందుకు వీలుండే స్టూళ్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. స్లీపర్ క్యాబిన్లలో కుటుంబ సభ్యులలు తినుబండారాలు తినడం, ఫోన్‌లో ముచ్చట్లాడుకోవడం, పిల్లలతో కారిడార్లలో ఆటలాడుకోవడం వంటి వాటితో కాలక్షేపం చేస్తున్నారు. ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వేస్ శాఖ 41.3 కోట్ల అదనపు ట్రిప్పులను నడుపుతోంది. గత ఏడాది ఇదే సీజన్‌తో పోల్చితే ఈ సారి రైల్వేస్ 8.3 శాతం అధిక ట్రిప్పులు నడుపుతున్నట్లు చైనా అధికారిక వార్తా సంస్థ సిన్హువా తెలిపింది.

## పాలస్తీనా ప్రధాని అహ్మదుల్లా రాజీనామా



**జెరూసలేమ్ :** పాలస్తీనా ప్రధాని అహ్మదుల్లా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు మంత్రివర్గ సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామాలు చేశారు. వీరందరి రాజీనామాలను అధ్యక్షుడు మొహ్మద్ అబ్బాస్ బుధవారం ఆమోదించారు. సెంట్రల్ కమిటీ ఆఫ్ ఫతాహ్ గ్రూప్ ప్రతిపాదనల మేరకు ప్రధాని పదవి నుంచి తప్పుకున్నట్టు హమ్దల్లా తెలిపారు.

## ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతాల్లో సెటిల్మెంట్లను తొలగించండి

### ట్రావెల్ సైట్లకు ఆమ్నెస్టీ విజ్ఞప్తి

**జెరూసలేం :** వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయిల్ ఆక్రమిత సెటిల్మెంట్లను పర్యాటక జాబితాల నుండి తొలగించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ బుధవారం ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీలకు విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోని అత్యధిక భాగం ఆక్రమణలుగా పరిగణిస్తున్న సెటిల్మెంట్లలో పర్యాటకాన్ని Airbnb, Booking.com, Expedia, TripAdvisor వంటి సంస్థలు ప్రోత్సహిస్తున్నాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన తాజా అధ్యయన నివేదికలో పేర్కొంది. కాగా తమ జాబితా నుండి వెస్ట్‌బ్యాంక్ సెటిల్మెంట్లను త్వరలోనే తొలగిస్తామని ఎయిర్‌బిఎన్‌బి సంస్థ ప్రకటించి నప్పటికీ, ఇప్పటి వరకూ దానిని అమలు చేయలేదు. ఈ సెటిల్మెంట్లను పర్యాటక జాబితా నుండి తొలగించటంతో పాటు 1967లో ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న తూర్పు జెరూసలేంను కూడా ఈ జాబితాలో చేర్చాలని ఆమ్నెస్టీ ఎయిర్‌బిఎన్‌బికి విజ్ఞప్తి చేసింది.

### ట్రంప్, కొలంబియా కలసి

# నా హత్యకు కుట్ర పన్నారు

**• మదురో వెల్లడి • శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటన**

**మాస్కో:** తనను హత్య చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొలంబియా ప్రభుత్వాన్ని, మాఫియాను ఆదేశించారని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో వెల్లడించారు. ఈ బెదిరింపుల దృష్ట్యా తన చుట్టూ భద్రతా వలయాన్ని పటిష్ట పరచాల్సి వచ్చిందన్నారు. తనను చంపాలని ఆదేశించింది ట్రంపేననడంలో ఎలాంటి సందేహమూ లేదని మదురో చెప్పారు. తనకు ఏమైనా జరిగితే దానికి ట్రంప్, కొలంబియా అధ్యక్షుడు ఇవాన డ్యూక్యూ బాధ్యత వహించాల్సి వుంటుందని వెనిజులా నేత హెచ్చరించారు. దేశంలో కొనసాగుతున్న రాజకీయ ప్రతిష్టంభనకు తెరదించేందుకు ప్రతిపక్షంతో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా వున్నానని మదురో తెలిపారు. ప్రతిపక్ష నేత జువాన్ గైడో దేశ తాత్కాలిక అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న తరువాత హింసాత్మక నిరసనలతో వెనిజులా అట్టుడికిన విషయం తెలిసిందే. ప్రజలు తమ ఇళ్లు, పని స్థలాల నుండి బుధవారం రెండుగంటలపాటు బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేయాలని గైడో మంగళవారం వెనిజులా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ నేపథ్యంలో గతంలో చర్చలకు నిరాకరించిన ప్రస్తుత అధ్యక్షుడు మదురో రష్యా అధికార వార్తా సంస్థ రియా నొవోస్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను ప్రతిపక్షంతో చర్చలు సిద్ధంగా వున్నానని చెప్పారు. వెనిజులా శాంతియుతమైన భవిత కోసం కలిసి పనిచేసేందుకు వీలుగా ప్రతిపక్షంతో చర్చలకు కూర్చునేందుకు తాను సిద్ధంగా వున్నానని మదురో వివరించారు. ఇతర దేశాల మధ్యవర్తిత్వంతో చర్చలు జరపాలని ఆయన సూచించారు. మెక్సికో, ఉరుగ్వే, బొలీవియా, వాటికన్, రష్యా వంటి దేశాల పేర్లను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొలంబియా ద్వారా తనను దెబ్బతీసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రణాళికలు సిద్ధం చేశారని ఆయన ఆరోపించారు. తనను హత్య చేయాలని కొలంబియా ప్రభుత్వానికి, స్థానిక మాఫియాలకు ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన విషయం తనకు తెలుసని ఆయన చెప్పారు.



**మదురోకు చైనా మద్దతు**

వెనెజులా అధ్యక్షుడు మదురోకు చైనా బాసటగా నిలిచింది. వెనెజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నేత గైడోను అధ్యక్ష పీఠంపై కూర్చొండబెట్టాలని అగ్రరాజ్యం పావులు కదుపుతోంది. అమెరికా తీరు పట్ల ఇప్పటికే మదురో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని ట్రంప్ సర్కార్ ప్రయత్నించినట్టయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అమెరికా చర్యలను రష్యా, చైనా దేశాలు ఖండించాయి. మదురోకు మద్దతుగా నిలిచాయి. దక్షిణ అమెరికా దేశమైన వెనెజులాతో చైనాకు బలమైన ద్వైపాక్షిక సంబంధాలున్నాయి. వెనెజులాలోని పలు పరిశ్రమల స్థాపనకు చైనా ఆర్థికంగా సహకరించింది. చమురు సంస్థలకు చైనా నుంచి భారీ మొత్తంలో రుణాలు అందుతున్నాయి. చైనా నుంచి ఆయుధాలను వెనెజులా సరఫరా చేసుకుంటున్నది. అంతేగాకుండా, రష్యా కూడా మదురో సర్కార్‌కు సంపూర్ణ మద్దతిస్తుండటంతో చైనా అండదండలు వెనెజులాకు ఉన్నాయి.

### వెనిజులా బంగారాన్ని తిరిగి ఇవ్వకుంటే ఆర్థిక కేంద్రంగా బ్రిటన్ పతనమైనట్టే !

**ఆర్థికవేత్త ప్రొ.వోల్ఫ్**

లండన్: వెనిజులాకు సంబందించిన బంగారం నిల్వలను స్థంభింప చేయాలన్న బ్యాంక్ ఆఫ్ లండన్ నిర్ణయాన్ని ప్రముఖ ఆర్థికవేత్త, డెమొక్రసీ ఎట్ వర్క్ సహ వ్యవస్థాపకుడు ప్రొ.రిచర్డ్ వోల్ఫ్ తప్పుపట్టారు. వెనిజులా ప్రభుత్వం దాచుకున్న బంగారం నిల్వలను తిరిగి అప్పగించేందుకు నిరాకరిస్తే ఆర్థిక కేంద్రంగా బ్రిటన్ పతనం ఖాయమైనట్టేనని ఆయన స్పష్టంచేశారు. బ్రిటన్, దాని కేంద్ర బ్యాంకు అమెరికా చెప్పుచేతల్లో వుండటం వల్లే ఇటువంటి విపరీత నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఆయన విమర్శించారు. అమెరికాతో ప్రతి దేశమూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోందన్న దానికి ఇది తాజా సంకేతమని ఆయన అన్నారు.

## ఫిలిప్పైన్స్ మసీదులో గ్రెనేడ్ దాడి, ఇద్దరి మృతి



**మణిలా :** ఫిలిప్పైన్స్ దక్షిణ ప్రాంతంలోని ఒక మసీదులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఒక గ్రెనేడ్ దాడిలో ఇద్దరు మరణించగా మరో నలుగురు గాయపడ్డారని భద్రతాధికారులు బుధ వారం మీడియాకు చెప్పారు. మూడు రోజుల క్రితం సమీపంలోని ఒక చర్చ్‌లో జరిగిన జంట పేలుళ్లలో 21 మంది మరణించిన విషయం తెలిసిందే. ఫిలిప్పైన్స్ దక్షిణ ప్రాంతంలోని మిండనావ్ ప్రాంతంలోని జంబోవాంగా గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈ దాడి జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న సైనికాధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని ప్రజలందరూ సంయమనంతో వ్యవహరించాలని, ఊహాగానాలను పట్టించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇది ప్రతీకార చర్య కాదని రీజనల్ టాస్క్‌ఫోర్స్ కమాండర్ కల్నల్ ఇయోనెల్ నికొలస్ అభిప్రాయపడ్డారు. చర్చ్‌పై జరిగిన జంట పేలుళ్ల దాడి ఆత్మాహుతి దాడి కావచ్చని అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్ట్ టెలివిజన్‌లో చెప్పిన కొద్ది గంటలకే ఈ దాడి జరగటం గమనార్హం. మిండనావ్‌లోని ముస్లిం ఆధిపత్య ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించే అంశంపై ఈ నెల 21న రిఫరెండం జరిగిన తరువాత ఈ దాడులు జరిగిన విషయం తెలిసిందే.

## బ్యాక్‌స్టాప్ వుండాల్సిందే!

**లండన్/బ్రస్సెల్స్:** బ్రెగ్జిట్ విషయంలో ఎటువంటి ఒప్పందం కుదుర్చుకున్నా అందులో ఉత్తర ఐర్లండ్, రిపబ్లిక్ ఆఫ్ ఐర్లండ్ సరిహద్దు వివాదానికి సంబంధించిన బ్యాక్ స్టాప్ అంశం వుండి తీరాల్సిందేనని ఐరోపా పార్లమెంట్‌కు చెందిన బ్రెగ్జిట్ స్టీరింగ్ గ్రూప్ కన్వీనర్ వెరాఫ్‌స్టాడ్ స్పష్టంచేశారు. కాగా బ్రెగ్జిట్‌కు సంబంధించి ఇప్పటికే ఒప్పందం కుదిరిందని, దీనిపై తిరిగి మరోసారి చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్టీరింగ్ గ్రూప్ బుధవారం ఒక ప్రకటనలో తేల్చిచెప్పింది. ఇది బ్యాక్ స్టాప్ అంశానికి కూడా వర్తిస్తుందని, బ్రెగ్జిట్‌కు సంబంధించిన అనేక అంశాలకు ఇది భరోసా ఇస్తుందని ఈ గ్రూప్ ఒక ప్రకటనలో వివరించింది.

**జర్మనీ పౌరసత్వం కోసం బ్రిటిష్ యూదుల ప్రయత్నాలు**

ఐరోపా కూటమి నుండి బ్రిటన్ నిష్క్రమించే (బ్రెగ్జిట్) సమయం దగ్గర పడుతుండటంతో బ్రిటన్‌లో నివశిస్తున్న వేలాది మంది యూదులు జర్మనీ పౌరసత్వం కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తనకు, తన పిల్లలకు సురక్షితమైన భవిత కోసం బ్రెగ్జిట్ అనే విపత్తు నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రముఖ గాయకుడు వాల్ఫిష్ చెప్పారు. యూరోపియన్‌గా కొనసాగేందుకు తాను ఐరోపా పౌరసత్వాన్ని తీసుకున్నానని ఆయన చెప్పారు.

**మొదటి పేజీ తరువాయి**

## బిజెపికి చరమగీతం పాడాలి

ఈ ధర్నాలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ అన్నదాతలు తమ సమస్యలపై గొంతెత్తుతుంటే, రైతాంగ ఉద్యమాలను పక్కదోవపట్టించేందుకు సంఘ్ పరివార్ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. రామ మందిరం, శబరిమల వంటి ఘటనల్లో ప్రజలను రెచ్చగొట్టడమే దీనికి నిదర్శనమని అన్నారు. 2014 నాటి ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ సర్కార్ రామమందిరాన్ని ఎన్నికల అజెండాగా ముందుకు తెస్తోందని విమర్శించారు. గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు సమస్యల్లోకి నెట్టబడ్డారని అన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. దేశంలో దళిత, మైనార్టీలపై దాడులు జరుగుతుంటే, వాటిని నివారించడానికి బదులు మరింత రెచ్చగొట్టే విధంగా మోడీ సర్కార్ వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై దాడి చేసి, మనుస్మృతిని తీసుకొచ్చేందుకు సంఘ్ పరివార్ కుట్రపన్నుతోందని విమర్శించారు. దీన్ని దేశ ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ నేత సాబీర్ సింగ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ఏ వర్గమూ నేడు ఆనందంగా లేదన్నారు. జై జవాన్, జై కిసాన్... జై సంవిధాన్ నినాద స్ఫూర్తితో తాము ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. సైనికులకు వన్ ర్యాంక్..వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సైన్యంలో ఖాళీగా ఉన్న 7.5 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రక్షణ రంగంలో కుంభకోణాలకు తావివ్వరాదని అన్నారు.

## బాలికపై అత్యాచారం

చదివించుకుంటోంది. రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల బాలిక మంగళవారం రాత్రి 9 గంటలకు బహిర్భూమికి వెళ్లింది. సమీపంలోని ఓ దుకాణంలో మద్యం తాగిన మిరియాల జయరావు (25) బాలిక వద్దకు వెళ్లి నోట్లో గుడ్డలు కుక్కి పళ్లు ఊడేలా మూతిపై రాయితో కొట్టాడు. అనంతరం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో బాలిక ఏడుస్తూ ఇంటికి వచ్చింది. ఇది గమనించిన తల్లి విషయం తెలుసుకొని బంధువులతో సహా నిందితుడైన జయరావును నిలదీయగా తనకేమీ సంబంధం లేదని, అక్కడ మరో వ్యక్తి ఉన్నాడని బుకాయించి అక్కడి నుండి పరారయ్యాడు. బాలికను తొలుత గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పడంతో వెంటనే గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు గురజాల డిఎస్‌పి శ్రీహరిబాబు ఆదేశాలతో ఎస్ఐ ఆవుల హరిబాబు ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. నిందితుడ్ని, అతన్ని దాచిన పి.భూలక్ష్మీలను పోలీసులు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

**న్యాయం కోసం రాస్తారోకో**

విషయం తెలిసిన గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కుల మతాలకతీతంగా గ్రామస్తులంతా తమ గ్రామానికి ఏడు కిలీమీటర్ల దూరంలోని పాల్వాయి జంక్షన్‌కు బుధవారం ఉదయమే చేరుకున్నారు. 8.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు.. నిందితుడ్ని అప్పగించాలని, బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. వీరికి ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతిచ్చాయి. వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. నిందితుడిని 24 గంటల్లో అరెస్టు చేస్తామని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**మంత్రి సునీత, రాజకుమారి పరామర్శ**

జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర స్త్రీ, శిసు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి బుధవారం పరామర్శించారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించేలా చూస్తామని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఘటన తరహాలోనే ఈ కేసు విచారణను 15 రోజుల్లో పూర్తి చేయిస్తామన్నారు. బాలికకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం, ఇల్లు మంజూరు చేయిస్తామని ప్రకటించారు.

## అన్నా హజారే దీక్ష ప్రారంభం

పాటుగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని హజారే డిమాండ్ చేస్తున్నారు. లోక్‌పాల్ చట్టం ఆమోదించి ఐదేళ్ళు గడుస్తోంది. కానీ ఇప్పటివరకు మోడీ సర్కార్ లోక్‌పాల్‌ను నియమించలేదని ఆయన విమర్శించారు. గతేడాది మార్చిలో ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో తాను దీక్ష చేసినపుడు అన్ని డిమాండ్లను ఆమోదిస్తామని కేంద్రం చెప్పిందని, ఇప్పటికి 9మాసాలు గడిచినా అవేవీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు.

# ఉపాధి హామీ బకాయిలు చెల్లించండి

**• కేంద్ర మంత్రి తోమర్‌తో లోకేష్ భేటీ**

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఉపాధి హామీ పథకం బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కేంద్రాన్ని కోరారు. ఏపి ప్రభుత్వం 346 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, ఆ మండలాల్లో 150 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. బుధవారం నాడిక్కడ కృషి భవన్‌లో కేంద్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌తో నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలు, టెక్నాలజీ సహాయంతో పారదర్శకత, డ్రోన్లతో సోషల్ ఆడిటింగ్, డ్యాష్ బోర్డ్‌తో రియల్ టైం పర్యవేక్షణ తదితర అంశాలను కేంద్ర మంత్రి తోమర్, అధికారుల బృందానికి మంత్రి నారా లోకేష్ వివరించారు. ఉపాధి హామీ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందని, ఇతర రాష్ట్రాల కంటే ఏపి అన్ని విభాగాల్లో ముందు ఉందని కేంద్ర మంత్రి తోమర్ అన్నారు. డ్రోన్ల సహాయంతో సోషల్ ఆడిటింగ్ పైలెట్ ప్రాజెక్ట్ పూర్తి అయిన వెంటనే ఆ సమాచారం తమకు కూడా పంపాలని, దేశ వ్యాప్తంగా అమలు చేసే అంశంగా పరిశీలిస్తామని అన్నారు. భేటీ అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ కరువు మండలాల్లో కూలీలను ఆదుకోవడానికి కేంద్రం సహకరించాలని కోరారు. కరువు మండలాల్లో వలసలు అరికట్టడానికి 150 రోజుల పనిదినాలు, ఎక్కువ మందికి పని కల్పించడానికి కేంద్ర



ప్రభుత్వం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. 2018 నవంబర్ 15 తరువాత నుంచి ఇప్పటి వరకూ బకాయిలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదని, రూ.500 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సి ఉందని అన్నారు. కూలీలకు వేతన బకాయిల్లో రూ. 175 కోట్లు విడుదల చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని తెలిపారు.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రూ.1175 కోట్లు మెటీరియల్ నిధులు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నిధులు విడుదల చేయకపోవడం వలన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు, మెటీరియల్ రూపంలో చెల్లించిన రూ.2138 కోట్లు ఇంకా కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సి ఉందన్నారు. అయితే మార్చి లోపు వేతనాలు రూపంలో రూ.150 కోట్లు, మెటీరియల్ కింద రూ.200 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర మంత్రి తోమర్ అంగీకరించారు.

**పాడైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**

రాష్ట్రంలో తుఫాన్ల కారణంగా పాడైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అందుకోసం నిబంధనలు సడలించాలని రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు కోరారు. తడిచిన ధాన్యానికి సంబంధించిన నిబంధనలు మార్చి, పాడైన ధాన్యాన్ని కూడా ఎఫ్‌సిఐ సేకరించాలని కోరారు. బుధవారం నాడిక్కడ కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కృష్ణరాజ్‌ని ఆమె కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, టిడిపి ఎంపిలు సిఎం రమేష్, తోట సీతారామలక్ష్మి, రామ్మోహన్ నాయుడు, మాగంటి బాబు, గల్లా జయదేవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌లు కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ. తుఫాన్ వల్ల రైతులకు జరిగిన నష్టంపై ఏపి మంత్రులు వచ్చి తనను కలిశారని, అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో పంట నష్టం జరిగిందని అన్నారు. రైతులు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన రూ.76 కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెల్లించాల్సిన మరో రూ.76 కోట్లు నిధులను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. వర్షాల కారణంగా రూ.4917 కోట్ల నష్టం వచ్చిందని, నివేదిక పంపిస్తే కేవలం రూ. 900 కోట్లు ఇచ్చారని అన్నారు. అనంతరం కేంద్ర ఆహారం, పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవికాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ఇక మేమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

గణాంకాలతో సహా కమిషన్ పనితీరుపై ఆందోళన వ్యక్తం చేసినట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే కొన్ని నెలలుగా వారు ఈ ఆందోళన వెలిబుచ్చలేదని కూడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ అధ్యయన సమాచారాన్ని తమ కమిషన్ డిసెంబర్‌లోనే ఆమోదించినా దీనిని ఇప్పటి వరకూ విడుదల చేయకపోవటంలోని ఔచిత్యాన్ని వారు ప్రశ్నించినట్లు సమాచారం.

2020 జూన్ వరకూ పదవీకాలం ఉన్న మోహనన్, మీనాక్షి నిష్క్రమణతో ఇక కమిషన్‌లో ఇద్దరు సభ్యులే మిగిలారు. వారిలో ఒకరు చీఫ్ స్టాటిస్టిషియన్ ప్రవీణ్ శ్రీవాత్సవ కాగా మరొకరు నీతి ఆయోగ్ సిఇఓ అమితాబ్ కాంత్. మోహనన్ ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ మాజీ సభ్యుడు కాగా, మీనాక్షి ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రొఫెసర్‌గానూ పని చేశారు.

జాతీయ గణాంకాల విషయంలో కేంద్రం గత ఏడాది నుండి అనేక వివాదాలలో చిక్కుకుంటున్న విషయం, ముఖ్యంగా గత జిడిపి బ్యాక్ సీరీస్ డేటాను ఇటీవల విడుదల చేయటం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. కీలక గణాంకాలను నియంత్రించి ఆడిట్ చేసే విషయంలో కమిషన్‌కు మరిన్ని అధికారాలిచ్చే విషయాన్ని కేంద్రం నిశితంగా పరిశీలిస్తున్నట్లు గత మే నెలలో మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి.

**నిర్లక్ష్యంతో మరో వ్యవస్థ మూతపడింది : చిదంబరం**

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మరో వ్యవస్థ మూతపడిందని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ట్విట్టర్‌లో విమర్శించారు. నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ 'మృతి' (మూతపడటం) పట్ల తాము ప్రగాఢ సంతాపం తెలియచేస్తున్నామని, జిడిపి, ఉపాధి కల్పనకు సంబందించిన డేటా విషయంలో ఈ వ్యవస్థ విశేషమైన సేవలందించిందని ఆయన వ్యంగ్యంగా ట్విట్టర్‌లో సంతాపం వ్యక్తం చేశారు.

### ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్

# ఆస్తులను కాపాడండి

**• సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, సంస్థలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని, సంస్థను ప్రభుత్వం ఆధీనం చేసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు బుధవారం లేఖ రాశారు. జాతీయోద్యమ కాలంలో స్వదేశీ విద్యను ప్రోత్సహించేందుకు కోపల్లి హనుమంతరావు, ముట్నూరు కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య 1910లో ఆంధ్ర జాతీయ కళాశాలను స్థాపించారని, ఎన్నో కష్టనష్టాలకోర్చి విరాళాల రూపంలో వనరులు సమకూర్చి ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. మహాత్మాగాంధీ, అనిబిసెంట్, బిపిన్ చంద్రపాల్, సర్వేపల్లి రాధాకృష్ణ వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకుందని, అంతటి ప్రతిష్ట కలిగిన కాలేజీ నేడు అక్రమార్కుల బారిన పడిందని, సంస్థ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. వ్యవస్థాపకుల కుటుంబ సభ్యులెవరికీ వారసత్వ హక్కులుండవని మెమొరాండం ఆఫ్ ఆర్టికల్స్‌లో పేర్కొన్నారని, 1988లో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకున్న సమయంలో కూడా 38 ప్రాపర్టీ రిజిస్టర్‌లో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని తెలిపారు. పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్స్, ప్రజల విరాళాలతో ఏర్పడిన సంస్థలకు వారసత్వ హక్కులు వర్తించవని 1996లో సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, అయినప్పటికీ చట్ట విరుద్ధంగా 1999లో దేవాదాయ శాఖ అధికారులు వారసులను గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. విద్యా సంస్థ నిర్వహణలో అవినీతి జరుగుతున్నట్లుగా వార్తలు కూడా వస్తున్నాయని, 34 ఎకరాల కళాశాల ప్రాంగణం, 257 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దీని ద్వారా ఏటా రూ.50లక్షలు, కృష్ణా యూనివర్సిటీ అద్దె రూపంలో రూ.4,87,000 ఆదాయం వస్తోందని, ఈ డబ్బును కళాశాల అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని, తప్పుడు లెక్కలు చూపి అక్రమంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పొందుతు న్నారని తెలిపారు. కళాశాల నిధులు, ప్రభుత్వం నుంచి వస్తున్న గ్రాంట్లు దుర్వినియోగం అవుతున్నాయని, డబ్బు తీసుకుని అక్రమంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని సిబ్బందే పలుమార్లు ఫిర్యాదులు చేశారని, వారి ఫిర్యాదుపై ప్రత్యేక కమిషనర్ విచారణ జరిపి 8 నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలూ లేవని పేర్కొన్నారు. రాష్ట్రానికి తలమానికమైన విద్యా సంస్థల్లో ఒక్కటైన ఈ నేషనల్ కాలేజి అవినీతిపరుల చేతిలో అప్రతిష్ట పాలు కాకుండా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు.

## ఫిబ్రవరిలో అన్ని జిల్లాల్లో జాబ్‌ఫెయిర్

**• ఎపిఎస్ఎస్‌డిసి సిఇవో కృతికా శుక్లా**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఫిబ్రవరి 2, 9, 16వ తేదీల్లో అన్ని జిల్లాల్లో అడ్వాంటేజ్ ఏపి కెరీర్ ఎక్స్‌పో పేరుతో జాబ్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఇవో కృతికా శుక్లా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 2న నిర్వహించే జాబ్ ఫెయిర్‌లో ల్యాబ్ టెక్నీషియన్స్, డ్యూటీ నర్స్, హోం కేర్ నర్సింగ్, ఫ్రంట్ ఆఫీస్, హాస్పిటల్ మార్కెటింగ్, మెడికల్ రెప్రెజెంటేటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, వీటిల్లో ఫార్మా, హెల్త్ కేర్, మెడికల్, లైఫ్ సైన్సెస్ రంగా కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 9న ఐటి, ఎలక్ట్రానిక్స్, టెలీకమ్యునికేషన్స్, బిపివో, ఆటోమొబైల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో జాబ్ మేళాలు ఉంటాయన్నారు. వీటికి బీటెక్, ఐటిఐ, డిప్లొమా హోల్డర్లు అర్హులన్నారు. ఫిబ్రవరి 16న బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, రిటైల్, హాస్పటాలిటీ, సెక్యూరిటీ సర్వీసెస్, ఇ కామర్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో జాబ్ ఫెయిర్ ఉంటుందన్నారు. వీటికి 10వ తరగతి, డిగ్రీ, పిజి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగి 20 నుంచి 35 ఏళ్ళలోపు ఉన్న వారు www.apssdc.in/AdvantageAPలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలతో ఇంట ర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9505719172, 9700025833 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## 17న వైసిపి బిసి గర్జన

**మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఫిబ్రవరి 17న ఏలూరులో వైసిపి బిసి గర్జన నిర్వహించనున్నట్లు మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి తెలిపారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వైసిపి బిసి సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి గర్జనలో వైఎస్ జగన్ బిసి డిక్లరేషన్‌ను ప్రకటిస్తారన్నారు. ఐదేళ్ల పాలనలో బిసిలకు చంద్రబాబు నాయుడు చేసిందేమీలేదని, రాష్ట్రంలో బిసిల జీవితాలు దుర్భర పరిస్థితిలో ఉన్నాయన్నాయని అన్నారు. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు ఏడాదిన్నర క్రితమే బిసి అధ్యయన కమిటీ ఏర్పాటు చేశామని, బిసిల పరిస్థితిపై కమిటీ అధ్యయనం చేసిందని చెప్పారు. వైసిపి అధికార ప్రతినిధి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఏ చేస్తుందో చెప్పాలన్నారు. అగ్రిగోల్డ్ సమస్యను ప్రభుత్వం అటకెక్కించిందని, రూ.1183 కోట్లు ఇస్తే 80 శాతం మందికి న్యాయం జరుగుతుందని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. గవర్నర్ ప్రసంగంలో అగ్రిగోల్డ్ అంశం ఎక్కడా లేకపోవడం దురదృష్టకరమన్నారు.

# కొత్తగా సన్నద్ధం!



అల్లు అర్జున్

విభిన్నంగా ఉండేలా నిత్యం తపిస్తుంటాడు అల్లు అర్జున్. సినిమా సినిమాకూ కొత్తగా కనిపిస్తాడు. ఏడాది పాటు విరామం అనంతరం మళ్లీ చిత్రీకరణకు సిద్ధమవుతున్నాడు. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాకు సంబంధించి గత ఏడాది మార్చిలో చివరి సారిగా షూటింగ్‌లో పాల్గొన్నాడు. ఆ సినిమా మేలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అప్పటి నుంచి ఈ హీరో కెమెరా ముందుకు రాలేదు. ఈ మధ్య కాలంలో చాలా కథలు విన్నాడు కానీ ఏ దర్శకుడు చెప్పిన కథా బన్నిని మెప్పించలేకపోయింది. అయినా విక్రమ్ కుమార్‌తో సినిమా చేస్తాడని అంతా ప్రచారం జరిగింది కానీ చివరకు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తన తదుపరి చిత్రం చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. ఇందులో అల్లు అర్జున్ కొత్త అవతారం కనిపించబోతున్నాడని ప్రచారం జరుగుతోంది. ఇటీవల 'లవర్స్ డే' సినిమా ఆడియో విడుదల వేడుకలోగానీ, పాలకొల్లులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నప్పుడు కానీ బన్ని అవతారాన్ని బట్టి కొత్తలుక్‌లోనే తర్వాత చిత్రం ఉండబోతుందని ప్రచారం జరుగుతుంది. 'వరుడు' చిత్రంలో ఆయన ఉన్న లుక్ మాదిరిగానే ఉండొచ్చునని భావిస్తున్నారు. ఈ చిత్రంలో పాత్ర కోసం తన బాడీని కూడా మార్చేసుకున్నాడట.మార్చిలో బన్ని చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం త్రివిక్రమ్ ఫైనల్ స్క్రిప్ట్‌పై కరసత్తు చేస్తున్నాడు. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కనుంది. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన రష్మిక మడన్నా గానీ, కియరా అద్వాని గానీ నటించే అవకాశాలు ఉన్నాయి.

# 'మామి' కొత్త చైర్మన్ దీపికా



ముంబాయి

అకాడమీ ఆఫ్ మూవింగ్ ఇమేజ్(ఎంఎఎంఐ) నూతన చైర్మన్‌గా దీపికా పదుకొనే బాధ్యతలు చేపట్టింది. ఇటీవల నిర్వహించిన మామి ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ బాధ్యతలను తీసుకున్నారు దీపికా. నాలుగేళ్లుగా ఆ పదవిలో ఉన్న నిర్మాత, అమిర్ ఖాన్ భార్య కిరణ్ రావు తన బాధ్యతల నుంచి తప్పుకుంది. తన భవిష్యత్తు ప్రాజెక్టు పనులపై దృష్టిసారించేందుకు గానూ 'మామి' బాధ్యతల నుంచి తప్పుకున్నట్టు కిరణ్ రావు తెలిపింది. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ 'మామి ఫెస్టివల్ నిర్వహణకు మా బోర్డు ట్రస్టీకి దీపికా చాలా సహకారం అందించింది. ఆమె అద్భుతంగా పని చేయగలదు. ఈమె ఆధ్వర్యంలో అకాడమీ మరింత శక్తివంతమై సినిమా రంగానికి ఎక్కువ సేవలు అందుతాయి. చైర్మన్‌గా ఆమె ప్రయాణానికి నా మద్దతు ఉంటుంది' అని పేర్కొంది. దీపికా మాట్లాడుతూ 'ఇదొక గొప్ప గౌరవం, అంతకంటే ముఖ్యమైన బాధ్యత. మామి విజన్ ఏమిటో నాకు తెలుసు. సినిమా ప్రేమికులు, క్రియేటర్స్ ఆశలను నెరవేర్చేవిధంగా పని చేయడానికి నిర్ణయిం చుకున్నాం' అని అన్నారు.

# క్రికెటర్ శ్రీకాంత్‌గా చేసేది దేవరకొండ కాదు..జీవా



విజయ్ దేవరకొండ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నాడని అనుకున్నారు అంతా. కానీ ఆయన అడిగిన పాత్ర ఇవ్వకపోవడంతో ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నాడు మన'అర్జున్ రెడ్డి' హీరో. ఈ పాత్రను తమిళ హీరో జీవా చేస్తున్నాడు. బాలీవుడ్‌లో రణవీర్ సింగ్, దర్శకుడు కబీర్ ఖాన్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం '83'. 1983లో మొదటిసారిగా దేశానికి క్రికెట్‌లో వరల్డ్ కప్‌ను సాధించిపెట్టిన ఆనాటి జట్టు సారధి కపిల్ దేవ్ జీవితం ఆధారంగా రూపొందుతోంది. ఇందులో రణవీర్ సింగ్ కపిల్ దేవ్‌గా నటిస్తున్నాడు. జట్టులో ఒకరైన క్రికెటర్, తమినాడుకు చెందిన కృష్ణమాచారి శ్రీకాంత్‌గా జీవా నటిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాత మధు మంటెన ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. ప్రస్తుతం జీవా శ్రీకాంత్ పాత్ర కోసం ఏడు కిలోలు తగ్గే పనిలో ఉన్నాడట. దీనిలో భాగంగా క్రికెటర్ చందు బోర్డర్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ పాత్ర కోసం ముందు విజయ్ దేవరకొండను అనుకున్నారు. ఆయన కూడా చేసేందుకు ఆసక్తి చూపాడు. అయితే విజయ్ మొదట నుంచీ శ్రీకాంత్ పాత్రే ఇవ్వాలని చెబుతూ వచ్చాడు. కానీ చిత్రబృందం ఆ పాత్రను జీవాతో చేయించాలని భావించిన నేపథ్యంలో ఆ ప్రాజెక్టు నుంచి విజయ్ తప్పుకున్నాడు. ఈ చిత్రానికి విజయ్ సంతకాలు చేయలేదని, అతనికి వేరే కమిట్‌మెంట్స్ ఉండడం వల్ల ఈ చిత్రంలో చేయడం లేదని చెప్పింది.



# మెప్పించినవి తక్కువే

ఆశల వంతెనపై నిర్మించిన చిత్రాలు కొన్ని ఆశించిన ఫలితాలు ఇస్తాయి. కథా కథనాలు కుదరనివి, కొత్తగా అనిపించనివి బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడతాయి. ఈ ఫలితాలు ప్రతి శుక్రవారం ఇండస్ట్రీలో కనిపిస్తుంటాయి. జనవరిలో విడుదలైన చిత్రాల్లో బాలీవుడ్‌లో మూడు, తెలుగు చిత్రసీమలో ఒక చిత్రం ప్రేక్షకులను మెప్పించింది. అదీ తక్కువ బడ్జెట్‌తో తీసిన సినిమాలే కాసులు కురిపించడం ప్రత్యేకత. నెలంతా కొత్త చిత్రాలు వచ్చినా బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాల వేగాన్ని తగ్గించలేకపోయాయి.



ఎఫ్2

తెలుగు చిత్రసీమకు సంక్రాంతి అనేది ఓ గొప్ప పండగ. ఈ వేడకకు సినిమా విడుదల చేయాలని తెగ ఆరాట పడిపోతూ ఉంటారు. ఏటాలాగే ఈ ఏడాదీ మూడు సినిమాలు వచ్చాయి. అందులోనూ భారీ అంచనాలతో వచ్చిన చిత్రాలు నాలుగు. వాటిలో 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'వినయ విధేయ రామ', 'మిస్టర్ మజ్ను' ఉన్నాయి. ఈ సినిమాల్లో ఏ ఒక్కటీ ఆయా చిత్ర యూనిట్లు ఆశించిన ఫలితాలు రాలేదు. సంక్రాంతికి విడుదలైన 'ఎన్టీఆర్ కథానాయకుడు' పంపిణీదారులను తీవ్రంగా ముంచేసింది. సుమారుగా 60శాతం నష్టాలు తెచ్చిపెట్టింది. తర్వాత వచ్చిన 'వినయ విధేయ రామ' సినిమా మంచి రివ్యూలు రాబట్టుకోలేకపోయినా పెట్టిన ఖర్చు వచ్చేసినట్టే తెలుస్తోంది. ఇక తాజాగా వచ్చిన అఖిల్ చిత్రం 'మిస్టర్ మజ్ను' తీవ్రంగా నిరాశ పరిచింది. పెట్టిన పెట్టుబడి అయినా రాబట్టుకునేందుకు చిత్రబృందం థియేటర్ల టూర్ పట్టి ప్రమోషన్ చేపడుతుంది. ఎటువంటి అంచనాలూ లేకుండా వచ్చిన చిత్రం 'ఎఫ్2'కు ప్రేక్షకాదరణ మొండుగా ఉంది. ఏకంగా రూ. వంద కోట్ల మార్కును దాటేసింది. ఈ సినిమా విజయం ఈ చిత్రం బృందంలో అందరికీ బూస్ట్ ఇచ్చినట్టు అయింది. ఛాన్సులు కోసం నిరీక్షిస్తున్న తమన్నాకు, మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్న మెహరీన్‌కు ఈ విజయం కలిసొచ్చింది. ఈ సక్సెస్ తర్వాత తమన్నా వివాహం కోసం వరుడ్ని వెతికే పనిని కూడా వాయిదా వేసుకోవాలని తన తల్లిదండ్రులకు చెప్పిందని ప్రచారం జరుగుతుంది. మళ్లీ కెరీర్‌పైనే దృష్టి పెడతానని చెప్పేసిందట. 'అంతరిక్షం' ఫ్లాప్‌తో బాధపడుతున్న వరుణ్ తేజ్‌కు వెంటనే విజయం రావడం ఆ బాధ నుంచి బయటపడేసింది. వెంకటేశ్‌కు ఎలాగూ కలసొచ్చినట్టే.



మణికర్ణిక

బాలీవుడ్‌లో రణవీర్ సింగ్ హీరోగా వచ్చిన 'సింబ' తిరుగులేని విజయాన్ని అందించింది. కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్ బ్యానర్‌లో రోహిత్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కింది. తెలుగు చిత్రం 'టెంపర్'లో కొన్ని సన్నివేశాలను ఈ సినిమా కోసం తీసుకున్నారు కూడా. ఈ చిత్రం మొదటి రోజే రూ.20.72 కోట్లు కలెక్ట్ చేసింది. ఇప్పుడు రూ.239.59 కోట్లు రాబట్టి విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. ఈ సినిమాతో రోహిత్ శెట్టి, రణవీర్ సింగ్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు వరుసగా రూ.100కోట్లు సాధించిన ఎనిమిదోదిగా నిలిచింది.ఐదోవారంలో కలెక్షన్లు తగ్గాయి. ఆ సమయంలో 'ఉరి' చిత్రం రావడంతో ఈ సినిమాపై ప్రభావం పడింది. 2016లో 'ఉరి' సైనిక శిబిరంపై పాకిస్తాన్ ఆకస్మిక దాడులు నిర్వహించింది. ప్రతిదాడిగా ఇండియన్ ఆర్మీ సెర్జికల్ దాడులు చేపట్టింది. ఈ నేపథ్యంపై రూపొందిన చిత్రమే 'ఉరి'. విక్కీ కౌసల్, యామి గౌతమ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రారంభంలో కలెక్షన్లు రూ.8.20 కోట్లతో మొదలు పెట్టి నెమ్మది పుంజుకుంది. ఇప్పటికి 160.23 కోట్లు వసూలు చేసింది. కేవలం రూ.28కోట్లతో రూపొందిన ఈ సినిమా ఐదు రోజుల్లో రూ.50కోట్ల బెంచ్ మార్కును దాటేసింది. తర్వాత ఐదు రోజుల్లో రూ. 100కోట్లను వసూలు చేసింది. ఈ సినిమా సమయంలో వచ్చిన 'యాక్సిడెంట్ ప్రైమ్‌మినిస్టర్' ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఇటీవల విడుదలైన 'మణికర్ణిక' చిత్రం మంచి వసూళ్లను రాబడుతోంది. ఝాన్సీ రాణి జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం రూ.50 కోట్లకు చేరువులో ఉంది. ఇప్పటికే రూ.47.65 కోట్లు కురిపించింది. ఇదంతా నాలుగు రోజుల్లోనే సాధించింది. బాలథాక్రే జీవితం ఆధారంగా వచ్చిన 'థాక్రే' చిత్రానికీ మంచి ఆధారణే లభిస్తున్నా, వసూళ్ల విషయంలో 'మణికర్ణిక'కు అధిగమించలేదు. ఈ రెండు చిత్రాలూ ఒకే రోజు విడుదలైనా 'థాక్రే' ఇంకా రూ.22.90కోట్ల వద్దే ఉంది. వీటితో పాటు వచ్చిన గోవింద చిత్రం 'రంగీలా రాజా', రాధికా ఆప్టే సినిమా 'బొంబారియన్', అర్షాద్ వారిస్ మూవీ 'ఫ్రాడ్ సైయాన్' కూడా ప్రేక్షకుల మెప్పును పొందలేకపోయాయి.



సింబా



ఉరి

# తెలుగులోకి రెజ్లింగ్ స్టార్ ఖలీ



ప్రముఖ రెజ్లింగ్ స్టార్ ది గ్రేట్ ఖలీ(దిలీప్ సింగ్ రాణా) టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధం అయ్యాడు. జయంత్ సి పరాన్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నరేంద్ర' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించబోతున్నాడు. ఇప్పటికే పలు హాలీవుడ్ సినిమాల్లోనూ, అమెరికన్ టీవీ షోల్లోనూ మెప్పించిన ఖలీ 'బిగ్ బాస్ సీజన్4'లో కూడా కనిపించి అభిమానులను అలరించాడు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నీలేష్ ఎటి, ఇజబెల్లా జంటగా నటిస్తున్నారు. ఇండియా పాకిస్థాన్ నేపథ్యంతో సినిమా రూపొందనుండడంతో ఇస్లామిక్ దేశంలో చిత్రీకరణ జరిపేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ రామ్ సంపత్ తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఇషాన్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాని నిర్మిస్తుంది.

# ఈశ్వర్ ఎనర్జీ లెవల్స్ బాగున్నాయి

## '4 లెటర్స్' ఆడియో ఆవిష్కరణలో ఎస్వీ కృష్ణారెడ్డి



ఈశ్వర్‌ని కథానాయకుడిగా పరిచయం చేస్తూ, శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన సినిమా '4 లెటర్స్'. కుర్రాళ్లకి అర్థమవుతుందిలే అనేది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లుగా నటించారు. ఆర్. రఘురాజ్ దర్శకత్వం వహించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ సినిమా ఆడియో ఫంక్షన్ బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత 'జెమిని' కిరణ్ ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ సంస్థ లోగోను విడుదల చేశారు. దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమా న్యూ ట్రైలర్ విడుదల చేశారు. నిర్మాత అచ్చిరెడ్డి, ఎస్వీ కష్ణారెడ్డి సీడీ విడు ఎస్వీ కష్ణారెడ్డి మాట్లాడుతూ 'సినిమా సాంగ్స్ చూస్తే హీరో ఎనర్జీ లెవల్స్ బాగున్నాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోతే ఓ కుర్రాడు చదువులో ఎలా పైకి రాడో... అలాగే ఓ వృత్తిలో కూడా పైకి రాలేడు. ఈశ్వర్‌కి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండబట్లే తెరపై హీరోగా వస్తున్నాడు' అని అన్నారు.



## 'అక్కడొకడుంటాడు' గీతావిష్కరణ

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రూపొందిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. హీరో హీరోయిన్లుగా రామ్ కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం. లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె. శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించారు. ప్రీ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు వల్లభనేని జనార్దన్ ఆడియోసీడీని ఆవిష్కరించి సి. కళ్యాణ్‌కు అందజేశారు. అనంతరం కల్యాణ్ మాట్లాడుతూ మందుబాబులు అర్ధరాత్రిలో కార్లు నడుపుతూ చేసే ఆగడాల వల్ల జరిగే అనర్థాలను ఇందులో చూపించారని, సినిమా చూస్తున్నంతసేపూ థ్రిల్ ప్రేక్షకులకు కలిగించే చిత్రమిద'ని అన్నారు.

# అసోసియేట్ డైరెక్టర్ అనసూయ



అనసూయ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'కథనం'. సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో రూపొందుతోన్న ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. ది మంత్ర ఎంటర్‌టైన్మెంట్స్, ది గాయత్రి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తోంది. బి.నరేంద్రరెడ్డి, శర్మచుక్కా నిర్మాతలు. రాజేష్ నాదెండ్ల దర్శకుడు. టాకీ చివరిరోజు చిత్రీకరణ రామానాయుడు స్టూడియోలో జరుగుతోంది. ఈ చిత్రంలో అనసూయ అసోసియేట్ డైరెక్టర్ పాత్రలో నటిస్తోంది. సమ్మర్‌లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు.

www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

# సంగమం



**శాస్త్రీయ నాట్యకళల్ని వంటబట్టించుకోవడం అంత సులభమైన విషయం కాదు. అందుకు చాలానే కృషి జరగాలి. ఏళ్ళ తరబడి సాధనలో మునిగితేలితేగానీ జీవితంలో నాలుగు పదనర్తనలు అబ్బవు. ఎందుకంటే భారతీయ నాట్యకళలకున్న బిగువు అలాంటిది. దక్షిణాదిన ప్రాచుర్యంగల భరతనాట్యం, కూచిపూడి నాట్యకళలూ అలాంటివే. అభిరుచికో, గుర్తింపుకోసమో.. కొంతకాలంపాటు ఏదైనా నాట్యకళను నేర్చుకోవాలనుకుంటే.. అందులో పెద్దగా పరిణత దక్కదు. మనసునిండా ఆ కళను ఆహ్వానించుకుంటూ.. అందుకుతగ్గ సాధన చేస్తేనే.. అంతో ఇంతో రాణించగలం. అలాంటి పట్టుదలతో, నియమ, నిబద్ధతగల సాధనతో, ఉద్దండ గురువు పర్యవేక్షణలో భరతనాట్య కళలో రాణిస్తున్నారు నర్తకి సౌజన్య శ్రీనివాస్. ఇటీవల విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో హైదరాబాద్ 'సంగమం' ఫౌండేషన్ నిర్వహించిన సౌజన్య నృత్యవిభావరి ఆసాంతం కళాప్రియుల మెప్పు పొందింది. ఆ నాట్యకళా విశేషాలు..**

## పరిణిత నాట్యప్రతిభా.. సౌజన్యం



క్రమేణా.. సంప్రదాయ నాట్యకళా ప్రదర్శనలు అరుదవుతున్నాయి. ఇందుకు కారణాలు చాలానే ఉన్నాయి. ఆధిపత్య మీడియాల ప్రాబల్యంతో శాస్త్రీయ కళలకు ఆదరణ, పోషణ తగ్గడంతోపాటు, సంప్రదాయ కళపట్ల ఆసక్తి, అనురక్తి కలిగి ఆయా కళల్లో విద్య నేర్వాలి అనుకునే తరమూ అరుదవుతుంది. ఈ క్రమంలో సంప్రదాయ కళాప్రదర్శనల సందర్భాలూ పరిమితంగానే కనిపిస్తున్నాయి. అక్కడక్కడ ఒకటీ అరా జరుగుతున్నా.. అరకొర సౌకర్యాలతోనే అంటే, తెర వెనుక నేపథ్యం సంగీతానికి అనుగుణంగా (ఆడియో ట్రాక్స్ ఆధారంగా) మాత్రమే ఆయా నాట్య ప్రదర్శనలు ఆడే పరిస్థితి ఏర్పడుతుంది. కానీ సౌజన్య నృత్యవిభావరి మాత్రం.. పరిపూర్ణమైన రంగాలంకరణ, ప్రత్యక్ష సంగీతాన్ని మేళవించుకుని రసరమ్యంగా సాగింది. కావ్యేషు నాటకం రమ్యం అనే స్థానే 'కావ్యేషు నాట్యం రమ్యం' అన్నట్టుగా సౌజన్య నృత్యవిభావరి రసజ్ఞుల్ని ఆకట్టుకుంది.

### పట్టు.. బిగువుగల నర్తనం

ముందే అనుకున్నట్టు.. ఏ నాట్యమైనా కళాకారుల సాధనబట్టే..వారి కళా ప్రదర్శన ఆధారపడి ఉంటుంది. నర్తకుల నాట్యప్రతిభేమిటో తెలుసుకోవాలంటే పదినిముషాల పాటు వారి నాట్యం చూసి చెప్పేయొచ్చంటారు కళావిమర్శకులు. ఇది అక్షర సత్యం. ఏకబిగువున.. సుమారు రెండు గంటలపాటు నృత్యవిభావరిలో ఏకవ్యక్తీ ప్రదర్శనగా నర్తించడం అంటే మాటలు కాదు. ఎంతో సాధన, కృషి అవసరం. నర్తకి సౌజన్య నృత్య ప్రదర్శన తీరులో ఆద్యంతం అలాంటి నాట్య ప్రమాణాలు కనిపించాయి. విభావరిలోని అంశాలకు అనుగుణంగా, సంగీత, సాహిత్యానికి తగ్గట్టుగా అభినయాన్ని సమపాళ్లలో పండిస్తూ, బిగువైన, చురుకైన పాదముద్రలు, నాట్యగణాంకాలకు తగ్గట్టుగా శరీరాభినయ పదపుష్టితో నర్తకి సౌజన్య చేసిన ప్రదర్శనకు కళావిమర్శకులు సైతం జేజేలు పలికారు.

గురు, దైవ నివేదనాంశాలతో సంప్రదాయబద్ధంగా ప్రారంభమైన నృత్యవిభావరి రామాయణం, భాగవత అంశాల్లోని ముఖ్యఘట్టాలను స్పృశిస్తూ, ఆఖరిగా భగవద్గీత సారాన్ని ఆవిష్కరిస్తూ ముగిసింది. నర్తకి సౌజన్యకు నాట్యశిక్షణ ఇస్తున్న, సుప్రసిద్ధ నాట్యగురువు పసుమర్తి రామలింగశాస్త్రి స్వయంగా నట్టువాంగం నిర్వహించగా.. గాత్రం డిఎస్‌వి శాస్త్రి, పసుమర్తి పద్మ. ఆర్.శాస్త్రి, మృదంగం రాజగోపాలాచారి, వయోలిన్ దినకర్, ఘటం చంద్రకాంత్, వేణువు విబిఎస్ మురళి సంగీత సహకారం అందించారు. రంగాలంకరణ రవీందర్‌రెడ్డి, ఆహార్యం సురేష్, కాస్ట్యూమ్స్ కృష్ణ, విద్యుతలంకరణ సురభి కిషోర్ సమకూర్చారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సినీనటులు సునీల్ అతిథులుగా హాజరై, నర్తకి నాట్య ప్రదర్శనలోగల పరిణితని కొనియాడారు. 'సంగమం' ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజయ్‌కిషోర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, సుమధుర కళానికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి భాస్కరశర్మ స్థానిక నిర్వహణ సహకారం అందించారు.




### గృహిణిగా.. నర్తకిగా

నర్తకి సౌజన్య ఎవరోకాదు, ప్రముఖ సినిమా దర్శకుడు, కథామాటల రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణే. అలాగే గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి కూతురు వరుస. సౌజన్యకు చిన్నతనంలో నాట్య, సంగీత కళలపై అభిరుచి ఉన్నాగానీ అభ్యసించడం వీలుకాలేదు. వివాహానంతరం, ఇద్దరు పిల్లలకు తల్లి అయ్యాక.. తిరిగి తనకు ఎంతో ఇష్టమైన నాట్యకళను (భరతనాట్యం) అభ్యసించడం మొదలెట్టారు. అలా పట్టుదలతో, క్రమం తప్పని సాధనతో కళను అభ్యసించి.. తక్కువ కాలంలోనే గురువు, కుటుంబ ప్రోత్సాహంతో పూర్తిస్థాయి ప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదిగారు. నాట్యంతోపాటు ప్రస్తుతం శాస్త్రీయ సంగీతంలోనూ తర్ఫీదు పొందుతున్నారు సౌజన్య. పరిణిత చెందిన నాట్యప్రతిభ, ప్రమాణాలతో భరతనాట్యకళలో ప్రత్యేకతను చాటుకుంటున్న నర్తకి సౌజన్యాశ్రీనివాస్ భవిష్యత్తులోనూ ఇదే నాట్యచైతన్యాన్ని కొనసాగిస్తూ అగ్రేసర కళాకారిణిగా రాణించాలని ఆశిద్దాం!!

**- గంగాధర్ వీర్ల**

**ఫొటోలు : జి.ఎల్. రవిశంకర్**

## సంస్కృతిపై ఓ సమగ్ర వీక్షణం




సంస్కృతి అంటే సమిష్టి జీవన విధానం. సంస్కారవంతమైన కృషి. మానవ జీవితాన్ని హేతుబద్ధంగా, అభ్యుదయకరంగా నడిపించడమే పురోగామి సంస్కృతి అవుతుంది. మానవీయ ప్రజాస్వామ్య సామాన్య ప్రజల సంస్కృతి ఒకటి కావని, శ్రమైక జీవన సౌందర్యం గల ప్రజా సంస్కృతిని నిర్మించడం కళాకారుల కర్తవ్యమని డా॥ వకుళాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. ఒకానొక కాలంలో ఒకానొక స్థలంలో ఎవరు నివసిస్తారో వారే వారి సంస్కృతిని నిర్మించుకుంటారు తప్ప, కొందరు అంటున్నట్టు అన్నీ పూర్వమే నిర్మించి ఉంటాయని చెప్పడం శుద్ధ అబద్ధమని డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సమస్త ప్రజాస్వామిక సాంస్కృతిక భావజాలాన్ని కృషిని మిగుల్చుకుంటూనే సంస్కృతిలో మానవులందరికీ సమాన హక్కులు ఉంటాయి. అలాగాక సంప్రదాయం ముసుగులో కొందరు ఇతరుల హక్కులను కాలరాస్తూ ఆధిపత్యం కొనసాగించాలని అనుకుంటే అది తిరోగామి సంస్కృతి అవుతుంది.

మన రాజ్యాంగం ప్రకారం చట్టం దృష్టిలో అందరూ సమానులే! ఎవరూ ఎక్కువ కాదు ఎవరూ తక్కువ కాదు. ఆ ప్రాతిపదికనే సుప్రీంకోర్టు శబరిమలై ఆలయంలోకి పురుషులతో పాటు స్త్రీలకూ ప్రవేశార్హత ఉందని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసే నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సంఘీభావంగా దాదాపు 50 లక్షల మంది మహిళలు మానవహారం నిర్మించారు. కులమతాలకు అతీతంగా, లింగవివక్షకు అంతం పలకాలనే పంతంతో జనవరి 1న కేరళలో జరిగిన ఈ మానవహారం యావద్భారత దేశాన్నేగాక ప్రపంచాన్నే ఓ కుదుపు కుదిపింది. ఇదో మానవ సాంస్కృతిక ముందడుగు.

ఈ బాటలో మనం నడవాలని 'సంస్కృతి' (సంక్షోభాలు – సంవాదాలు వ్యాస సంకలనం) పుస్తకంపై జరిగిన చర్చలో వక్తలు పేర్కొన్నారు. గత ఏడాది రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవిచే ఆవిష్కృతమైన ఈ పుస్తకంపై ఇటీవల కాకినాడలో చర్చ జరిగింది. శాంతారావు, రావు కృష్ణారావు, రామకృష్ణ, కట్టా కృష్ణారావు ప్రభృతులు మాట్లాడారు. గౌరవ్ సంపాదకత్వంలో వెలువడిన ఈ పుస్తకంలో 20 మంది ప్రముఖుల వ్యాసాలు ఉన్నాయి.

'మనిషి నాగరికత అతని అసహనంలో తెలుస్తుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సమున్నతంగా ఇముడ్చుకునే సమాజం మాత్రమే మానవీయ సంస్కృతికి ప్రతిబింబమవుతుంది' అని గౌరవ్ 'ప్రస్తావన'లో పేర్కొన్నారు. రచయితలు, కళాకారులు, మేధావులు, విమర్శకులు మరింతగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుని, ధైర్యాన్ని పుంజుకుని అరాచకత్వాన్ని ప్రశ్నించడానికి ప్రజాస్వామ్య తత్వాన్ని నిలబెట్టడానికి ఈ పుస్తకం ఓ పనిముట్టు అవుతుందని విద్యావేత్త చిరంజీవిని కుమారి ముందుమాటలో పేర్కొన్నారు. 'సమాజాభివృద్ధి క్రమంలో పెంపొందించుకున్న భావాలు, నైపుణ్యాలు, విలువలే సంస్కృతిగా గుర్తించబడతాయని డాక్టర్ చెలికాని స్టాలిన్ 'ఒక మాట'గా వివరించారు.

నిర్హేతుకమైన అభిప్రాయాల్ని ఏ హోదా గల వ్యక్తైనా ఇతరులపైనా, సమాజంపైనా బలవంతంగా రుద్దితే నిర్ద్వంద్వంగా ఖండించాల్సిందేనని కట్టా కృష్ణారావు తెలుపగా, సంస్కృతి అనేది భావ సంస్కరణకు సంబంధించిన పదమే తప్ప ఆచార సంప్రదాయాలకు వేషభాషలకు చెందినవి కానేకాదని రావిపూడి వెంకటాద్రి స్పష్టం చేశారు. మార్కెట్ ఆధారంగా పెరిగే మానవ సంబంధాలు, వ్యక్తుల ప్రవర్తనా విధానాలు అరాచక సంస్కృతిని పెంచి పోషిస్తాయని ఆచార్య కె.కె రంగనాథాచార్యులు విశదీకరించారు.

సంస్కృతి ఏకశిలా సదృశం కాదని, సమాజంలో ఉన్నత వర్గాల, మానవాళిని విచ్ఛిన్నం చేసే లేదా పక్కదారి పట్టించే హింసాయుత అరాచక సంస్కృతిని ప్రతిఘటించాలని దివికుమార్ తన వ్యాసంలో పేర్కొన్నారు. సాంస్కృతిక పరాయీకరణ ఈనాటి ప్రధాన సవాలు అని, దానిని తిప్పికొట్టేందుకు ఐక్యంగా కృషి చేయాల్సిన బుద్ధిజీవులు సైతం భిన్నత్వాన్ని ఆహ్వానించలేక స్వాతిశయంతో వేరు కుంపట్లగా వ్యవహరించడమే పెద్ద ప్రమాదమని గౌరి తెలిపారు. నిజానికి 'సైన్స్ – సంస్కృతి అంటేనే సత్యాన్వేషణ అని, రాగద్వేషాలు లేకుండా వాస్తవాలు అంగీకరించి, ముందడుగులు వేయడమే ఉత్తమ సంస్కృతి అని డా॥ నాగసూరి వేణుగోపాల్ తెలిపారు. ఈ నేల మీద పురాణాలు, స్మృతుల సారం ఏమంటే... శ్రమ చేయని వర్గం ఆధిపత్యం కొనసాగుతూనే ఉండాలి. శ్రామికవర్గం ఏరకంగానూ ఆధిపత్యవర్గాలను ప్రశ్నించరాదని ఆచార్య జయధీర్ తిరుమలరావు పేర్కొన్నారు.

అసలైన జీవితావసరాల్ని గుర్తించి, దానిని సాధించే ప్రయత్నంలో స్వేచ్ఛ అనే పదం సార్థకమవుతుంది తప్ప అర్థరహిత వ్యక్తీకరణ స్వేచ్ఛకాబోదని డా॥పాపినేని శివశంకర్ విశ్లేషించారు. మార్కెట్ శక్తులకు, సామాజిక సంస్కృతికి మధ్య నిరంతరాయంగా వైషమ్యం కొనసాగుతుందని, సంస్కృతిని తారుమారు చేసి, దానిని ఆర్థిక ఆధిపత్య వాహకంగా మార్చడం మార్కెట్ శక్తులకు తప్పనిసరి అవసరంగా ముందుకొస్తుందని, ప్రజాస్వామిక శక్తులు విధిగా దానిని ప్రతిఘటిస్తాయని సాంస్కృతిక కార్యకర్త దేవి తెలిపారు. డా॥ మలయశ్రీ, కె.అయన్న, అరణ్య, కీ.శే.నార్ల, కొడవటిగంటి, చలసాని ప్రసాద్, బాలగోపాల్, యాసలపు సూర్యారావు ప్రభృతుల వ్యాసాలతో పాటు బాలగంగాధర తిలక్ 'మన సంస్కృతి' కవిత కూడా చోటుచేసుకుంది ఈ పుస్తకంలో.

రాజ్యం బరితెగించి ఆధిపత్యం కోసం మూకోన్మాద దాడి సంస్కృతిని ముందుకు నెడుతోంది. దబోల్కర్, పన్సారి, కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి సత్యశోధకులను హత్యలు చేయిస్తుంది. సంస్కృతిలో రాజకీయం భాగం తప్ప రాజకీయంలో సంస్కృతి భాగం కాదు. సంస్కృతి ఓ ప్రజాస్వామిక నిర్మాణం. ఆ ప్రజాస్వామిక సంస్కృతి ద్వారానే ఏ సవాలునైనా ధీటుగా ఎదుర్కోగలం అని ఈ వ్యాసాల్లో మనకు అంతర్లీనంగా అవగతమవుతుంది.

**- కె శాంతారావు**
**9959745723**

## బారిస్టర్ పార్వతీశం – ఒక 'ప్రయోగం'

నాటకం



కొన్ని శతాబ్దాలుగా నాటక ప్రక్రియ ఉత్థాన పతనాలు జరుగుతూనే ఉన్నాయి. సినిమా, ఆ తర్వాత టీవీ వల్ల నాటకరంగం పూర్తిగా పతనమయ్యే దుస్థితి దగ్గర పడిందని గ్రహించిన ఎందరో మహామహులు ఈ ప్రక్రియ పరిరక్షించాలనే ప్రయత్నాలు చాలా చేస్తున్నారు. నాటకం ఎంపికలోనూ, ప్రదర్శన విధానంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. పౌరాణిక పద్య నాటకాలతోపాటు సాంఘిక నాటకాలు, హాస్య నాటికలు వచ్చాయి. అంతేకాక ఐరోపా, అమెరికా, ఇతర ఆసియా దేశాల్లో జరిగే కొన్ని మార్పులను మన నాటక రంగం అందిపుచ్చుకుంది. మన దేశంలోనే కన్నడ, మరాఠ నాటక రంగాల్లో ఎన్నో ప్రయోగాలు జరిగాయి. ఇవి ఈ మధ్యే మన ఆంధ్రదేశం చేరుకున్నాయి. 'సురభి' నాటక సంస్థవారు తమ జీవితాలను నాటకానికి అంకితం చేసి, సాంకేతికంగా కూడా రంగస్థలంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారు.

ఈ నేపథ్యంలో రాజస్థాన్ విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ తూము శివప్రసాద్ గారు 'ప్రయోగం' అనే సంస్థని ప్రారంభించి తెలుగు నాటకాలను ఇప్పటి తరం మెచ్చేలా, నవీన, ఆధునిక వాదం, భావవ్యక్తీకరణ వాదం ఉపయోగించి, నాటకం రూపొందించి, ప్రదర్శనలు మొదలుపెట్టారు. ఈ పంథాలో 'కన్యాశుల్కం' నాటకాన్ని కూడా ప్రదర్శించారు. అయితే ఇందులో భాషాపరంగానే మార్పు తెచ్చారు. కథనంలో ప్రయోగం చేయలేదు. దీనికి ఇంకో అడుగు ముందుకు వేసి, హాస్య ప్రధానంగా ప్రసిద్ధికెక్కిన 'బారిష్టరు పార్వతీశం' నవలను శివప్రసాద్ ఎంచుకున్నారు.

మొక్కపాటి నరసింహ శాస్త్రి గారు 1924లో 'బారిష్టరు పార్వతీశం'ను మూడు భాగాల నవలగా రచించారు. ఇందులో మొదటిభాగం హాస్య ప్రధానమై, ఎక్కువ ప్రాచుర్యం పొంది.. తెలుగు సాహిత్య ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. నరసింహ శాస్త్రి పార్వతీశం గురించి రాస్తూ అతని జీవన ప్రయాణంలో ఆయన స్వీయానుభవాలు, విదేశాల్లో ఇతర భారతీయుల అనుభవాలను పొందుపరిచారు. ఇందులో హాస్యం సున్నితంగా సంఘటనా పరంగా ఉంటుంది. పూర్తిగా అభివృద్ధి చెందని పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు అనే కుగ్రామం నుంచి పార్వతీశం తన తల్లిదండ్రులకు చెప్పకుండా తనకు పరిచయమున్న వారి దగ్గర డబ్బులు తీసుకుని లండన్‌కి ప్రయాణమవుతారు. ప్రయాణానికి కావాల్సిన సామాన్లలో నరసరావుపేట మడత మంచం, గొడుగు, కచ్చిక, మరచెంబు, సీవారేకు పెట్టె వంటివి సమకూర్చుకుంటాడు. ఇందులో అతని అమాయకత్వం నవ్వు తెప్పిస్తుంది. రైల్వేస్టేషనులో టిక్కెట్టు తీసుకోవడం, రైలు బ్రేక్‌చైనుకి సామాను కట్టేయడం లాంటి తప్పిదాలు అతనిని ఇబ్బందిపెడ్తాయి. చెన్నపట్నం, అటునుంచి కొలంబో షిప్‌లో అతని అనుభవాలు ఆసాంతం నవ్వు తెప్పిస్తాయి. లండన్ చేరడంతో కథ పూర్తవుతుంది. రెండు, మూడు భాగాల్లో పార్వతీశం లండన్ అనుభవాలు, లండన్‌లో నివాసం, కష్టపడి బారిష్టరు చదివి స్వదేశానికి తిరిగిరావడం, ఇక్కడ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం జరుగుతుంది. స్వాతంత్ర్యానంతరం అతనికి గుర్తింపు రావడంతో కథ ముగుస్తుంది.

ఈ మూడు భాగాలను 90 నిమిషాల నిడివితో శివప్రసాద్ నాటకీకరించారు. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి నాటకం రక్తి కట్టించారు. ఈ సాంకేతిక సహాయంతో రైలు రాకపోక, వర్షం, చార్లీచాప్లిన్ సినిమా, ప్రపంచయుద్ధం అన్నీ స్క్రీన్ మీద ప్రదర్శించగలిగారు. ఇందులో పార్వతీశం పాత్రను శివప్రసాద్ పోషించారు. మిగతా అన్ని పాత్రలు కోరస్‌గా అయిదారుగురు పాత్రధారులు నటించారు. పాత్రకు అనుగుణంగా దుస్తులు మార్చడం, వేగంగా సెట్టింగులు ఏర్పాటు చేయడంతో నాటకం వేగంగా ముందుకు సాగింది.

పార్వతీశం ఉపనయనంతో నాటకం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి పార్వతీశం కథను వేగంగా తెలియజేస్తూ చెన్నపట్టణానికి టిక్కెట్టు తీసుకొనే ప్రయత్నంతో నాటకం మొదలవుతుంది. టిక్కెట్టు కోసం ఊరుపేరు చెపితే తల్లిదండ్రులకు ఎక్కడ తెలుస్తుందో అని భయపడతాడు. చివరికి తప్పక తను వెళ్ళాల్సిన స్టేషన్ పేరు చెపుతాడు. పార్వతీశం అమాయకత్వం ప్రేక్షకులకు పూర్తిగా తెలుస్తుంది. చెన్నపట్నంలో కుక్ ట్రావెల్స్‌లో వాళ్ళ సహాయం తీసుకుని, కొలంబో చేరి అటునుంచి లండన్ చేరతాడు. ఈ ప్రయాణంలో అతని అమాయక అనుభవాలన్నీ మనకు నవ్వు తెప్పిస్తాయి. లండన్‌లో అతను వివక్ష చవిచూస్తాడు. ఇవన్నీ అధిగమించి, చదువుకుంటాడు. అక్కడ ఐరిష్ యువతి పరిచయమవుతుంది. ఆ స్నేహం ప్రేమగా మారే లోపల యుద్ధం రావడం, ఆ జీవిత గమనంలో సంస్కృతి విభేదాలు అతని స్పష్టంగా గోచరించడంతో తన స్నేహానికి స్వస్తి పలుకుతాడు. తన దేశం తిరిగిరావడం, వెంటనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, జైలుకు వెళ్ళడం, స్వాతంత్ర్యం రావడంతో అతనో ప్రముఖ వ్యక్తిగా మారిపోవడం జరుగుతుంది. ఎక్కువ మంది పాత్రధారులు లేకుండా ఒక ఆరుగురితో కోరస్ గ్రూప్, వివిధ పాత్రలు ధరింపజేశారు. అయితే నాటక ప్రారంభకాలం 1925 కావడం, ఆ కోరస్‌లో స్త్రీ పాత్రలు ఉండడం, వారు ఆధునిక దుస్తులు ధరించడం... చూపిన కాలానికి అనుగుణంగా లేదు. అయితే కొద్ది నిమిషాల్లో అది ఆధునిక నాటక ప్రక్రియలో ఒక ప్రయోగంగా అర్థమవుతుంది. పార్వతీశం పాత్రని డా॥ తూము శివప్రసాద్ చాలా సమర్థవంతంగా పోషించారు. స్పష్టమైన ఉచ్ఛారణ, మంచి వాచకంతో ప్రతి కథనం జరుగుతుంది. ఐరిష్ యువతిగా నటించిన గరియాకు తెలుగు భాష రాకపోయినా తన నటనతో ఆ పాత్రకు తగిన యాసతో ప్రేక్షకులను మెప్పించారు.



ఈ నాటకంలో సాంకేతిక సహాయం చాలా ముఖ్యమైనది. బాపట్లకు చెందిన నరేష్ లైటింగ్, తెనాలికి చెందిన చందు వేమన డిజిటల్ పోజెషన్, సంగీతం జైపూర్‌కి చెందిన విద్యార్థి సమకూర్చారు. జైపూర్‌కి చెందిన నోలన్ సీన్లు సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఢిల్లీకి చెందిన దేవరకొండ సుబ్రమణ్యం పార్వతీశం తండ్రి పాత్ర పోషించారు. సాంకేతిక నైపుణ్యానికి, టీం వర్కుకి ఈ నాటకం ఒక తార్కాణంగా చూపగలం. మరిన్ని తెలుగు నాటకాల్లో 'ప్రయోగం' మరిన్ని ప్రయత్నాలు చేయగలరని ఆశిద్దాం.

**- ప్రసూన బాలాంత్రపు**
**9290546089**

# ఫుట్‌బాల్ ఛాంపియన్ ఆంధ్రా వర్సిటీ



**ప్రజాశక్తి - విజయనగరం కోట**

ఎపి సిఎం కప్-2019 ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా ఆంధ్రా యూనివర్సిటీ నిలిచింది. విజయనగరంలోని ఎంఆర్ మైదానంలో బుధవారం మెన్ ఫైనల్ మ్యాచ్ ఆంధ్రా-రాయలసీమ యూనివర్సిటీల మధ్య హోరాహోరీగా సాగింది. చివరివరకు ఎవ్వరు గోల్స్ చేయలేదు. అనంతరం టై బెకర్స్‌లోనూ 5-4 ఒక్క గోల్ తేడాతో రాయలసీమపై ఆంధ్రా యూనివర్సిటీ జట్టు విజయం సాధించింది. మూడు, నాలుగు స్థానాల్లో శ్రీకృష్ణదేవరాయ (అనంతపురం), గీతం (విశాఖ) యూనివర్శిటీలు నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులను ఎయు సిడిసి డీన్ హరిప్రకాష్ అందజేశారు.

# విదర్భ జయ కేతనం

## 7 వికెట్ల తేడాతో ఆంధ్రపై గెలుపు



**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య ఆంధ్ర జట్టుపై విదర్భ జట్టు ఏడు వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఓవర్ నైట్ స్కోరు 140/7తో మూడో రోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌట్ అయింది. ఎ.ప్రణయ్ కుమార్ 17 పరుగులు చేయగా, కె.సాయి తేజ 11 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. విదర్భ బౌలర్‌లలో గులాం ఆలీ 45 పరుగులిచ్చి 4 వికెట్లు, టీకెన్ 59 పరుగులిచ్చి 3, భూటే 61 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించారు. విదర్భ జట్టుకి 147 పరుగుల విజయలక్ష్యం నిర్దేశించబడింది. విదర్భ జట్టు 36.5 ఓవర్‌లలో 3 వికెట్ల నష్టానికి 147 పరుగులు సాధించింది. విదర్భ ఓపెనర్ మండార్ మహలే 58 (45 బంతుల్లో; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పరుగులు చేశారు. ఎ.మోఖడే 13 పరుగులు, వైవి రాథోడ్ 4 పరుగులు చేసి ఔటయ్యారు. బికె నాయుడు 33(97 బంతుల్లో; 6 ఫోర్లు) పరుగులు, నయన్ ఆర్ చవాన్ 26(49 బంతుల్లో; 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టుకి విజయాన్ని అందించారు. ఆంధ్ర బౌలర్‌లలో కె.నితీష్ కుమార్ రెడ్డి 8 పరుగులిచ్చి 2 వికెట్లు, సుబ్రహ్మణ్యం 11 పరుగులిచ్చి 1 వికెట్ దక్కించుకున్నారు. మ్యాచ్‌ను క్రికెట్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సిహెచ్ ప్రతాప్ కుమార్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

# ఇండియా ఎ టెస్టు జట్టులో రాహుల్

**న్యూఢిల్లీ :** ఇంగ్లాండ్ లయన్స్‌తో నాలుగు రోజుల మ్యాచ్‌ల్లో తలపడే భారత్ ఎ జట్టులో కెఎల్ రాహుల్‌కు స్థానం లభించింది. అంకిత్ బాన్వే నాయకత్వంలోని 14 మందితో కూడిన భారత్ ఎ జట్టును బుధవారం ప్రకటించారు. ఇరు జట్ల మధ్య రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7, రెండో మ్యాచ్ ఫిబ్రవరి 13న ప్రారంభం కానున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు కేరళలోని వాయనడ్ ఆతిథ్యం ఇవ్వనుంది. కాగా, ఇరు జట్లు ప్రస్తుతం వన్డే సిరీస్‌ల్లో తలపడుతున్నాయి. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో చివరి వన్డే గురువారం తిరువనంతపురంలో జరుగుతుంది. ఈ సిరీస్‌లో 4-0తో భారత్ పూర్తి ఆధిపత్యంతో ఉంది. భారత్ ఎ టెస్టు జట్టు : అంకిత్ బాన్వే (కెప్టెన్), కెఎల్ రాహుల్, ఎఆర్ ఈశ్వరన్, ప్రియాంక్ పంచల్, రికీ బుయ్, సిద్దేశ్ లాద్, కెఎస్ భరత్ (వికెట్ కీపర్), జలజ్ సెక్సెనా, ఎస్ నదీమ్, మయాంక్ మార్కెండే, నవ్‌దీప్ సైనీ, శర్దూల్ ఠాకూర్, అవేశ్ ఖాన్, వరుణ్ ఆరోణ్.

# కివీస్‌పై క్లీన్ స్వీప్ దిశగా..

1967 నుంచి కివీస్ పర్యటనకు వెళుతున్న టీమిండియా ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే 3-1 తేడాతో అతిపెద్ద సిరీస్ విజయాన్ని 2008-09 పర్యటనలో అందుకుంది. దీంతో చివరి రెండు వన్డేలు టీమిండియా గెలిచి కివీస్‌ను వైట్‌వాష్ చేస్తే టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించనుంది.

- రికార్డు విజయంపై భారత్ గురి
- నేడు నాలుగో వన్డే
- ఉదయం 7.30 ని.ల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో





కెరీర్‌లో 200వ వన్డే ఆడుతున్న రోహిత్



**హామిల్టన్ :** భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య గురువారం నాలుగో వన్డే జరగనుంది. ఐదు వన్డేల ఈ సిరీస్‌ను ఇప్పటికే 3-0తో గెలుచుకున్న టీమిండియా ఈ సిరీస్ క్లీన్‌స్వీప్‌ను చేయడమే లక్ష్యంగా నేటి వన్డేలో బరిలోకి దిగుతుంది. నేటి వన్డేలోనూ విజయం సాధించి న్యూజిలాండ్‌పై రికార్డు విజయం సాధించాలనే పట్టుదలగా ఉంది. కనీసం ఒక్క వన్డే అయినా గెలిచి, మరో వన్డే ఓడిపోయినా 4-1తో కివీస్ గడ్డపై అతిపెద్ద సిరీస్ విజయం అందుకోనుంది. భారత్ జోరు చూస్తుంటే ఇది సునాయసంగానే కనిపిస్తోంది. ఇక ఇప్పటికే ఆస్ట్రేలియా గడ్డపై 72 ఏళ్లగా సాధ్యంకాని టెస్టు సిరీస్ విజయాన్ని కోహ్లి సేన సాధించి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. కాగా ఈ సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేలకు రోహిత్ శర్మ నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే.

అలాగే, విరాట్ కోహ్లి స్థానంలో బ్యాటింగ్ ఆర్డర్‌లో శుబ్‌మన్ గిల్‌ను ఆడించాలని సీనియర్ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ యువ క్రికెటర్లకు అవకాశం ఇచ్చి ప్రపంచ జట్టుకు ఎంపిక విధానంలో సులభతరం చేసుకోవచ్చు అనేది సీనియర్ల భావన. గాయాలతో బాధపడుతున్న ధోని నాల్గో వన్డేలో విశ్రాంతి తీసుకుంటే నాలుగో స్థానంలో ఎవరిని దించాలో అన్నది పరీక్షే. మూడో వన్డేలో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన అంబటి రాయుడు మంచి ఫామ్‌లో ఉండగా, దినేష్ కార్తీక్ స్థానం మాత్రం ధోనిపై ఆధారపడి వుంది. ఇక బౌలింగ్ విభాగంలో న్యూజిలాండ్ పర్యటనలో మూడు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు తీసిన కుల్దీప్ స్థానం, ఆరు వికెట్లు తీసిన చాహల్ స్థానాలు పదిలంగా ఉన్నాయి. సుదీర్ఘ ఆస్ట్రేలియా పర్యటన నుంచి బౌలింగ్ చేస్తున్న షమికి ప్రపంచకప్ నేపథ్యంలో విశ్రాంతినిచ్చి... రిజర్వు బెంచ్‌కు పరిమితమైన ఖలీల్ అహ్మద్, మహ్మద్ సిరాజ్‌లలో ఒకరికి చోటు దక్కే అవకాశముంది. ఇకపోతే న్యూజిలాండ్ జట్టులో కివీస్ సారథి విలియమ్సన్, టేలర్, గుప్తిల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌లు కూడా రాణిస్తే భారత్‌కు నాల్గో వన్డే గెలవడం కొంచెం కష్టంగా మారొచ్చు. బౌలర్లు బ్రాస్‌వెల్, లెగ్ స్పిన్నర్ సౌథీలు ఈ వేదికపై రాణించే అవకాశముంది. ఆల్‌రౌండర్ జిమ్మీ నిహషమ్‌కు ఈ మ్యాచ్‌లో చోటుదక్కే అవకాశం కూడా ఉంది.

**టీమిండియా :** రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, అంబటి రాయుడు, కేధార్ జాదవ్, ధోనీ(కీపర్). దినేష్ కార్తీక్, హర్థిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమి, సిరాజ్, జడేజా, ఖలీల్ అహ్మద్.

**న్యూజిలాండ్ జట్టు :** విలియమ్సన్ (కెప్టెన్), గుప్తిల్, మాన్రో, టేలర్, లాథమ్(కీపర్), నికోల్స్, నీషమ్, సాంట్నర్, అస్టిల్, ఫెర్గుస్సన్, బౌల్ట్, గ్రాంథోమ్, టిమ్ సౌథీ, హెన్రీ.



## తెలంగాణ ఎన్నికల ఫలితాలపై అనుమానాలు : లగడపాటి

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఇటీవల తెలంగాణలో వెలువడిన ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయని మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల్లో డబ్బు ప్రభావం అధికంగా ఉందని అన్నారు. బుధవారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వివిప్యాట్‌లో నమోదైన ఓట్లను లెక్కించలేదని అన్నారు. ఐదు గంటల తరువాత ఓటింగ్ శాతం పెరిగిందంటూ చెబుతున్న ఎన్నికల సంఘం గంట గంటకు ఎంత ఓటింగ్ జరిగిందో బహిర్గత పరచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష బలం గణనీయంగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. అనుమానాలను నివత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని చెప్పారు. ఈ అనుమానాలు తీరాలంటే వివిప్యాట్లను లెక్కించాలన్నారు. ఎలక్ట్రానిక్ యుగంలో ఓట్ల శాతం చెప్పడానికి అంత సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎవరికో లాభం చేయాలనో తాను ఫలితాలు వెల్లడించలేదన్నారు. ఒక మాటకు కట్టుబడి ఉన్నటువంటి వ్యక్తినని చెప్పారు. రోజురోజూకు మార్పులు జరిగాయని అన్నారు. అందుకే తాను విడుదల చేసిన ఫలితాల్లో తేడాలు వచ్చాయన్నారు. స్వతంత్రుల ఓటమికి కారణాలు తనకు తెలుసనని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తాను ముందస్తు సర్వేలు ప్రకటించనని అన్నారు.

## మహిళలకు రక్షణ ఇచ్చేది కాంగ్రెసే : రఘువీరా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మహిళలకు రక్షణ ఇచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని, మహిళా పక్షపాతం ప్రభుత్వం రావాలంటే మహిళలందరూ కాంగ్రెస్‌కు ఓటేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రఘువీరారెడి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోటీ చేయాలన్న ఆసక్తి ఉన్న మహిళలకు 25స్థానాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పేడాడ రమణీకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధానికాగానే మహిళలకు ఐదులక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, డ్వాక్రా సంఘాలకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ లభించేలా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకువస్తామన్నారు.

# ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- విద్యుత్ సౌధ వద్ద నిరుద్యోగుల ధర్నా
- అరెస్టు చేసిన పోలీసులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యుత్ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ నిరుద్యోగులు విద్యుత్ సౌద వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీరింగ్, సీనియర్ ఇంజనీరింగ్, జూనియర్‌లైన్‌మెన్‌తో పాటు ఖాళీగా ఉన్న 14వేల పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్‌తో నిరుద్యోగులు విద్యుత్ సౌధా వద్దకు ముందుగా చేరుకున్నారు. అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతి లేదని పోలీసులు నిరాకరించడంతో అక్కడే బైఠాయించారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. ధర్నా చేస్తున్న నిరుద్యోగులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు, అధ్యక్షులు రామన్నతో పాటు అందరినీ పోలీసులు బలవంతంగా వ్యాన్‌లో పడేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అనుమతిచ్చిన పోస్టులను కూడా భర్తీ చేయడం లేదని విమర్శించారు. వీటిని భర్తీ చేయాలని దశల వారీగా ఆందోళనలను నిర్వహించామని,



అయినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇటీవల మరో 1648 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు.

విద్యుత్తుశాఖలో పోస్టులు భర్తీకి అనుమతివ్వడం, రద్దు చేయడం అనవా యితీగా మారిందని వ్యాఖ్యానించారు. అధ్యక్షులు జి.రామన్న మాట్లాడుతూ ఇంజనీరింగ్ నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. విద్యుత్ శాఖలో 2012 నుంచి ఒక్క పోస్టు కూడా భర్తీ చేయ లేదని ఇంజనీరింగ్ నిరుద్యోగులు గౌతం, కార్తీక్ అన్నారు. తెలంగాణలో 6వేల పోస్టులు భర్తీ చేసినా రాష్ట్రంలో ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ నాయకులు కేశవ, ఇంజనీరింగ్ నిరుద్యోగులు శేఖర్, సాయి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రంగ ఉద్యోగులకు కనీస వేతనాలు

### నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు చెల్లించేలా చూడాలని కనీస వేతనాల సలహా మండలి కార్మిక శాఖమంత్రి పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకొచ్చింది. వేతనాల సలహా మండలి, పారిశ్రామిక వేత్తలతో మంత్రి పితాని సచివాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 10 జిల్లాల కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశాలు నిర్వహించి కార్మికుల అభిప్రాయాలను, వారి సమస్యలను రికార్డు చేశామని మంత్రికి సలహా మండలి తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల వారిగా విశ్లేషణ చేసి సరైన నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని కనీస వేతనాల సలహా మండలికి సూచించారు. నివేదిక ఇచ్చిన తక్షణమే ప్రభుత్వం సానుకూలంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పారిశ్రామిక రంగానికి, కార్మికులకు మధ్య వారధిలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ఒప్పంద కార్మికుల కనీస వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కనీస వేతనాల సలహా మండలి సూచనలు, సలహాలు ఇస్తే వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ రఘుపతుల రామ్మోహన్, సభ్యులు, కార్మిక శాఖ ఎడిషనల్ అజయ్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సిపియస్ విధానాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) తలపెట్టిన మహాపాదయాత్ర పోస్టర్‌ను యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఫెడరేషన్ అధ్యక్షులు షేక్ సాబ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాతపెన్షన్ పద్ధతిని కొనసాగించాలనీ, సిపియస్ విధానాన్ని రద్దు చేయాలని గత నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటానికి రాష్ట్రప్రభుత్వం నుంచి స్పందన కరవైందన్నారు. గతేడాది వేలాదిమంది ప్రభుత్వోద్యోగులు క్విట్ సిపియస్ జాతాలో పాల్గొన్నారనీ, కలెక్టరేట్ ముట్టడి కూడా చేశారనీ గుర్తుచేశారు. గతేడాది సెప్టెంబర్ 18న నిర్వహించిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా సిపియస్‌పై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ సిపియస్ రద్దు చేస్తామని చెబుతున్నా, టిడిపి మాత్రం దీనిపై మౌనం పాటిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో టిడిపి నేతలు సిపియస్ రద్దు చేస్తామని హామీలు గుప్పించారనీ, మరి ఎపిలో ఎందుకు రద్దు చేయడంలేదో చెప్పాలనీ ప్రశ్నించారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సిపియస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3నుండి5 వరకు గుంటూరు, ఏలూరు నుండి పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఏలూరు నుండి ప్రారంభమయ్యే పాదయాత్రలో కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఉద్యోగులు పాల్గొంటారనీ, గుంటూరు నుండి ప్రారంభమయ్యే పాదయాత్రకు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ఉద్యోగులు పాల్గొంటారని వివరించారు. ఫిబ్రవరి 5న పాదయాత్రలు విజయవాడ చేరుకున్న అనంతరం, ఎంబి విజ్ఞాన కేంద్రంలో భారీ సభ నిర్వహించను న్నట్లు తెలిపారు. సిపియస్ రద్దు కోరే ప్రతి ఉద్యోగి ఈ పాదయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## సర్టిఫై చేశాకే చేపల సరఫరా

### అధికారులకు సిఎస్ ఆదేశాలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రం నుంచి బీహార్, కోల్‌కతాతో పాటు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి చేసే చేపలకు ఫ్యాకింగ్‌లో ఫార్మాలిన్ వంటి రసాయనాలు వాడటం లేదని సర్టిఫై చేశాకే సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేట అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై బుధవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో ఆ శాఖ అధికారులు, ఎగుమతి దారులతో సిఎస్ సమీక్ష నిర్వహించారు. చేపల ఫ్యాకింగ్‌లో ఫార్మాలిన్ ఉపయోగిస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో క్వాలిటీ చెక్ చేసేందుకు సాంకేతిక బృందాలను పంపాల్సిందిగా ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశామన్నారు. బీహార్ నుంచి వచ్చిన అధికారులు పర్యటించి ఎలాంటి ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడటం లేదని నిర్ధారించిన తర్వాతనే నిషేధాన్ని బీహార్ ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు. ఎగుమతిలో ఆరోగ్య, భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చేపల ప్యాకింగ్‌లో కల్తీకి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎగుమతుల్లో నాణ్యతా ప్రమాణాల పాటిస్తున్నట్టు రైతులు, ఎగుమతి దారులు నిరూపిస్తే వారికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. ఆరోపణలకు ఆస్కారం లేకుండా ఎగుమతులు చేపట్టినట్టైతే దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా రాష్ట్ర చేపలకు మంచి మార్కెట్ ఉంటుందని, తద్వారా అందరికీ మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా కృష్ణా , పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి దమయంతి, కమిషనర్ శంకర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసి సమ్మెకు మద్దతుగా 4న అన్ని రాజకీయ పార్టీలతో సదస్సు

### భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన జెఎసి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆర్టీసి సిబ్బంది వేతన సవరణ, సంస్థ పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జెఎసి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా ఫిబ్రవరి 4న అన్ని రాజకీయ పార్టీలతో విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్టీసి కార్మిక సంఘాల జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాల నాయుడు తెలిపారు. ఈ మేరకు జెఎసి భవిష్యత్ కార్యాచరణను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, గుంటూరు మినహా అన్ని జిల్లాల్లో రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్ల మద్దతు కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ట్రేడ్ యూనియన్లతో మాత్రమే రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 4న నిర్వహించనున్న రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి సదస్సు ద్వారా సమ్మెకు మద్దతు కూడగట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ నెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె సన్నాహక ధర్నాలు, 28న అన్ని డిపోల వద్ద నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. బుధవారం అన్ని రీజినల్ మేనేజర్ కార్యాలయాల వద్ద మహా ధర్నాలు చేపట్టామని, ఈ ధర్నాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఆరు వేల మంది కార్మికులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

## 1న కేంద్ర హామీలపై చర్చ

### మంత్రి కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఫిబ్రవరి ఒకటిన కేంద్రం ఇచ్చిన విభజన హామీలపై ఈ శాసనసభ సమావేశాల్లో చర్చిస్తామని సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు చెప్పారు. శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన బుధవారం ఉదయం శాసనసభ వ్యవహారాల కమిటీ సమావేశం ముగిసిన తరువాత మంత్రి శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. 31వ తేదీ శుక్రవారం సిటింగ్ సభ్యుల మతికి సంతాపం తెలుపుతామన్నారు. 1వ తేదీన విభజనపై చర్చ ఉంటుందని, 2,3,4 తేదీలు మూడు రోజులు సెలవులని తెలిపారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68